www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పంజాగుట్ట ఠాణా ప్రక్షాళన!

హోంగార్డు నుంచి ఎస్సై వరకు 85 మందిపై బదిలీ వేటు.. కొత్తవారికి పోస్టింగ్

ప్రజాభవన్ రోడ్డు ప్రమాదంలో ఏకంగా నిందితుడిని మార్చి.. ఏమార్చే యత్నం

దుబాయ్ పారిపోయిన సాహిల్.. మరో కేసులో కస్టడీ నుంచి పరారైన నిందితుడు

నిత్యం ఏదో ఒక కేసులో అవినీతి ఆరోపణలు.. ఉన్నతాధికారులు సీరియస్

14

పెండింగ్ చలానాల
గడువు పెంపు



రాయితీతో చెల్లించేందుకు
15వ తేదీ దాకా అవకాశం

3

గురువారం | 1-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 304 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 2.05 తదుపరి సప్తమి; నక్షత్రం: చిత్త తె. 3.50 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ.10.02-11.49, దుర్ముహూర్తం: ఉ.10.37-11.22, మ.3.07-3.52; అమృతఘడియలు: రా.8.43-1.29; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 6.07 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

15,000 పోలీస్ ఉద్యోగాలు

త్వరలోనే నోటిఫికేషన్.. ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

నిరుద్యోగులకు ఇచ్చినమాట నిలబెట్టుకుంటాం

టీఎస్‌పీఎస్సీని ఇప్పటికే ప్రక్షాళన చేశాం

కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా దండగే

కవితకు ఉద్యోగం లేకుంటే 'ఎమ్మెల్సీ' ఇచ్చారు

నిరుద్యోగులకు ఉద్యోగాలను విస్మరించారు

స్టాఫ్‌నర్సులకు ప్రభుత్వం ఉద్యోగాలివ్వడాన్ని ప్రశ్నిస్తున్న హరీశ్‌రావుకు గడ్డిపెట్టాలి

కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు తీశారు

కాబట్టే నర్సులకు ఉద్యోగాలొచ్చాయి: రేవంత్

ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాల అందజేత

ట్రాఫిక్ హోంగార్డుల నియామకం

మూడు నెలల్లోగా ప్రక్రియ పూర్తి చేయండి

ఆలోగా ఇతర విభాగాల్లోని వారిని వాడుకోండి

రద్దీ టైంలో లా అండ్ ఆర్డర్ పోలీసులనూ..

ట్రాఫిక్ నిర్వహణపై ప్రణాళిక రూపొందించండి

గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్‌పై సీఎం సమీక్ష


స్టాఫ్ నర్సులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే 15 వేల పోలీసు ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేపట్టామని, అందులో భాగంగా కొత్తగా చైర్మన్‌ను, సభ్యులను నియమించామని తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని, ముఖ్యమంత్రిగా వారికి భరోసా ఇస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా నియమితులైన 6,956 మంది స్టాఫ్‌నర్సులకు బుధవారం ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను

మిగతా 13వ పేజీలో...

నంది.. ఇక గద్దర్ అవార్డు

వచ్చే ఏడాది నుంచి కవులు, కళాకారులు,

సినీ ప్రముఖులకు పురస్కారాలు

14

ఇదే శాసనం.. నా మాటే జీవో: ముఖ్యమంత్రి రేవంత్

గద్దర్ పేరిట జిల్లా, విగ్రహ ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చ

గద్దర్ స్ఫూర్తితోనే గడీల బద్దలు కొట్టానని వెల్లడి

వచ్చే ఎన్నికల్లో నిక్కర్ పార్టీకి ఓటమేనని వ్యాఖ్య

గద్దర్ కోరుకున్న మార్పు కోసం కృషి: భట్టి

3 వేలకు పైగా ఖాళీల భర్తీకి ఆర్టీసీ కసరత్తు!

2 వేలకు పైగా డ్రైవర్, 1000కి పైగా కండక్టర్, 200 సూపర్‌వైజర్ స్థాయి పోస్టులు

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముందుగానే నోటిఫికేషన్!

13

రాజన్న ఆలయాభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు

సమీక్షలో సీఎం రేవంత్



గ్రూప్-1పై దారెటు!

1 టీఎస్‌పీఎస్సీ పరిశీలనలో రెండు ప్రతిపాదనలు

1 మొదటిది- పరీక్ష రద్దు, అనుబంధ నోటిఫికేషన్ పోస్టుల సంఖ్య పెంచి.. మళ్లీ పరీక్ష నిర్వహణ!

1 రెండోది- గత పరీక్షతోనే పోస్టుల భర్తీకి యోచన

1 మొదటి ప్రతిపాదనకే టీఎస్‌పీఎస్సీ ప్రాధాన్యం

1 సుప్రీం కోర్టులో కేసు ఉపసంహరణకు అవకాశం

1 ఇతర పోస్టులపైనా కసరత్తు, త్వరలో రీషెడ్యూల్!

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 పోస్టుల భర్తీపై ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. పోస్టుల సంఖ్యను పెంచినా భర్తీ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండడానికి వీలుగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రధానంగా సుప్రీం కోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకుని, గతంలో నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తున్నారు. అనంతరం పరీక్ష నిర్వహించి, పోస్టులు భర్తీ చేయాలని చూస్తున్నారు. ఇది కాకుండా మరో ప్రతిపాదన కూడా అధికారుల దృష్టిలో ఉన్నా దానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఈ రెండు ప్రతిపాదనల్లో ప్రభుత్వం ఆమోదించే దానిని అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ పోస్టుల భర్తీలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగినందున మరోసారి అలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియపై కూడా అధికారులు దృష్టి సారించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా రిటైర్డ్

మిగతా 12వ పేజీలో...

ఖర్చు బారెడు.. ఫలితం జానెడు!



సాగునీటి రంగంలో పదేళ్లలో పరిస్థితి ఇదీ

రూ.1.82 లక్షల కోట్ల వ్యయంతో తడిసింది 17.24 లక్షల ఎకరాలే

ఉమ్మడి ఏపీలో 58 ఏళ్లలో తెలంగాణపై చేసిన వ్యయం రూ.54,021 కోట్లు

కొత్తగా సాగులోకి 57.87 లక్షల ఎకరాలు

రూ.93,872 కోట్ల ఖర్చు చేసిన కాళేశ్వరంతో 98 వేల ఎకరాలకే సాగునీరు

నీటిపారుదలశాఖపై సర్కారు శ్వేతపత్రం?!

వివరాలు సేకరించిన 'ఆంధ్రజ్యోతి'

అసెంబ్లీకి ముందే శ్వేతపత్రం విడుదల!



హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీలో (1956-2014 వరకు) అప్పటి ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతంలో సాగునీటి కల్పన కోసం రూ.54,021 కోట్లను వెచ్చించి 57.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాయి. కాగా తెలంగాణ ఏర్పాటు అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 నుంచి 2023 వరకూ ఏకంగా రూ.1,82,607 కోట్లు ఖర్చు చేసి 17.24 లక్షల ఎకరాలను మాత్రమే కొత్తగా సాగులోకి తీసుకొచ్చింది. అంటే, ఖర్చు మూడు రెట్ల కన్నా ఎక్కువ. ఫలితం మాత్రం మూడోవంతు కన్నా

మిగతా 3వ పేజీలో...

'కాళేశ్వరం'పై గవర్నర్‌కు 'కాగ్' ఆడిట్ నివేదిక

ఆమెకు అండగా సీఎం

1 వీధి వ్యాపారి కుమారికి రేవంత్ అభయం!

1 ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో హోటల్‌ను అక్కడి నుంచి తొలగించాలన్న పోలీసులు

1 మీడియా ప్రచారంతో స్పందించిన సీఎం!

1 ఆమె హోటల్ తొలగింపునకు చంద్రబాబే కారణమని వికృత ప్రచారానికి దిగిన వైసీపీ

1 నా ఓటు ఎప్పటి నుంచో టీడీపీకే: కుమారి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన చిన్న ఫుడ్‌స్టాల్ నడుపుకొంటూ సోషల్ మీడియాలో పాపులర్ అయిన కుమారికి ముఖ్యమంత్రి రేవంత్ అండగా నిలిచారు. ట్రాఫిక్ ఇబ్బందుల పేరుతో ఆమె ఫుడ్ స్టాల్‌ను వేరే చోటుకు మార్చాలంటూ పోలీసులు ఆదేశించగా.. ఆ అవసరం లేదని ఉన్నచోటే నడుపుకోవచ్చని సీఎం అభయమిచ్చినట్టు ఆయన పీఆర్వో అయోధ్యరెడ్డి ట్వీట్ చేశారు. ఆమె ఫుడ్ స్టాల్‌ను మార్చాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా డీజీపీకి, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులకు రేవంత్ సూచించారని ఆయన ట్విటర్ వేదికగా తెలిపారు. ప్రజాపాలన అంటే ఔత్సాహిక వ్యాపారులకు వెన్నుదన్నుగా ఉండడమేనని.. త్వరలోనే సీఎంవో నుంచి ఎవరో

మిగతా 13వ పేజీలో...


ఝార్ఖండ్ గవర్నర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న హేమంత్ సోరెన్

సోరెన్ అరెస్ట్

అక్రమ భూలావాదేవీల కేసులో ఝార్ఖండ్ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

అరెస్టుకు ముందు ఏడు గంటలకుపైగా సోరెన్‌ను ప్రశ్నించిన అధికారులు

సీఎం పదవికి హేమంత్ రాజీనామా

జేఎంఎం శాసనసభాపక్ష నేతగా సీనియర్ నేత చంపయ్ సోరెన్

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు విజ్ఞప్తి

రాంచీ, జనవరి 31: అక్రమ భూలావాదేవీలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసింది. రాష్ట్ర రాజధాని రాంచీలోని సీఎం అధికారిక నివాసంలో దాదాపు ఏడు గంటలకుపైగా ఆయనను ప్రశ్నించిన అనంతరం తమ అదుపులోకి తీసుకున్నట్లు

మిగతా 2వ పేజీలో...

ఈడీ అధికారులపై అట్రాసిటీ కేసు పెట్టిన హేమంత్ సోరెన్



'జ్ఞానవాపీ'లో పూజలు చేసుకోండి

హిందువులకు వారాణసీ కోర్టు అనుమతి

వారం రోజుల్లోగా తగిన ఏర్పాట్లు చేయాలి

జిల్లా యంత్రాంగానికి న్యాయాధికారి ఆదేశం

బేస్‌మెంట్‌లో పూజలకు అనుమతివ్వొద్దు

ముస్లిం కక్షిదారుల వాదన

వాజూ ఖానా ప్రాంతంలో మరోసారి ఏఎస్ఐ సర్వే

కోర్టును అభ్యర్థించిన హిందూ కక్షిదారులు

తదుపరి విచారణ 8న

2

కేటీఆర్.. కోర్టుకు రావాల్సిందే

ఆయనకు మరీ అంత అహంకారం పనికిరాదు

నా గౌరవం కోసం చివరి దాకా పోరాడతా

కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాగూర్

కేటీఆర్‌కు పరువు నష్టం నోటీసులు పంపినట్లు వెల్లడి

ఏపీలో వైసీపీకి మిగిలేది ముగ్గురు ఎంపీలేనని జోస్యం

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సిల్వర్ స్పూన్‌తో పుట్టిన కేటీఆర్‌కు అంత అహంకారం పనికిరాదని కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ వ్యాఖ్యానించారు. తనపై ఆరోపణలు చేసినందుకు మదురై కోర్టులో విచారణ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఆయన బదులిచ్చారు. 'క్లోజ్డ్ కేసును దారి మళ్లించడానికి ప్రయత్నించవద్దు. మీరు నాపై మాత్రమే ఆరోపణలు చేశారు. వీడియోలో ఇతర పేర్లు లేవు. మదురై కోర్టు విచారణను ఎదుర్కోకుండా పారిపోలేవు. మీకు ఇంత అహంకారం పనికిరాదు. మీ పెయిడ్ సోషల్ మీడియా టీమ్ 'ఎక్స్'లో మాత్రమే దాడి చేయగలదు. ఒక అమాయకుడిని నిందించినందుకు కోర్టుకు రావాల్సిందే. నిజాయతీపరులకు ఇంకెప్పుడూ ఇలా జరగకూడదు' అని ట్వీట్ చేశారు. కేటీఆర్‌కు పరువు నష్టం నోటీసులు పంపానని, 7 రోజుల్లోగా స్పందించకపోతే కోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. కాగా, ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీకి ముగ్గురు ఎంపీలు మాత్రమే మిగులుతారని జోస్యం చెప్పారు.

నోటీసులు నాక్కాదు.. కోమటిరెడ్డికి పంపండి ఠాగూర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్య

12

అడ్డగోలు 'విద్యుత్తు' కొలువులు

12

ఒక్కో పోస్టుకు 30 లక్షలు!

దొడ్డిదారిలో చేరిన వారికి నెలకు రూ.లక్ష జీతం

పథకం ప్రకారం తొలుత మేనేజ్‌మెంట్ ట్రైనీలు

2020లో నియామకాలు.. 2022లో పర్మినెంట్

తాజాగా వెలుగులోకి ఐదు కొలువుల బాగోతం



'మునిసిపల్' అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో

జోక్యం చేసుకోలేం

స్పష్టం చేసిన హైకోర్టు

13

పంచాయతీల్లో ప్రత్యేక పాలనపై స్టే ఇచ్చేందుకు

హైకోర్టు నిరాకరణ

కౌంటర్ దాఖలుకు ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్‌కు నోటీసులు

నేటితో సర్పంచుల పదవీకాలం పూర్తి

శతాబ్దాల కల సాకారం


పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముర్ము

అయోధ్యలో రామ మందిరం నిర్మించాం

దేశాన్ని 5 బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిపాం.. పదేళ్లలో ఎన్నో విజయాలు సాధించాం

ఉగ్రవాదం, విస్తరణవాదానికి దీటుగా బదులిచ్చాం

'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' నినాదంతో ముందుకు

తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ

పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 31: అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించాలని కొన్ని శతాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్నారని.. వారి కల ఇప్పుడు సాకారమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. గతంలో బలహీన ఆర్థిక వ్యవస్థలు కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఇప్పుడు ప్రపంచంలోనే బలమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె పార్లమెంటుకు వచ్చే సమయంలో కొత్త సంప్రదాయానికి తెర తీశారు. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు ముందు నడవగా.. వారి కంటే ముందు అధికారులు 'రాజదండం(సెంగోల్)'ను పట్టుకొని నడిచారు. రాష్ట్రపతి వస్తున్న సమయంలో ఉభయసభల సభ్యులు 'భారత్ మాతాకీ జై', 'జై శ్రీరామ్', 'జై జగన్నాథ్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఉభయసభలను

మిగతా 2వ పేజీలో...

నేడే మధ్యంతర బడ్జెట్

గెలిచాక పూర్తిస్థాయి బడ్జెట్



ఆ ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి

పార్లమెంటులో గొడవ చేసే వారిని ఎవరూ గుర్తుపెట్టుకోరు: మోదీ

2

ఈ నేల మాది.. మీరే వెనక్కు వెళ్లిపోండి!

లద్దాఖ్‌లో ఎల్‌ఏసీ వద్ద చైనా సైనికులను బెదరగొట్టిన భారత గొర్రెల కాపర్లు

న్యూఢిల్లీ, జనవరి 31: తూర్పు లద్దాఖ్‌లో భారతదేశ సరిహద్దు ప్రాంతంలో స్థానిక గొర్రెల కాపర్లు అసాధారణ ధైర్య సాహసాలను ప్రదర్శించారు. తమ దేశ భూభాగంలోకి రావొద్దని, గొర్రెలను మేపవద్దని అడ్డుపడిన చైనా సైనికులకు ఎదురొడ్డి నిలిచారు. "ఇది మా దేశం. ఈ నేలపై మాకే హక్కు ఉంది. అడ్డుకుంటే రాళ్లతో కొట్టడానికైనా వెనుకాడబోం" అంటూ వాళ్లను బెదరగొట్టారు. జనవరి 2న భారత సరిహద్దుకు కిలోమీటరు లోపల కాక్‌జంగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని లద్దాఖ్‌లోని చుషుల్ ప్రాంత కౌన్సిలర్ కోన్‌చోక్ స్టాన్‌జిన్ వెల్లడించారు. గొర్రెల కాపర్లు చైనా సైనికులతో వాగ్వివాదానికి దిగిన వీడియోను మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆరున్నర నిమిషాలు ఉన్న ఈ వీడియోలో.. గొర్రెల కాపర్లు టిబెటన్ భాషలో చైనా సైనికులతో గొడవపడటం కనిపించింది. కొద్ది సేపటి తర్వాత వారు అక్కడున్న రాళ్లను చేతుల్లోకి తీసుకోవడం, విసరడం కూడా ఉంది. వీడియోలో చైనా సైనిక వాహనం కూడా కనిపించింది. అయితే, అక్కడ భారత సైనికులు ఎవరూ లేకపోవడం గమనార్హం.


చైనా సైనికులతో గొర్రెల కాపర్ల వాగ్వాదం

జనవరి 12న భారత అధికారుల సందర్శన

కాక్‌జంగ్ ప్రాంతం లద్దాఖ్‌లోని న్యోమా నియోజకవర్గం కిందకు వస్తుందని స్టాన్‌జిన్ తెలిపారు. జనవరి 2న ఘటన జరిగిన రోజు చైనా సైనికులు.. కాక్‌జంగ్ తమ దేశ భూభాగమని, భారత గొర్రెల కాపర్లను వెనక్కు వెళ్లాలంటూ హెచ్చరించారని పేర్కొన్నారు. 35, 36వ పెట్రోలింగ్ పాయింట్ల వద్ద ఈ ఘటన జరిగిందని తెలిపారు. జనవరి 12న స్థానిక సర్పంచ్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేటు, భారత సైనికులు, ఐటీబీపీ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు చెప్పారు. ఈ సమస్య అక్కడితోనే పరిష్కారమైందన్నారు. చలికాలంలో కాక్‌జంగ్‌లో గొర్రెలకు మేత బాగా దొరుకుతుందని స్థానికులు తెలిపారు. 2019లో ఒకసారి గొర్రెలను మేపడానికి వెళ్లినప్పుడు కూడా చైనా సైన్యం గొర్రెల కాపర్లను అడ్డుకుందని గుర్తు చేశారు. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులైన సంగతి తెలిసిందే.

భారత సైనికులు అక్కడ ఎందుకు లేరు?

తాజా వీడియోపై కాంగ్రెస్ స్పందించింది. సరిహద్దుల్లో అంతా ప్రశాంతంగానే ఉందన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటనలు అంతా బూటకమేనని ఆరోపించింది. సరిహద్దుల్లో చైనా చొరబాట్లను మోదీ దాస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. తమ ఆరోపణలకు తాజా వీడియో ఓ నిదర్శనమన్నారు. ఘటన భారత భూభాగానికి కిలోమీటరు లోపల జరిగితే.. అక్కడ భారత సైనికులు ఎందుకు లేరని, పెట్రోలింగ్ పాయింట్ల నుంచి ఎందుకు వెనక్కు వచ్చారని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

లోకం తీరు



ప్రతిపక్షాలతో సంబంధముందని ఒప్పుకోవాలంటూ చిత్రహింసలు

» కోర్టుకు తెలిపిన పార్లమెంట్ ఘటన కేసు నిందితులు

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రతిపక్ష పార్టీలతో సంబంధముందని ఒప్పుకోవాలంటూ ఢిల్లీ పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారంటూ పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కేసు నిందితులు బుధవారం కోర్టుకు తెలిపారు. ఈమేరకు అదనపు సెషన్స్ కోర్టు జడ్జి హర్దీప్‌కౌర్ ముందు పిటిషన్ సమర్పించారు. ఈ కేసులో మనోరంజన్, సాగర్ శర్మ, లలిత్ ఝా, అమోల్ షిండే, మహేశ్ కుమావత్, నీలం ఆజాద్ అనే ఆరుగురు నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.. వారి కస్టడీని మార్చి 1వ తేదీ వరకు ఇప్పటికే పొడిగించారు. నిందితుల్లోని నీలం ఆజాద్ మినహా మిగతా అందరితో ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. 'ఉపా చట్టం కేసుతో పాటు ప్రతిపక్ష పార్టీలతో సంబంధముందని అంగీకరించి సంతకాలు చేయాలంటూ తీవ్రంగా కొట్టారు. కరెంట్ షాక్ ఇచ్చి చిత్రహింసలకు గురి చేశారు' అని నిందితులు వివరించారు. దీనిపై పోలీసుల సమాధానం కోరిన కోర్టు.. విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

నీట్ పీజీ పరీక్ష ఫీజు రూ.750 తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 31: వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు(ఎండీ, ఎంఎస్)ల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-పీజీ పరీక్ష రుసుమును తగ్గించారు. అన్ని వర్గాల అభ్యర్థులకు పరీక్ష ఫీజును రూ.750 తగ్గించామని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్(ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. త్వరలో జరగబోయే పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులందరికీ ఈ తగ్గింపు వర్తిస్తుందని వెల్లడించింది. జనరల్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థుల నుంచి ఇప్పటిదాకా పరీక్ష ఫీజు కింద రూ.4,250 వసూలు చేశారు. ప్రస్తుత నిర్ణయంతో ఆ మొత్తం రూ.3,500కు తగ్గింది. అలాగే ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఇన్నాళ్లూ రూ.3,250 చెల్లించేవారు. ఇప్పుడు వారు చెల్లించాల్సిన ఫీజు రూ.2,500కు తగ్గింది.

ఇజ్రాయెల్‌కు 10వేల మంది భారత కార్మికులు

జెరూసలెం, జనవరి 31: ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో కార్మికుల సంక్షోభం తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ఈ దేశానికి భారత్ నుంచి త్వరలో 10వేల మంది కార్మికులు రానున్నట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే వారం నుంచి వీరి రాక మొదలవుతుందని చెబుతున్నారు. వారానికి 700 నుంచి 1,000 మంది చొప్పున ఈ 10 వేల మంది వర్కర్లు వస్తారని ఇజ్రాయెల్ బిల్డర్స్ అసోసియేషన్ (ఐబీఏ) వర్గాలు చెబుతున్నాయి.

నితీశ్ దారిలో మరికొన్ని పార్టీలు!


బీజేపీ సీనియర్ నేత వెల్లడి..తమిళనాడు నుంచి మోదీ పోటీ?

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జేడీయూ అధినేత నితీశ్ కుమార్ దారిలో మరికొన్ని పార్టీలు మళ్లీ బీజేపీతో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నాయి! ఈ మేరకు ఆయా పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. పంజాబ్‌కు చెందిన అకాలీదళ్ కూడా తమతో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్నదన్న ఆయన.. కర్ణాటకలో జేడీఎస్ ఇప్పటికే తమతో కలిసి పోటీ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం దక్షిణాదికి చెందిన ఒకటి, రెండు పార్టీలతో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 9న పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఏ రోజైనా ఎన్నికల షెడ్యూలు ప్రకటించవచ్చన్న సంకేతాలు అందాయని.. సాధ్యమైనంత త్వరలో ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా.. దక్షిణాది రాష్ట్రాల్లో అధిక సీట్లు సాధించడంపై దృష్టి సారించిన ప్రధాని మోదీ.. సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, రామనాథపురం, కన్యాకుమారి సీట్లలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయవచ్చని సమాచారం. ప్రధాని మోదీ జనవరిలో తమిళనాట మూడురోజులు పర్యటించడమే కాక.. రూ.వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించడం, ఆలయాలను సందర్శించి భారీ రోడ్‌షోలను నిర్వహించడమే ఆయన ఆ రాష్ట్రం నుంచి పోటీ చేస్తున్నారనడానికి సంకేతాలనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇటీవల కేంద్రం పద్మవిభూషణ్ ప్రకటించిన ఐదుగురిలో ఇద్దరు తమిళనాడుకు చెందినవారే కావడం, కెప్టెన్ విజయ్‌కాంత్‌కు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించడం, ఐదుగురు తమిళులకు పద్మశ్రీ ప్రకటించడం కూడా ఇందుకు నిదర్శనమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, మోదీ దక్షిణాది నుంచి పోటీ చేయాలని భావిస్తే తెలంగాణ నుంచి పోటీ చేయాల్సిందిగా అభ్యర్థిస్తామని రాష్ట్రానికి చెందిన సీనియర్ నాయకుడొకరు తెలిపారు. తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోందని, మోదీ పోటీ చేస్తే కాషాయ ప్రభంజనం వీస్తుందని.. ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అడవుల్లో అన్నల సొరంగాలు

» డ్రోన్ కెమెరాల నుంచి తప్పించుకునే ఎత్తుగడ

» దంతేవాడలో 130 మీటర్ల సొరంగం గుర్తింపు



చర్ల, జనవరి 31: సినిమాల్లో విలన్లు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అడవుల్లో సొరంగాలు, డెన్‌లలో ఉండడం చూసే ఉంటారు. ఇప్పుడు మావోయిస్టులు కూడా అచ్చంగా అలాంటి వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. కూంబింగ్ సమయంలో, నిఘాలో భాగంగా పోలీసులు డ్రోన్ కెమెరాలను వాడడం పెరిగినప్పటి నుంచి.. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో ఈ తరహాలో భారీ ఎత్తున టన్నెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దంతేవాడ జిల్లా భైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో.. ఇంద్రావతి నది సమీపంలో ఇలాంటి ఓ సొరంగాన్ని సీఆర్పీఎఫ్, డీఆర్జీ జవాన్లు బుధవారం గుర్తించారు. ఆ వివరాలను దంతేవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. "బుధవారం ఉదయం దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేత మల్లేశ్‌తోపాటు.. 25-30 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు సమాచారం అందింది. డీఆర్జీ, సీఆర్పీఎఫ్ జవాన్లు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. పోలీసుల అలజడిని గుర్తించి, వారు పరారైనట్లు తెలుస్తోంది. అయితే.. డీఆర్జీకి చెందిన ఓ జవాను మావోయిస్టుల టన్నెల్‌ను తొలుత గుర్తించాడు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతం తెలంగాణకు సమీపంలో ఉండడం గమనార్హం.! దంతేవాడ పోలీసులు ఆ సొరంగాన్ని ధ్వంసం చేశారు. 10 అడుగుల లోతులో ఉన్న ఆ సొరంగంలో ఏకకాలంలో 100 మంది వరకు మావోయిస్టులు తలదాచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 130 మీటర్ల పొడవున్న ఆ సొరంగంలో.. ప్రతీ ఆరు మీటర్లకు ఒకటి చొప్పున వెంటిలేటర్లు ఉన్నాయి. గతంలోనూ ఈ తరహా సొరంగాలు వెలుగులోకి వచ్చినట్లు విశ్రాంత ఐపీఎస్ అధికారి, యాంటీ-నక్సల్స్ ఆపరేషన్స్ స్పెషల్ డీజీ ఆర్కే విజ్ పేర్కొన్నారు. 2012లో బీజాపూర్‌లో 80 మీటర్ల సొరంగం బయటపడిందని, బీజాపూర్ జిల్లా కేరపర్‌లో బయటపడ్డ మరో టన్నెల్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి తలదాచుకునేవాడని చెప్పారు. అబుజ్‌మడ్ ప్రాంతంలోనూ సొరంగాలు వెలుగు చూశాయని వివరించారు.

శతాబ్దాల కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి మాట్లాడుతూ.. కొత్త పార్లమెంట్‌లో ఇదే తన తొలి ప్రసంగమన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. గత ఏడాది మన దేశం ఎన్నో ఘనతలు సాధించిందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ఆదిత్య ఎల్-1 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు. జీ20 సమావేశాలను ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. ఆసియా క్రీడల్లో తొలిసారి 107, పారా క్రీడల్లో 111 పతకాలను సాధించామని చెప్పారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లును ఆమోదించుకున్నామని, ముస్లిం మహిళల కోసం 'ట్రిపుల్ తలాక్'కు వ్యతిరేకంగా కఠిన చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకొంటున్నామని, తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటు కానుందని గుర్తుచేశారు. ఆదివాసీ యోధులను స్మరించుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు.


ఆర్థికశాఖ సహాయ మంత్రులు, అధికారుల బృందంతో నిర్మల

పేదరికాన్ని పారదోలుతున్నాం..

చిన్నతనం నుంచీ 'గరీబీ హటావో' నినాదాన్ని వింటున్నామన్న రాష్ట్రపతి.. జీవితంలో తొలిసారి పేదరికాన్ని పెద్ద ఎత్తున పారదోలడం చూస్తున్నామని చెప్పారు. గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చామని, 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. యూపీ, తమిళనాడులో రక్షణ కారిడార్లు ఏర్పాటయ్యాయని.. రక్షణ రంగ ఉత్పత్తులు భారత్‌లో తయారవడం గర్వకారణమని తెలిపారు. 'ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా' మన బలాలుగా మారాయన్నారు. కరోనా, యుద్ధం వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలపై భారం పడకుండా చూసుకున్నామని పేర్కొన్నారు.

వారికి దీటుగా బదులిచ్చాం..

రైతులకు లాభాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ ద్వారా 10 కోట్ల మందికి పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. రూ.7 లక్షల ఆదాయం వరకు పన్ను లేకుండా చేశామని, సామాన్యులపై భారం పడకుండా పన్ను సంస్కరణలు చేపట్టామని వివరించారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా 4.10 కోట్ల మందికి పక్కా ఇళ్లు నిర్మించామని, పదేళ్లలో వేల ఆదివాసీ గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని.. 2 కోట్ల మంది మహిళలు స్వయం సమృద్ధి సాధించారని చెప్పారు. యువశక్తి, నారీశక్తి, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపై దేశాభివృద్ధి ఆధారపడి ఉందని విశ్వసిస్తున్నామని తెలిపారు. సరిహద్దుల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉగ్రవాదం, విస్తరణవాదానికి మన దళాలు గట్టిగా బదులిస్తున్నాయని పరోక్షంగా పాక్, చైనాలకు చురకలు అంటించారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో సురక్షిత పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సౌర విద్యుదుత్పత్తిలో మన దేశం ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచిందని చెప్పారు.

న్యూఢిల్లీ, జనవరి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. మోదీ 2.0 ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక మంత్రిగా వరుసగా ఆరోసారి నిర్మల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుత లోక్‌సభకు ఇదే చివరి బడ్జెట్ అయినందు వల్ల ఎలాంటి ప్రకటనలు వెలువడుతాయన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఈ మధ్యంతర బడ్జెట్‌లో దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు ఎన్నికలపరంగా ముఖ్యమైన రైతులు, మహిళలకు సంబంధించిన ప్రకటనలు ఉండవచ్చన్న అంచనాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. కాగా, నిర్మల ఈసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ నెలకొల్పిన రికార్డును సమం చేయనున్నారు. 2019 జూలై నుంచి ఐదుసార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌ను నిర్మల ప్రవేశపెట్టారు. గురువారం ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌తో ఆమె వరుసగా ఐదుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన గత ఆర్థిక మంత్రులు మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హాల రికార్డులను అధిగమించనున్నారు. మొరార్జీ దేశాయ్ 1959-1964 మధ్య ఆర్థిక మంత్రిగా ఐదు వార్షిక బడ్జెట్‌లు, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తంగా ఆయన పది బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు.

నేడే మధ్యంతర బడ్జెట్

లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

మళ్లీ మేం అధికారంలో వచ్చాక పూర్తి స్థాయి బడ్జెట్



న్యూఢిల్లీ, జనవరి 31: ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ సారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని, తిరిగి మళ్లీ బీజేపీ నేతృత్వంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ప్రధాని మోదీ చెప్పారు. తద్వారా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు కార్యకలాపాలను తరచూ అడ్డుకునే ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని మోదీ సూచించారు. పార్లమెంటులో గొడవ సృష్టించే, అంతరాయం కలిగించే ఎంపీలను వారి సొంత నియోజకవర్గ ప్రజలే గుర్తుపెట్టుకోరన్నారు. బుధవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. 'రామ్ రామ్' అంటూ పాత్రికేయులను పలకరించారు. గత పార్లమెంటు సమావేశాల్లో సభకు అంతరాయం కలిగించారంటూ ఉభయ సభల్లో కలిపి రికార్డు స్థాయిలో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వారిని టార్గెట్ చేస్తూ మోదీ వ్యాఖ్యలు చేశారు. వారు ప్రజాస్వామిక విలువలను అవమానిస్తున్నారని విమర్శించారు. మోదీ విమర్శలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హరిస్తోందని, నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత సమావేశాల్లో 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత ప్రభుత్వం కేవలం మూడు రోజుల్లో 14 బిల్లులను ఆమోదించిందని గుర్తుచేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించడం సంప్రదాయమని, కానీ డిప్యూటీ స్పీకర్ లేకుండానే ప్రస్తుత లోక్‌సభ ఐదేళ్ల టెర్మ్ ముగుస్తోందని, ఇది మోదీ నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు.

తమిళనాడులో సీఏఏను అనుమతించే ప్రసక్తే లేదు

చెన్నై, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను అనుమతించే ప్రసక్తే లేదని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. సీఏఏను త్వరలో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని కేంద్రమంత్రి శంతను ఠాకూర్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న స్టాలిన్ దీనిపై స్పందించారు. "రాష్ట్రంలో సీఏఏ అమలును ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోం. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కూటమి పార్టీలతో కలిసి భారీ ఆందోళనలు చేపట్టడంతో పాటు రెండు కోట్ల సంతకాలు సేకరించి రాష్ట్రపతికి పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నా. 2021లో మేం అధికారం చేపట్టిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలంటూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం నెరవేర్చాం" అని స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. సీఏఏతో మైనార్టీలకు ఇబ్బంది తలెత్తే అవకాశమున్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చట్టాన్ని అనుమతించబోమని అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి స్పష్టం చేశారు.


జోడో న్యాయ్ యాత్రలో ధ్వంసమైన రాహుల్ కారు అద్దం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన

మాల్దా, జనవరి 31: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ తెలిపారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా బుధవారం పశ్చిమబెంగాల్‌లోని మాల్దా జిల్లాలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. "మాకు సామాజిక న్యాయం కావాలి. మేము అధికారంలోకి రాగానే.. దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజల సంఖ్యను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తాం" అని రాహుల్ తెలిపారు. కాగా, భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ కారు అద్దం ధ్వంసమైంది. "మాల్దాలో రాహుల్‌గాంధీని కలిసేందుకు చాలామంది తరలివచ్చారు. వారిలో ఓ మహిళ ఒక్కసారిగా కారు ముందుకు వచ్చింది. దాంతో సడెన్‌గా బ్రేకులు వేయడంతో సెక్యూరిటీ సర్కిల్‌లో ఉపయోగించిన తాడు కారణంగా కారు అద్దం ధ్వంసం అయింది" అని కాంగ్రెస్ పేర్కొంది.

రాహుల్ వ్యాఖ్యలు అర్థరహితం: నితీశ్

పాట్నా, జనవరి 31: 'కుల గణన కేవలం నా ఆలోచన మాత్రమే. అది అందరికీ తెలుసు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ దానిని తమ ఘనతగా చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని బిహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. 'కాంగ్రెస్ ఒత్తిడితోనే బిహార్‌లో కులగణన జరిగిందంటూ రాహుల్ చేసిన ప్రకటన అర్థరహితం. వాళ్లు ఏమీ చేయడం లేదు. సీట్ల సర్దుబాటు గురించి కూడా మాట్లాడడం లేదు. నిజం చెప్పాలంటే ప్రతిపక్ష కూటమికి పెట్టిన 'ఇండియా' పేరు నా ఎంపిక ఏమాత్రం కాదు. అది వాళ్లు సొంతంగా తీసుకున్న నిర్ణయం. ఇప్పుడు నేను తిరిగి ఎన్డీఏకి వచ్చేశాను. ఇక్కడ నుంచి ఎక్కడికీ వెళ్లేది లేదు' అని నితీశ్ స్పష్టం చేశారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆర్జేడీ నాయకులపై ఈడీ చర్యలపై ఆయన స్పందిస్తూ... 'వాళ్లపై ఆరోపణలు ఉన్నాయి. ఈడీ తన పని తాను చేస్తుంది' అని అన్నారు.

సోరెన్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. కాగా, అరెస్టుకు ముందే సోరెన్ ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూటమి పక్షాల నేతలతో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. హేమంత్ రాజీనామాతో జేఎంఎం ఎమ్మెల్యేలు సమావేశమై, పార్టీ శాసనసభాపక్ష నేతగా సీనియర్ నేత, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి చంపయ్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఎంఎం కూటమికి 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని గవర్నర్‌ను చంపయ్ సోరెన్ కోరారు. కాగా, ఈడీ విచారణ సందర్భంగా హేమంత్ సోరెన్ అధికారుల ప్రశ్నలకు సరిగా సమాధానాలు చెప్పలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అందువల్లే ఆయనను మనీ లాండరింగ్ చట్టం కింద అరెస్టు చేసినట్లు పేర్కొన్నాయి. ఈడీ అధికారులు హేమంత్‌ను రాంచీలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టి, కస్టడీ కోరతారని తెలుస్తోంది. రాష్ట్రంలో జరిగిన అక్రమ భూలావాదేవీల్లో హేమంత్ సోరెన్ హస్తం ఉందని ఈడీ ఆరోపిస్తోంది. హేమంత్ సోరెన్ అరెస్టును కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా ఖండించారు. 'మోదీ వెంట వెళ్లని వాళ్లు జైలుకే వెళ్లాల్సి వస్తుంది. హేమంత్ సోరెన్‌పైకి ఈడీని పంపించి, ఆయన రాజీనామా చేసేలా ఒత్తిడి తేవటం దేశంలో సమాఖ్యతత్వానికి పెద్ద దెబ్బ. ప్రతిపక్షాల సారథ్యంలో ఉన్న ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రను బీజేపీ అమలు చేస్తోంది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే బీజేపీని ఓడించాలి' అని పిలుపునిచ్చారు. కాగా, గురువారం రాష్ట్ర బంద్‌కు జేఎంఎం పిలుపునిచ్చింది.


జేఎంఎం శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన చంపయ్ సోరెన్

ఈడీ అధికారులపై కేసు

ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఈడీ సోమవారం సోదాలు నిర్వహించటంపై హేమంత్ సోరెన్, రాంచీలోని ఓ ఎస్సీ/ఎస్టీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను, తన సామాజికవర్గాన్ని వేధించటానికి, ప్రతిష్ఠ దిగజార్చటానికే ఢిల్లీలో ఈడీ సోదాలు జరిపిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సోరెన్ అరెస్టయితే సీఎం పదవిని ఆయన భార్య కల్పన సోరెన్ చేపడుతారని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, ఈ ప్రతిపాదనను హేమంత్ వదిన సీతా సోరెన్ తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీలో ఎంతోమంది సీనియర్ నేతలు ఉన్నారని వారికి ముఖ్యమంత్రిగా పగ్గాలు అప్పగించవచ్చన్నారు. కుటుంబం నుంచే ఎవరినైనా ఎన్నుకోవాలనుకుంటే తానే అందుకు అర్హురాలినని, గత 14 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నానని చెప్పారు.

ఝార్ఖండ్ టైగర్

జేఎంఎం శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన చంపయ్ సోరెన్ గత మూడు దశాబ్దాలుగా 1991 నుంచి సెరికెలా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఝార్ఖండ్ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చంపయ్‌కు ఝార్ఖండ్ టైగర్‌గా పేరుంది. జేఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడు, హేమంత్ తండ్రి శిబు సోరెన్‌కు చంపయ్ సన్నిహితుడు. పేరులో సామీప్యత ఉన్నప్పటికీ శిబు సోరెన్ కుటుంబంతో ఆయనకు ఎటువంటి బంధుత్వం లేదు. ఆయనకు ఏడుగురు పిల్లలు.

కేజ్రీవాల్‌కు ఐదోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. 2022లో వెలుగు చూసిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి.. ఇప్పటికి నాలుగు సార్లు ఈడీ సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ స్పందించకపోవడంతో తాజాగా బుధవారం ఐదోసారి సమన్లు పంపింది. ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం విచారణకు రావాలని కోరింది. "లిక్కర్ కుంభకోణానికి సంబంధించి మిమ్మల్ని ప్రశ్నించాల్సి ఉంది" అని సమన్లలో ఈడీ అధికారులు పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఈసారి కూడా సమన్లపై స్పందించకపోతే ఈడీ అధికారులు కోర్టును ఆశ్రయించి అరెస్టు వారెంటు కోరే అవకాశం ఉంది. కాగా, గత ఏడాది ఏప్రిల్‌లో ఇదే కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు 9 గంటల పాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారు.

'జ్ఞానవాపీ'లో పూజలు చేసుకోండి

హిందువులకు వారాణసీ కోర్టు అనుమతి

వారాణసీ, జనవరి 31: జ్ఞాన్‌వాపీ వివాదం కేసులో హిందూ వర్గానికి భారీ ఊరట లభించింది. ఈ మసీదు సముదాయంలో ఇంతకు ముందు మూసివేసిన బేస్‌మెంట్ 'వ్యాస్ కా టెఖానా'లో ఉన్న దేవతామూర్తులకు పూజలు చేసుకొనేందుకు వారాణసీ కోర్టు అనుమతించింది. కాశీ విశ్వనాథ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కడ పూజలు నిర్వహించాలని స్పష్టం చేసింది. పూజల నిర్వహణ నిమిత్తం పూజారి ప్రవేశానికి వీలుగా అక్కడి బ్యారికేడ్లను తొలగించాలని, వారం రోజుల్లోగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని బుధవారం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. అప్పటిలోగా అంజుమన్ ఇంతేజామియా మస్జిద్ (జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ) సహా ప్రతివాదులకు అభ్యంతరాలు తెలియజేయడానికి అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేయాలని మసీదు కమిటీ భావిస్తోంది. జ్ఞాన్‌వాపీ మసీదు ప్రాంగణంలో 'శివలింగం' దొరికిందని భావిస్తున్న స్థలంలో సర్వే జరిపించేందుకు అనుమతించాలని కోరుతూ సుప్రీంకోర్టులో నలుగురు మహిళలు వ్యాజ్యం దాఖలు చేసిన నేపథ్యంలో తాజా తీర్పు వెలువడటం గమనార్హం. జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లో శృంగార గౌరి, ఇతర దేవతామూర్తులను పూజించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆచార్య వేదవ్యాస్ పీఠం ప్రధాన పూజారి శైలేంద్ర కుమార్ పాఠక్ వ్యాస్ 2023 సెప్టెంబరు 25న పిటిషన్ దాఖలు చేశారు. 1993లో సెల్లార్‌ను అధికారులు మూసివేసే వరకూ తన తాతగారైన సోమనాథ్ వ్యాస్ అక్కడ పూజాదికాలు చేసేవారని, ఆయన శివైక్యం చెందిన నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ పూజలు చేసే హక్కు తనకు కల్పించాలని శైలేంద్ర కోరారు. అయితే సెల్లార్ మసీదు సముదాయంలో భాగమని అందువల్ల అక్కడ పూజలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వరాదని ముస్లింల తరఫు న్యాయవాది వాదించారు. దీంతో కోర్టు బేస్‌మెంట్‌లో పూజలకు అనుమతించింది. ఇదిలా ఉండగా, కాశీ విశ్వనాథుడి మందిరం పక్కన ఉన్న ఈ మసీదు కింద ఆలయం ఉందని హిందూ కక్షిదారులు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. ఆ ప్రాంతంలో ఏఎస్ఐ సర్వేకు కోర్టు గతేడాది జూలై 21న ఆదేశించింది. సర్వే జరిపిన ఏఎస్ఐ డిసెంబరు 18న తన నివేదికను కోర్టుకు సమర్పించింది. హిందూ, ముస్లిం కక్షిదారులకు ఈ నివేదిక ప్రతులను ఇప్పటికే అందించారు. అయితే ఇక్కడి శివలింగానికి హాని కలుగకుండా వాజూ ఖానా ప్రాంతంలో మరోసారి ఏఎస్ఐ సర్వే చేయాలని హిందూ కక్షిదారులు కోర్టును అభ్యర్థించారు.

మార్చి 6 నుంచి హెచ్-1బీ వీసాల ప్రక్రియ

వాషింగ్టన్, జనవరి 31: అమెరికా హెచ్-1బీ దరఖాస్తు ప్రక్రియకు ముహూర్తం నిర్ణయించారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 6వ తేదీ నుంచి హెచ్-1బీ వీసాల దరఖాస్తులు స్వీకరించనున్నట్టు యూఎస్ ఫెడరల్ ఏజెన్సీ తెలిపింది. వార్షిక లాటరీ విధానంలో భారీ మార్పులు తీసుకువచ్చినట్టు పేర్కొంది. ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా.. వాటన్నింటినీ పాస్‌పోర్టు ఆధారంగా ఒకే దరఖాస్తుగా పరిగణించనున్నట్టు తెలిపింది. దీనివల్ల నకిలీలను గుర్తించడం, మోసాలను కట్టడి చేయడం వంటివి సులువవుతుందని ఫెడరల్ ఏజెన్సీ పేర్కొంది. ఎవరైనా ఒక వ్యక్తి వివిధ కంపెనీల్లో పనికోసం.. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు పెట్టినట్టయితే.. వాటిని పాస్‌పోర్టు నెంబరు ఆధారంగా ఒకే దరఖాస్తుగా పరిగణించనున్నారు. నకిలీలను అరికట్టే ప్రధాన లక్ష్యంతో నూతన విధానాన్ని తీసుకువచ్చినట్టు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) తెలిపింది. దీంతో అర్హులైన దరఖాస్తు దారులందరికీ అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు పేర్కొంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచి వీసా మంజూరు వరకు అన్నీ ఎలక్ట్రానిక్ విధానంలో జరుగుతాయని యూఎస్‌సీఐఎస్ వివరించింది. దరఖాస్తు దారులు ఖచ్చితంగా యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ అకౌంట్‌లో రిజిస్టర్ చేసుకుని.. తర్వాత ప్రక్రియ ప్రారంభించాలని, చెల్లింపులు కూడా దాని నుంచే చేయాలని సూచించింది. కంపెనీలకు సంబంధించి మాత్రం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఫిబ్రవరి 28నే ప్రారంభించనున్నట్టు తెలిపింది. వీసాల జారీ ప్రక్రియ అక్టోబరు 1 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది.

పెండింగ్ చలానాల చెల్లింపు గడువు పొడిగింపు

» రాయితీతో చెల్లించేందుకు 15వ తేదీ దాకా చాన్స్



హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ చలానాలను రాయితీతో చెల్లించే గడువును ప్రభుత్వ మరోసారి పొడిగించింది. సబ్సిడీ ఆఫర్‌తో చలానాలు చెల్లించేందుకు ఫిబ్రవరి 15 వరకు అవకాశమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.59 కోట్లు పెండింగ్ ట్రాఫిక్ చలానాలు ఉండగా సబ్సిడీ ప్రకటించిన తర్వాత ఇప్పటిదాకా 2 కోట్ల పైచిలుకు చలానాలు చెల్లింపులు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు.



ఎమ్మెల్సీలుగా మహేశ్‌గౌడ్, వెంకట్ ప్రమాణం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా రెండు ఎమ్మెల్సీ సీట్లకు ఏకగ్రీవంగా ఎన్నికైన టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం, ఆమీర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. మహేశ్‌గౌడ్, వెంకట్‌ను వారు అభినందించారు.

ఖర్చు బారెడు.. ఫలితం జానెడు!

(మొదటి పేజీ తరువాయి)

తక్కువ. అంతేకాదు, కీలకమైన కాళేశ్వరం ఎత్తిపోతల కింద రూ.93,872 కోట్లు ఖర్చు చేసి 98వేల ఎకరాల కొత్త అయకట్టుకే నీరిచ్చారని, అది కూడా ఇదివరకే ఉన్న చెరువుల కింద నీళ్లిచ్చిన అయకట్టేనని తెలుస్తోంది. మరో కీలకపథకం పాలమూరు-రంగారెడ్డి కింద రూ. 37,514 కోట్లు, సీతారామ ఎత్తిపోతల-సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కింద రూ.8,634 కోట్లు ఖర్చుపెట్టగా... కొత్తగా ఒక్క ఎకరానికీ నీళ్లివ్వలేదని వెల్లడైంది. తద్వారా గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్మాణాన్ని భూములకు నీళ్లివ్వడానికి కాకుండా సంపాదన కోసమే చేపట్టారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నీటిపారుదల శాఖపై వాస్తవాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాన్ని రూపొందిస్తోంది. దీంట్లో పొందుపర్చిన వివరాలను 'ఆంధ్రజ్యోతి' సేకరించింది. ఆ వివరాలివీ..

28390 బిల్లులు... 14,913 కోట్ల బకాయిలు

నీటిపారుదల శాఖ మీద రూ.14,913 కోట్ల బకాయిల భారం ఉంది. అంత మొత్తాన్ని ఆ శాఖ వివిధ నిర్మాణ సంస్థలకు చెల్లించాల్సి ఉంది. వీటికి సంబంధించిన 28,930 బిల్లులు రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. వీటిలో రూ.కోటి లోపు బిల్లులే 27,761 ఉండటం గమనార్హం. వీటికి చెల్లింపులు రూ.383 కోట్లు. రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల దాకా 309 బిల్లులు పెండింగ్‌లో ఉండగా... వాటి బకాయిలు రూ.595 కోట్లు, ఇక రూ.5 కోట్లు, ఆ పైన మొత్తాలకు 377 బిల్లులు ఉండగా... వీటి చెల్లింపులకు సంబంధించిన బకాయిలు రూ.13,935 కోట్లని గుర్తించారు. కేవలం పనులకు సంబంధించిన బిల్లులే రూ.9,543 కోట్ల దాకా ఉండగా... కాళేశ్వరంతో పాటు తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ రుణాలకు సంబంధించి అసలు, వడ్డీలు కలిపి రూ.4,192 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందని తేల్చారు.

అప్పులు రూ.98,391 కోట్లు

వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.1,21,697 కోట్ల రుణం పలు సంస్థల నుంచి మంజూరు కాగా... ఇప్పటి వరకూ రూ.98,391 కోట్ల మొత్తం విడుదలైంది. పలు ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ మొత్తాన్ని ఖర్చు చేశారు. కాళేశ్వరం కోసం రూ.87,449 కోట్ల రుణం తీసుకున్నారు. ఇప్పటికీ రూ.66,969కోట్ల అప్పు మిగిలి ఉంది. ఇక పాలమూరు-రంగారెడ్డికి కాళేశ్వరం కార్పొరేషన్ నుంచి రూ. 10 వేల కోట్లను రుణం తీసుకోగా... ఇంకా రూ.7,722 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఇక నాబార్డు నుంచి రూ. 2,014 కోట్లు మంజూరుకాగా... రూ.1613 కోట్లు విడుదల అయ్యాయి. మరో 401 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇలా మొత్తం 98,391 కోట్ల అప్పులు మిగిలి ఉన్నాయి.



ఈసారి జాగ్రత్త పడిన ప్రభుత్వం

ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇంధన శాఖలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, ఇంధనశాఖ శ్వేతపత్రం తయారీ బాధ్యతలను గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన అధికారులకే అప్పగించటంతో వారు గత ప్రభుత్వానికి వంతపాడే విధంగా వాటిని రూపొందించారన్న విమర్శలు వచ్చాయి. దీంతో ఈసారి ప్రభుత్వం జాగ్రత్త పడింది. వాస్తవాలను వెలికితీసేలా చర్యలు చేపట్టింది. కాగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇంధన శాఖలపై తయారు చేసిన శ్వేతపత్రాలను అసెంబ్లీ సమావేశాల్లో విడుదల చేయగా... ప్రస్తుత నీటిపారుదల శాఖ శ్వేతపత్రాన్ని అసెంబ్లీ సమావేశాలకు వారం లేదా పదిరోజుల ముందు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో నీటిపారుదల శాఖపై స్వల్పకాలిక చర్చను నిర్వహించాలని యోచిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. మరోవైపు, కాళేశ్వరంపై కాగ్ కూడా పూర్తిగా లెక్కలు తీసి.. నివేదికను జనవరి 29న ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికను కూడా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ప్రాజెక్టుల్లోని లోపాలన్నింటిపై సమగ్రంగా విచారణ జరిపింది కాగ్. దీంతో అటు కాగ్ నివేదిక, ఇటు శ్వేతపత్రంతో సాగునీటి రంగంలోని వాస్తవాలు రాష్ట్ర ప్రజానీకం ముందు వెల్లడవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రాజెక్టు	వ్యయం	సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు
కాళేశ్వరం ఎత్తిపోతల పథకం	93,872 కోట్లు	98 వేల ఎకరాలు
పాలమూరు-రంగారెడ్డి	37,514 కోట్లు	0
సీతారామ/సీతమ్మ ప్రాజెక్టు	8,634 కోట్లు	0
చనకా కొరాటా	1,093 కోట్లు	0
చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్)	399 కోట్లు	0
సదర్‌మట్	494 కోట్లు	9 వేల ఎకరాలు
మొడికుంటవాగు	65 కోట్లు	0
డిండి ఎత్తిపోతల పథకం	2,987 కోట్లు	0
గట్టు ఎత్తిపోతల పథకం	119 కోట్లు	0
పెద్దవాగు(జగన్నాథపూర్)	192 కోట్లు	0

రానున్న ఐదేళ్లలో (2024-25 నుంచి 2028-29 దాకా) రూ.97,774 కోట్లు వెచ్చించి 1,17,432 ఎకరాలను సేకరిస్తే కొత్తగా 51.74 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తేల్చారు. దీనికి సంబంధించిన వివరాలు..

సంవత్సరం	కావాల్సిన నిధులు	సేకరించాల్సిన భూమి	కొత్తగా వచ్చే ఆయకట్టు
2024-25	రూ.38,719 కోట్లు	54,440 ఎకరాలు	10.29 లక్షల ఎకరాలు
2025-26	రూ.26,321 కోట్లు	46,921 ఎకరాలు	14.37 లక్షల ఎకరాలు
2026-27	రూ.11,232 కోట్లు	10,426 ఎకరాలు	9.41 లక్షల ఎకరాలు
2027-28	రూ.6,061 కోట్లు	5194 ఎకరాలు	6.16 లక్షల ఎకరాలు
2028-29	రూ.15,441 కోట్లు	451 ఎకరాలు	11.51 లక్షల ఎకరాలు
మొత్తం	రూ.97,774 కోట్లు	1,17,432 ఎకరాలు	51.74 లక్షల ఎకరాలు

అయితే, ప్రభుత్వం తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టును సాధించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేస్తోంది.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

» టిక్కెట్‌కు సరిపడా డబ్బు ఇమ్మన్నందుకు రెచ్చిపోయిన వైనం

కొత్తపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): టిక్కెట్‌కు సరిపడా డబ్బు ఇవ్వమని అడిగిన ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై ఓ మహిళ రెచ్చిపోయింది. దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగడమే కాకుండా కండక్టర్‌ను కాలితో తన్నింది. ఎల్‌బీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జనవరి 25న జరిగిన ఈ ఘటనపై పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. జనవరి 25వ తేదీ ఉదయం హయత్‌నగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వెళుతున్న టీఎస్‌ఆర్టీసీ బస్సులోకి ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వద్ద ఓ మహిళ ఎక్కింది. దిల్‌సుఖ్‌నగర్‌కు ఓ జీరో టిక్కెట్(మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే టిక్కెట్) ఇవ్వాలని కండక్టర్‌ను అడిగింది. ఉచిత ప్రయాణ టిక్కెట్ కావాలంటే ఏదైనా గుర్తింపు కార్డు చూపాలని లేనిపక్షంలో టిక్కెట్ కొనుగోలు చేయాలని కండక్టర్ సూచించారు. దీంతో కార్డులేవీ లేవంటూ రూ.500 నోటు ఇస్తూ సదరు మహిళ కండక్టర్‌తో గొడవ మొదలుపెట్టింది. టిక్కెట్‌కు సరిపడా డబ్బు ఇవ్వాలని కండక్టర్ అడుగగా మరింత రెచ్చిపోయి భౌతిక దాడి చేసింది. ఈ ఘటనపై హయత్‌నగర్ డిపో మేనేజర్ ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసి వీడియో సాక్ష్యాన్ని కూడా అందజేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిబ్బందిపై దాడి చేస్తే కఠిన చర్యలు: టీఎస్‌ఆర్టీసీ హెచ్చరిక

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీఎస్‌ఆర్టీసీ హెచ్చరించింది. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినా, దాడులకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, పోలీసు శాఖ సహకారంతో నేరస్థులపై హిస్టరీ షీట్స్ తెరిపిస్తామని స్పష్టం చేసింది. ప్రయాణికులు తమ ఫిర్యాదులు ఏమైనా ఉంటే టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి లేదా డిపో అధికారులకు చెప్పి పరిష్కరించుకోవాలని సూచించింది.

కృష్ణా జలాలను చెరిసగం పంచితేనే..

ప్రాజెక్టులు అప్పగిస్తాం.. 811 టీఎంసీల్లో తెలంగాణకు 405.5 టీఎంసీలు కేటాయించాలి

» షరతులకు కట్టుబడితేనే సాగర్, శ్రీశైలం అప్పగింత

» కృష్ణా బోర్డుకు తేల్చేసిన తెలంగాణ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను చెరిసగం పంచడంతో పాటు షరతులకు అంగీకరిస్తే ప్రాజెక్టులను అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా బుధవారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి లేఖ రాసింది. బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-1) గంపగుత్తగా 811 టీఎంసీలను ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిందని, ఆ జలాలను రాష్ట్రాలకు పంచే బాధ్యతను జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2)కు అప్పగించారని గుర్తు చేసింది. 811 టీఎంసీలను 405.5 టీఎంసీల చొప్పున రాష్ట్రాలకు కేటాయించాలని స్పష్టం చేసింది. దాంతో పాటు శ్రీశైలం ఆపరేషన్ ప్రోటోకాల్‌లో కనీస నీటిమట్టాన్ని 830 అడుగులుగా పరిగణనలోకి తీసుకోవాలని, పోతిరెడ్డిపాడు నుంచి ఎస్ఆర్‌బీసీ (19 టీఎంసీలు, మద్రాస్ తాగునీటికి 15 టీఎంసీలు) కలుపుకొని 34 టీఎంసీలకు మించి తరలించకుండా కట్టడి చేయాలని తెలిపింది. కృష్ణా జలాలను బేసిన్ లోపలి ప్రాంతాలకు కేటాయించాలని కోరింది. ఒక సంవత్సరం వాడుకోని నీటిని వచ్చే సంవత్సరానికి (క్యారీ ఓవర్) అనుమతించాలని, వాడుకోని నీటిని ఖాతాలో లెక్కించకుండా చూడాలని పేర్కొంది. తాగునీటి వినియోగాన్ని బచావత్ ట్రిబ్యునల్ 20 శాతంగా మాత్రమే లెక్కించాలని అవార్డు ఉందని స్పష్టం చేసింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు వచ్చేలోగా లేదా పై షరతులకు కట్టుబడి ఉంటామని ప్రకటిస్తే శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను అప్పగించడానికి అభ్యంతరాలేవీ లేవని తెలిపింది. ఈ నెల 17న జరిగిన సమావేశంలో శ్రీశైలం, నాగార్జున సాగర్‌లను అప్పగించడానికి తాము అంగీకారం తెలిపామని మినిట్స్‌లో పేర్కొనడాన్ని తెలంగాణ తప్పుపట్టింది. ఆ సమావేశంలో నవంబరు 28కి ముందు పరిస్థితిని సాగర్‌లో పునరుద్ధరించాలని మాత్రమే కోరామని తెలిపింది. తక్షణమే సమావేశపు మినిట్స్‌ను సవరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ నెల 27న లేఖ రాశారు. కేంద్రానికి ఇదివరకే తమ అభిప్రాయాన్ని, ప్రాజెక్టుల అప్పగింతపై షరతులను నివేదించామని కృష్ణా బోర్డుకు బుధవారం రాసిన లేఖ ద్వారా స్పష్టం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ అప్పగింత లాంఛనాలపై చర్చించడానికి గురువారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్వహించనున్న సమావేశానికి తెలంగాణ హాజరుకానుంది. లేఖ ద్వారా నివేదించిన అంశాలన్నీ సమావేశంలో తేల్చేసి... తదుపరి చర్చకు అస్కారం లేకుండా బయటికి వచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

» సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

» హనుమకొండలో బహిరంగ సభ

» రేపటి నుంచి జాతీయ సమావేశాలు

హనుమకొండ క్రైం, జనవరి 31: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలని, కార్మికులంతా ఒక్కటై ప్రధాని మోదీని గద్దె దించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు ఆలిండియా సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశాలు కాజీపేటలో జరగనున్నాయి. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జిల్లా నాయకుడు ఉప్పలయ్య అధ్యక్షతన బుధవారం బహిరంగ సభను నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో మత విద్వేషాలు రేపుతూ ప్రజల్లో చిచ్చు పెడుతున్నారని తపన్‌సేన్ విమర్శించారు. తమ పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైనే అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టర్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేసిన సమ్మె అభినందనీయమని కొనియాడారు. ఫాసిస్టు విధానాలు విజయాలు సాధించిన దాఖలాలు దేశంలో ఎన్నడూ లేవని అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త భారత్ బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని తపన్‌సేన్ కోరారు. అంతకుముందు ములుగురోడ్డు నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.


బహిరంగ సభలో ప్రసంగిస్తున్న తపన్‌సేన్

7 గంటలు.. 75 ప్రశ్నలు!

» తొలి రోజు ఏసీబీ విచారణలో శివబాలకృష్ణ ఉక్కిరిబిక్కిరి

» నేడూ కస్టడీకి తీసుకోనున్న ఏసీబీ అధికారులు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ.. విచారణ సందర్భంగా ప్రశ్నల వర్షం కురిపించింది. 7 గంటలపాటు సాగిన విచారణలో దాదాపు 75 ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం శివ బాలకృష్ణను ప్రశ్నించింది. ఈ విచారణను వీడియో రికార్డింగ్ చేశారు. బుధవారం మొదటి రోజు విచారణలో శివబాలకృష్ణకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను సేకరించారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అందుకున్న జీతం సహా శివ బాలకృష్ణ పేరుతో ఉన్న ఆస్తులపై ఆరా తీశారు.



తొలుత కోర్టు అనుమతితో బుధవారం ఉదయం ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని బంజారాహిల్స్‌లోని తమ హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. ప్రత్యేక గదిలో సాయంత్రం 5గంటల వరకు విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తర్వాత చంచల్‌గూడ జైలుకు తరలించారు. గురువారం మళ్లీ బాలకృష్ణను ఏసీబీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. సోదాల సందర్భంగా స్వాధీనం చేసుకున్న పత్రాలను ముందుంచి ప్రశ్నించారు. మేడ్చల్ జిల్లా ఫిర్జాదిగూడలో పెంట రమాదేవి, రాయదుర్గం మై హోం బూజాలో డింగరి కిరణ్ ఆచార్య, హనుమకొండ భవానీనగర్‌లో సింగరాజు ప్రమోద్‌కుమార్, మాదాపూర్ సాహితి సుముఖి ఆర్బిట్ అపార్ట్‌మెంట్, హబ్సిగూడ వీవీనగర్‌లో కొవ్విడి సందీప్‌కుమార్ రెడ్డి పేరుతో ఉన్న ఫ్లాట్ల డాక్యుమెంట్ల గురించి ఏసీబీ విచారణలో ప్రశ్నించారు. బాచుపల్లి శిల్ప ఆర్‌వీ ధరిస్తా అపార్ట్‌మెంట్‌లో జి.సత్యనారాయణ మూర్తి పేరుతో ఉన్న ఫ్లాట్ వివరాలు సేకరించారు. వీటితోపాటు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలోని సాయి సందీప్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, కొత్తపేట ఆర్‌కేపురంలోని ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన వివరాలు అడగ్గా వాటితో తనకెలాంటి సంబంధంలేదని చెప్పినట్లు సమాచారం.

పూలే విగ్రహం పేరుతో రాజకీయాలు

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మంత్రి పొన్నం ఫైర్

» రాష్ట్రంలో కులగణన చేపడతామని వెల్లడి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొత్తగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. పూలే విగ్రహం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని, తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు వారికి పూలే గుర్తుకు రాలేదా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. ఆ పార్టీ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, శాసనసభాపక్ష నేత పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చి ఆ తర్వాత సామాజిక న్యాయం గురించి మాట్లాడాలన్నారు. లిక్కర్ కేసులో కవిత బిజీగా లేనట్టుందని, అందుకే కొత్త నినాదం ఎత్తుకుందని ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడుతూ.. శాసనసభలో సభ్యురాలు కాని వ్యక్తి (కవిత) శాసనసభ ఆవరణలో రాజకీయాలు చేయడం తగదని, చేయాలనుకుంటే బయట చేయాలని హితవు పలికారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా కులగణన చేపడతామన్నారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో బీసీ కులగణన చట్టబద్ధం చేయడంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కులగణనపైన ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటోందని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కాగా, బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు.

'కాళేశ్వరం'పై గవర్నర్‌కు 'కాగ్' ఆడిట్ నివేదిక

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రూపొందించిన నివేదికను తెలంగాణ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం బుధవారం రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించింది. 'కాగ్' ఇచ్చే రాష్ట్ర నివేదికలను అసెంబ్లీలో ప్రవేశ పెట్టడానికి ముందు గవర్నర్‌కు సమర్పించడం ఆనవాయితీ. ఆ మేరకు 'కాళేశ్వరం ప్రాజెక్టు పర్‌ఫార్మెన్స్' పేర రూపొందించిన ఆడిట్ నివేదికను గవర్నర్‌కు సమర్పించినట్లు అకౌంటెంట్ జనరల్ అనింద్య దాస్‌గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని ఫిబ్రవరి రెండో వారంలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది.

శనగ సాగులో విప్లవం.. నంద్యాల గ్రామ్-119

నంద్యాల టౌన్, జనవరి 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవిష్కరించిన నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకం శనగ రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. 2015లో నంద్యాల ఆర్ఏఆర్ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్-119 అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు చేస్తున్నారు. ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూ.. స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు అధికంగా ఉంది. చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలంలో పంట వచ్చే నంద్యాల గ్రామ్-119 మున్ముందు మరింత విస్తృత స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త వి.జయలక్ష్మి చెప్పారు. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావుగా, ఆకర్షణీయంగా ఉంటుందని తెలిపారు. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్లు, 1 లేదా 2 తడులతో 20-25 క్వింటాళ్ల దిగుబడితో ఎండు తెగులును తట్టుకునే శక్తి ఈ రకానికి ఉందన్నారు.

మేడారం జాతరను ఘనంగా నిర్వహిస్తాం: సీఎం

» మంత్రి కొండా సురేఖతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరగబోయే జాతర పోస్టర్లను మంత్రి కొండా సురేఖతో కలిసి సీఎం బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. అనంతరం జాతర ఏర్పాట్ల గురించి సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఖరీఫ్‌లో విత్తనాల కొరత రాకూడదు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టరు గోపి అధికారులను ఆదేశించారు. బుధవారం విత్తనాలు ఉత్పత్తి చేసే కంపెనీలతో ఆయన సమావేశం అయ్యారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు కావలసిన విత్తనాలను, వాటి నిల్వలను ముందస్తు అంచనాతో అందుబాటులో ఉంచాలని సూచించారు. నాణ్యత, లైసెన్సు లేకుండా విత్తనాలను అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాల్దీవుల్లో రాజకీయ తుఫాను

మాల్దీవుల్లో రాజకీయపరిణామాలు వేగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం నియమించిన ప్రాసిక్యూటర్ జనరల్ హుస్సేన్ షమీమ్ బుధవారం ఉదయం కత్తిపోట్లకు గురి అయి ఆస్పత్రిలో చేరడం ఇప్పటికే విపక్షానికి, అధికారపక్షానికి మధ్య ఉన్న వైరాన్ని మరింత పెంచుతుంది. ఆదివారం అక్కడి పార్లమెంటులో కీలకమైన ఓటింగ్ సందర్భంలో ఉభయపక్షాల మధ్య జరిగిన దాడులు మీడియాలో విస్తృతంగా ప్రచారమైనాయి. అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు మంత్రివర్గంలో నలుగురు మంత్రుల నియామకాన్ని తిరస్కరించి, స్పీకర్ సైతం రాజీనామా చేయాలంటూ విపక్షం డిమాండ్ చేసినప్పుడు ఈ ఘర్షణ జరిగింది. ఒకమంత్రి గట్టెక్కినా, సభ తిరస్కరించిన మిగతా ముగ్గురు మంత్రులను, అటార్నీ జనరల్‌ను అధ్యక్షుడు తిరిగి నియమించడంతో వివాదం మరింత వేడెక్కింది. మొయిజ్జు ఎన్నికైన మూడు నెలల్లోనే మాల్దీవుల్లో పరిణామాలు మారిపోవడం, అధ్యక్షుడిని అభిశంసించేందుకు విపక్షం సిద్ధపడటం వెనుక భారత్ హస్తం ఉన్నదని చాలామంది నమ్మకం.

'ఇండియా ఔట్' నినాదంతోనే మొయిజ్జు 54శాతం ఓట్లతో అధ్యక్షుడయ్యారు. తన చర్యలకు, చేష్టలకు ప్రజల మద్దతు ఉన్నదన్న వాదనతో అక్కడున్న భారత సైనికులను ఖాళీచేయమంటున్నారు. అధ్యక్షుడు కాగానే తొలిగా భారతదేశాన్ని సందర్శించే సంప్రదాయాన్ని పక్కనబెట్టి, తుర్కియే, సౌదీ అరేబియా వెళ్ళారు. తరువాత చైనా పోయి, భారీ పెట్టుబడులతో దేశాన్ని ఆదుకోమని విజ్ఞప్తిచేశారు. తిరిగి రాగానే భారత్ పేరు ఎత్తకుండా చిన్నదేశమనే కారణంతో మాల్దీవులను వేధించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇక, చైనా గూఢచర్య ఓడను మరమ్మత్తుల పేరిట లంగరువేసుకోవడానికి అనుమతించడం ఉభయదేశాల మధ్యా అగాధాన్ని మరింత పెంచింది. ఎవరికీ భయపడేది లేదు, మాల్దీవుల ప్రయోజనాలకే అగ్రస్థానం అంటూ ఎన్ని ముసుగుమాటలు చెప్పినా ఈ చర్యతో ఆయన భారతవ్యతిరేక వైఖరి మరింత స్పష్టమైంది. విపక్షం ఆయనమీద ప్రత్యక్షయుద్ధానికి దిగింది. అనాదిగా సన్నిహితంగా ఉన్న దేశాలను దూరంచేసుకోవడం వల్ల మాల్దీవుల దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతింటాయని విపక్షాలన్నీ సంయుక్త ప్రకటన చేశాయి. జమ్హూరీ పార్టీ నాయకుడు స్వయంగా అధ్యక్షుడిని కలిసి, భారతదేశాన్నీ, నరేంద్రమోదీనీ క్షమాపణలు కోరమంటూ సలహా ఇచ్చారు.

అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి సరిపడినన్ని సంతకాల సేకరణలో ఇప్పుడు విపక్షం ఉంది. 87 స్థానాలున్న సభలో 58మంది సంతకాలతో అధ్యక్షుడిని దింపివేయవచ్చునని అక్కడి రాజ్యాంగం చెబుతోంది. భారత అనుకూల పక్షమైన ఎండీపీ, దానితో చేతులు కలిపిన డెమొక్రాట్లు ఈ లెక్కకు దాదాపు సరిపోతారు. దీనికితోడు, నవంబరులో మొయిజ్జు అధ్యక్షుడు కాగానే, ఏడుగురు సభ్యులు రాజీనామా చేసి అధికారపదవులు చేపట్టగానే, తనకున్న సంఖ్యాబలంలో విపక్ష ఎండీపీ ఒక ప్రధాన సవరణ సాధించింది. దానిప్రకారం సభ మొత్తం బలం కాక, ఉన్న 80స్థానాలే పరిగణనలోకి వస్తాయి. ఈ కొత్త విధానం ప్రకారం అధ్యక్షుడిని అభిశంసించడానికి అవసరమైన సంఖ్యాబలం ఇంకా తగ్గుతుంది. ఆదివారం విపక్షాలు తిప్పికొట్టినప్పటికీ, అధ్యక్షుడు తిరిగి నియమించిన కొత్త అటార్నీ జనరల్ ఇప్పుడు సుప్రీంకోర్టులో ఈ మార్పు చెల్లకుండా చేసే ప్రయత్నంలో ఉన్నారు.

మొయిజ్జు అభిశంసన జరుగుతుందా, వెనుక భారత్ హస్తం ఉన్నదా అన్నవి అటుంచితే, ఉభయదేశాల మధ్యా అగాధం పెరగడం సరికాదు. ప్రధాని మోదీ లక్షద్వీప్‌ను సందర్శించి కొన్ని ట్వీట్లు చేయడం, వాటి ఆధారంగా అభిమానులు మాల్దీవులపని అయిపోయిందని వ్యాఖ్యానించడం, ఇందుకు ప్రతిగా మొయిజ్జు మంత్రులు ముగ్గురు నోరుపారేసుకోవడం తెలిసినవే. వారు సస్పెండ్ అయినా కూడా సమస్తరంగాలకు చెందిన మన ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో మాల్దీవులను వెంటాడి, దాని పర్యాటకాన్ని దెబ్బతీశారు. సున్నితంగా, దౌత్యంతో కాక, దెబ్బకు దెబ్బ విధానంలో వ్యవహారాలు చక్కబెట్టాలని చూసినప్పుడు, భారత్ పెద్దన్నలాగా వ్యవహరిస్తున్నదంటూ ఆడిపోసుకొనే చిన్నచిన్న పొరుగు దేశాలకు ఈ వైఖరి మరింత ఉపకరిస్తుంది, భయపెడుతుంది. పొరుగుదేశాలతో స్నేహానికే ప్రథమ తాంబూలం అంటున్నప్పుడు, తన రాజకీయ మనుగడకోసం ఒక నాయకుడు అనుసరిస్తున్న విధానాలకు ఆజ్యంపోయకుండా, చైనాకు మరింత సన్నిహితం కాకుండా జాగ్రత్తపడాలి. విదేశాంగమంత్రి జయశంకర్ అన్నట్టుగా ఎంతకాదనుకున్నా, ఎవరు వచ్చినాపోయినా, ఇరుగూ-

ఆంధ్రప్రదేశ్ మేలుకుంటుందా?





■ కె. శ్రీనివాస్

సందర్భం

తెలంగాణ అసెంబ్లీ ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి పరాజిత అధికారపక్షం బీఆర్ఎస్ తటపటాయిస్తోంది కానీ, కొన్ని ఇతర రాష్ట్రాల అధికారపార్టీలు మాత్రం జాగ్రత్త పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నేసి అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులను మార్చడం వెనుక తెలంగాణ ప్రభావం చాలా ఉన్నది. బీఆర్ఎస్ అపజయ కారణాలలో సిటింగ్‌లకు సీట్లు ఇవ్వడం అన్న ఒక్కదాన్నే జగన్ తీసుకున్నారు. ఏమి చేసినా ఏమీ ఉపయోగం ఉండని స్థితికి జగన్ పాలన చేరింది కనుక, ఆ మార్పుల వల్ల మరింత నష్టమే తప్ప లాభం లేదు. ఆశ్చర్యకరంగా, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా తెలంగాణ ఫలితాలను నిశితంగా పరిశీలించి, అనేక స్థానాలలో అభ్యర్థుల మార్పు గురించి తన ఆంతరంగికుడు పాండియన్‌కు సూచనలిచ్చారట. పొరుగు రాష్ట్రాల ఫలితాలను చూస్తే తప్ప, సొంత రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి వ్యతిరేకతలు అర్థం కాని స్థితికి రాజకీయపార్టీలు చేరుకున్నాయన్న మాట.

అధికారపార్టీలు మాత్రమే కాదు, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలిగిన వివిధ ఒత్తిడి సమూహాలు కూడా ఇతర రాష్ట్రాల అనుభవాల నుంచి నేర్చుకుంటున్నాయి, రంగంలోకి దిగుతున్నాయి. కర్ణాటకలో 'ఎద్దేళు కర్ణాటక' పేరుతో వందలాది గాంధేయ, లౌకికవాద, సోషలిస్టు ప్రజాసంఘాలు అప్పటి అధికారపార్టీ బీజేపీని ఓడించడానికి పనిచేశాయి. భారతీయ జనతాపార్టీ మత తత్వ విభజనవాద పాలనను ఓడించడం వారి నినాదం. కాంగ్రెస్‌కు ఓటు చేయమని వారు ఎక్కడా వాచ్యంగా చెప్పలేదు. కొన్ని చోట్ల జనతాదళ్ (సెక్యులర్)కు లబ్ధి చేకూరేటట్టు కూడా వారు పనిచేశారు. తెలంగాణలో కూడా జాగో తెలంగాణ, తదితర ఐక్యకార్యాచరణ సంస్థలు బీజేపీకి, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటువేయవలసిందిగా ప్రచారం చేశాయి. కాంగ్రెస్‌కు అనుకూలంగా వారు బాహాటంగా ప్రచారం చేయలేదు కానీ, వారి 'వ్యతిరేక' నినాదాలు, కాంగ్రెస్‌కే ప్రయోజనం కలిగించాయి. బీజేపీ వల్ల దేశ సామాజిక వ్యవస్థకు, ప్రజాస్వామిక విలువలకు పెద్ద అపకారం జరుగుతోందని నమ్మేవారు 2024 సాధారణ ఎన్నికలలో కూడా ఆ పార్టీని ఓడించడానికి తమ శాయశక్తులా పనిచేస్తారు. కర్ణాటక, తెలంగాణ అనుభవాలు జాతీయస్థాయిలో కూడా ఈ పౌరసమాజ కార్యకర్తలకు పాఠాలుగా పనికివస్తాయి.

అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ ప్రజాసంఘాల వారికి పెద్ద పజిల్‌గా మారింది. అక్కడ భారతీయ జనతాపార్టీ ప్రత్యక్ష బలం నామమాత్రమే. కానీ, రాష్ట్రంలోని రెండు ప్రధాన పక్షాలూ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయి. సాధారణ ఎన్నికల తరువాత, కేంద్రంలో బీజేపీ కూటమికి మద్దతుగా అవి నిలబడతాయి. మరి ఏపీలో, తాము ఎవరికి అనుకూలంగా, ఎవరికి ప్రతికూలంగా ప్రచారం చేయాలి? కొత్తగా ప్రాణం పోసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బలం కనీసంగా కూడా లేదు. 'మేలుకో ఆంధ్రప్రదేశ్' పేరుతో, రాష్ట్రంలోని లౌకికవాదులు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, మైనారిటీ ప్రయోజనాల సంఘాలు కలసి పనిచేస్తున్న వేదికకు అందుకే అడుగు ముందుకు వేయలేని విచిత్ర పరిస్థితి నెలకొన్నది.

నిజానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంలో వైసీపీ పాలన మీదనే కాదు, బీజేపీ మీద కూడా తీవ్రమైన అసంతృప్తి ఉన్నది. జాతీయస్థాయి విధానాల వల్ల కాదు, రాష్ట్రం మీద ఆ పార్టీ వైఖరి కారణంగానే ఆ అసంతృప్తి ఏర్పడింది. విభజనానంతరం రాష్ట్రపరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందాన ఉండిపోవడానికి బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వమే కారణమన్న అభిప్రాయం అక్కడ బలంగా ఉన్నది. 2019 ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీజేపీ మీద తీవ్ర విమర్శలే సంధించింది. తరువాత వైఖరి మార్చుకోవలసి వచ్చింది. బీజేపీ తీవ్ర మత జాతీయవాద విధానాలు సహజంగానే ఆంధ్రప్రదేశ్‌లోని ఆధునిక అభ్యుదయ జీవన విధానానికి సరిపోయేవి కావు. అయినా, ప్రస్తుతం బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో మౌనాంగీకారాన్ని ఎట్లా పొందగలుగుతోంది? అధికార వైసీపీ బీజేపీతో చేస్తున్న అనధికార స్నేహం అందుకు ప్రధానకారణం. జాతీయస్థాయిలో బీజేపీకి కావలసిన అన్ని అవసరాలను వైసీపీ నెరవేరుస్తోంది. జగన్ మీద కేసులు ముందుకురాకుండా, అప్పుల తిప్పలు లేకుండా బీజేపీ సాయపడుతోంది. ఈ పరస్పర సహకారం సజావుగా సాగుతోంది. అదనంగా రకరకాల రూపాల్లో కేంద్ర పార్టీకి రాష్ట్ర పార్టీ కప్పం కూడా చెల్లిస్తోందని చెప్పుకుంటారు. వైసీపీ సరే, మరి టీడీపీ ఎందుకు బీజేపీని జోను నుంచి తప్పించింది? ఎంతకైనా తెగించగలిగిన బీజేపీని, జగన్‌ను రెంటినీ ఒకేసారి ఎదుర్కోవడం కష్టం కాబట్టి. కనీసం ఎన్నికల పోరాటమన్నా అధిక దౌర్జన్యం లేకుండా సాగడానికి బీజేపీ అండ పనికివస్తుందని!

అంతమాత్రమే కాదు, 2019 ఓటమి తరువాత తెలుగుదేశం పార్టీ తన గతవైఖరులపై ఆత్మరక్షణలో పడింది. బీజేపీని అంత తీవ్రంగా విమర్శించి పొరపాటు చేశానేమోనన్న భావనలో పడింది. జగన్ ప్రభుత్వం దూకుడు దానికి తోడయింది. తిరిగి తనను కూడగట్టుకునే ప్రయత్నంలో, ఆచితూచి వ్యవహరించడం మేలు అనుకున్నది. అయితే, బీజేపీతో బాహాటంగా చెలిమి చేయడానికి టీడీపీ ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నదనుకోలేము. బీజేపీకి సొంతంగా ఉన్న ఓటు బలం లాభించేది కాకపోగా, దాని స్పర్శ రాజకీయంగా నష్టం కలిగించేది. ఎన్నికల తరువాత, తమ లోక్‌సభ సభ్యుల బలాన్ని బీజేపీకి సమర్పించడమొక్కటే వైసీపీకి అయినా టీడీపీకి అయినా ముందస్తు అవగాహన అవుతుంది. ఈ లోగా బీజేపీతో బహిరంగ స్నేహం లేదన్నట్టుగానే ఈ పార్టీలు వ్యవహరించాలి. ఈ పరిస్థితిలో బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే ప్రజాశ్రేణుల అభిమతం ఏమి కావాలి? బీజేపీకి వ్యతిరేకంగా ఓటు చేయాలనుకునేవారు ఎవరికి వేయాలి? దళితులు, ముఖ్యంగా దళిత క్రైస్తవులు, ముస్లిములు, కమ్యూనిస్టులు బీజేపీకి కానీ, బీజేపీకి సహాయపడే పక్షానికి గానీ ఓటు వేయడానికి ఇష్టపడరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరి సంఖ్య ప్రభావవంతమైనది.

రహస్యస్నేహాలు చేస్తున్నామని ఆ పార్టీలు అనుకున్నా, ప్రజలకు కలిగే అభిప్రాయాలు వేరు. వైసీపీ వాస్తవంలో బీజేపీకి ఎంతో సన్నిహితమైనప్పటికీ, పైకి మాత్రం అంటీముట్టకుండా ఉన్నట్టు కనిపిస్తున్నది. జనసేన వల్లనో మరొకందుకో బీజేపీతో స్నేహానికి టీడీపీ ఆరాటపడుతున్నట్టు అభిప్రాయం కలుగుతున్నది. ఈ పరిస్థితిలో బీజేపీ వ్యతిరేక ఓటరు వైసీపీని ఎంచుకునే అవకాశం లేదా ప్రమాదం ఉన్నది. ప్రమాదం అనడం ఎందుకంటే, జాతీయస్థాయిలో బీజేపీని వ్యతిరేకిస్తున్న పౌరసమాజం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ దుష్పరిపాలనను కూడా వ్యతిరేకిస్తున్నది. తెలంగాణలో రాష్ట్ర అధికార బీఆర్ఎస్‌ను, కేంద్ర అధికార బీజేపీని వ్యతిరేకించినట్టే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ వ్యతిరేక, వైసీపీ వ్యతిరేక ప్రచారం చేయాలనుకుంటోంది. మరి, ఆ వైఖరి తెలుగుదేశం పార్టీకి ఉపకరించేదే, అయితే, ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ, బీజేపీ వెంట ఉండేట్టు అయితే, పౌరసమాజం లక్ష్యానికి విఘాతం కదా? అందుకే 'మేలుకో ఆంధ్రప్రదేశ్' ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ బీజేపీ వ్యతిరేక వైఖరి తీసుకోవాలని కోరుకుంటున్నారు. తమ వాదనను పార్టీ నాయకత్వానికి చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

పౌరసమాజానిదే కాదు, వైఎస్ షర్మిల కూడా దాదాపు అదే సందిగ్ధాన్ని ఎదుర్కొనబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేయడానికి ఆమె ప్రయత్నం ప్రారంభించారు. అయితే, ఉన్నట్టుండి వెంటనే ఆ పార్టీ బలశాలిగా మారలేదు. ఎంతో కొంత బలం పుంజుకుని, కొద్దిపాటి ప్రభావాన్ని మాత్రమే వేయగలుగుతుంది. కాంగ్రెస్ సమీకరించగలిగే ఓట్లు, జగన్ బలాన్ని చీల్చితే తెలుగుదేశం పార్టీకి మేలు జరుగుతుంది. లేదా, ఏదో పెనుమార్పు జరిగి పెద్ద సంఖ్యలో ఆమె పక్షాన మోహరింపు సాధ్యపడితే- అందువల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలి జగన్‌కే ప్రయోజనం చేకూరవచ్చు. టీడీపీకి అయినా, వైసీపీకి అయినా షర్మిల కృషి ఉపయోగపడడం కాంగ్రెస్ విధానాలకు అనుకూలం అవుతుందా? ఆ రెండు పార్టీలూ కేంద్రంలో బీజేపీకే మద్దతు ఇచ్చే పక్షంలో, కాంగ్రెస్ తన జాతీయ ప్రత్యర్థికి మేలు చేసినట్టు కదా? ఇప్పటివరకు అయితే, షర్మిల జగన్‌ను, బీజేపీని ఘాటుగా విమర్శిస్తున్నారు. చంద్రబాబు జోలికి అంతగా పోవడం లేదు. చంద్రబాబు బీజేపీని వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టమైన వైఖరి తీసుకోగలిగితే, వామపక్షాలు, ప్రజాసంఘాలతో పాటు, కాంగ్రెస్ బేషరతు మద్దతుకూడా లభిస్తుంది. కానీ, అంతటి సాహసం ఆయన చేస్తారా? రామమందిర ప్రాణప్రతిష్ఠకు వెళ్లి నరేంద్రమోదీ ప్రాభవాన్ని కళ్లారా చూసిన తరువాత, సాధారణ ఎన్నికలలో బీజేపీ మరింత బలం పెంచుకుంటుందన్న ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో బీజేపీకి దూరం అని స్పష్టంగా చెప్పడం అంత సులభమేమీ కాదు. కానీ, రిస్క్ తీసుకోగలిగితే, విజయానికి అదనపు మెట్లు సమకూరతాయి.

ప్రధాన పార్టీలతో, వాటి వైఖరులతో నిమిత్తం లేకుండా, ప్రజాస్వామిక సమాజం తన పని చేసుకుపోవాలి. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన, చేస్తున్న అన్యాయాలను చెప్పడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ దుష్పరిపాలనను ఎండగట్టాలి. దేశాన్ని ఆవరిస్తున్న మతతత్వ నియంతృత్వాన్ని వ్యతిరేకించేవారిని సమీకరించి, తమతో ఏకీభవించేవారికే వారు ఓటు వేస్తారన్న వాతావరణం కల్పించాలి. అటువంటి భావాలకు అనుకూలత పెరిగితే, ప్రధాన పార్టీలు కూడా తమ వైఖరిని సమీక్షించుకోవచ్చు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ తనకు తిరుగులేని మద్దతుగా మారుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకుంటే ధైర్యం చేయవచ్చు. ప్రజల అండదండలు ఉండగా, ఎవరి తెరవెనుక మద్దతో తనకెందుకు అనుకుంటే, స్వేచ్ఛాయుతమైన విజయాన్ని అందుకోవచ్చు. వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలు ఉత్తరదేశమంతా ఏకపక్షంగానే ఉండవచ్చు, తక్కిన దక్షిణాది వలెనే ఏపీ కూడా తన ప్రత్యేకతను ఎందుకు చూపగూడదు?

> వైసీపీ వాస్తవంలో బీజేపీకి ఎంతో సన్నిహితమైనప్పటికీ, పైకి మాత్రం అంటీముట్టకుండా ఉన్నట్టు కనిపిస్తున్నది. జనసేన వల్లనో మరొకందుకో బీజేపీతో స్నేహానికి టీడీపీ ఆరాటపడుతున్నట్టు అభిప్రాయం కలుగుతున్నది. ఈ పరిస్థితిలో బీజేపీ వ్యతిరేక ఓటరు వైసీపీని ఎంచుకునే అవకాశం లేదా ప్రమాదం ఉన్నది. ప్రమాదం అనడం ఎందుకంటే, జాతీయస్థాయిలో బీజేపీని వ్యతిరేకిస్తున్న పౌరసమాజం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ దుష్పరిపాలనను కూడా వ్యతిరేకిస్తున్నది. తెలంగాణలో రాష్ట్ర అధికార బీఆర్ఎస్‌ను, కేంద్ర అధికార బీజేపీని వ్యతిరేకించినట్టే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ వ్యతిరేక, వైసీపీ వ్యతిరేక ప్రచారం చేయాలనుకుంటోంది. మరి, ఆ వైఖరి తెలుగుదేశం పార్టీకి ఉపకరించేదే, అయితే, ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ, బీజేపీ వెంట ఉండేట్టు అయితే, పౌరసమాజం లక్ష్యానికి విఘాతం కదా? అందుకే 'మేలుకో ఆంధ్రప్రదేశ్' ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ బీజేపీ వ్యతిరేక వైఖరి తీసుకోవాలని కోరుకుంటున్నారు. తమ వాదనను పార్టీ నాయకత్వానికి చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

> ప్రధాన పార్టీలతో, వాటి వైఖరులతో నిమిత్తం లేకుండా ప్రజాస్వామిక సమాజం తన పని చేసుకుపోవాలి. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన, చేస్తున్న అన్యాయాలను చెప్పడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వ దుష్పరిపాలనను ఎండగట్టాలి. వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలు ఉత్తరదేశమంతా ఏకపక్షంగానే ఉండవచ్చు, తక్కిన దక్షిణాది వలెనే ఏపీ కూడా తన ప్రత్యేకతను ఎందుకు చూపగూడదు?

ఈ విద్యా సంక్షోభానికి వేలెవరి వైపు చూపిద్దాం?

గత మూడు దశాబ్దాలుగా సమాజం ఎంతో మార్పు చెందింది. పట్టణీకరణ పెరిగింది. సమాచార విప్లవం పేరుతో ప్రతి ఇంటికి స్మార్ట్ ఫోన్లు చేరాయి. అక్షరాస్యత పెరిగింది. ఇతర అనేక సామాజిక మార్పులను కూడా మనం చూస్తున్నాం. ఈ మార్పులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో ఏమైనా మార్పు జరిగిందా? నూతన సవాళ్లను ఎదుర్కోవడానికి ఉపాధ్యాయులు సిద్ధమయ్యారా?

మారిన కాలంలో ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాలల సంఖ్య పెరగడం, కొత్త తరం ఉపాధ్యాయులు వృత్తిలో చేరడంతోపాటు అనేక సామాజిక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రైవేటు విద్య, ఇంగ్లీషు విద్య, పూర్వ ప్రాథమిక విద్య అందుబాటులోకి రావడంతో, ఉపాధ్యాయుల పిల్లలతో సహా, ఉన్నత వర్గాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ బడులను వీడి ప్రైవేటు స్కూల్స్‌లో, ఇంగ్లీష్ మీడియంలో చేరడం మొదలైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, పౌర సమాజాలు సాగించిన విద్యా ఉద్యమాల వలన బడుగు బలహీన వర్గాల కుటుంబాలలో కూడా విద్య పట్ల డిమాండ్ పెరిగింది. పిల్లల్ని చదివించాలనే బలమైన కోరికతో అనేక విధాలా త్యాగాలకు సిద్ధపడ్డ తల్లితండ్రులను చూస్తున్నాం. సమాజంలో వచ్చిన ఈ మార్పులను విద్యాశాఖ కానీ, ఉపాధ్యాయులు కానీ సరిగా గమనించ లేదనే చెప్పాలి.

విద్య పట్ల పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వాలు నిధులు కేటాయించడం లేదు. ప్రైవేటు విద్యపై నియంత్రణ పెట్టడం లేదు. ఇప్పటి విద్యా సంక్షోభానికి అదే పునాది. జనాభా నియంత్రణ విధానాలు చిన్న కుటుంబాలకు దారి తీయటం వల్ల గ్రామాలలో పిల్లల సంఖ్య తగ్గిపోయింది. 1991లో వెయ్యి మంది జనాభాకు 29.24 జనాభా వృద్ధి రేటు ఉండగా, 2011లో అది కేవలం 12.58కు తగ్గి పోయింది. ఈ నిష్పత్తిలోనే పాఠశాలలో ఒకటవ తరగతిలో నమోదు పడిపోయింది. ప్రభుత్వ బడులను వదిలి విద్యార్థులు ప్రైవేటు విద్య బాట పట్టడం కూడా మన కళ్ల ముందే జరిగిపోయింది.





విద్యార్థుల హక్కుల రక్షణతోనే, ఉపాధ్యాయుల హక్కులు కూడా ముడిపడి ఉంటాయని, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రభుత్వాలు చట్టబద్ధ బాధ్యత వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ఎన్నడూ చర్చలు చేసిన దాఖలాలు లేవు. అందుకే ఆయా సంఘాలు అటు సమాజంలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ విశ్వసనీయత కోల్పోయాయి.

ప్రస్తుత విద్యా సంక్షోభంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల మీద బాధ్యత మరింత పెరిగింది. విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న అధికార యంత్రాంగంలో కింది వరసలో ఉన్న ఉపాధ్యాయులు విద్యాశాఖ ప్రతినిధులుగా సమాజానికి కనిపిస్తారు. అందుకే సమాజంలో విద్యాపరమైన ఏ చర్చ జరిగినా నింద మోయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద పడుతుంది. ఈ ఒత్తిడి నుండి దూరంగా ఉన్న అధికార బృందం కూడా తమ బాధ్యత ఏమి లేనట్లు, ఉపాధ్యాయులే ఈ దుస్థితికి కారుకులన్నట్లు నిందించడం చూస్తున్నాం.

ఉపాధ్యాయుల సమస్యలను మాట్లాడడానికి, వృత్తిపరమైన హక్కులను పొందడానికి పలు ఉపాధ్యాయ సంఘాలు ఏర్పాటయ్యాయి. కానీ వారి చర్చలలో ఎక్కడా విద్యా వ్యవస్థకు జరుగుతున్న దీర్ఘకాల నష్టంపై ఆయా సంఘాల ద్వారా అధ్యయనం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. కొన్ని సంఘాలయితే మరో అడుగు ముందుకేసి రాజకీయ పార్టీలకు సంఘీభావం ప్రకటించి గెలిపిస్తాం, లేదా ఓడిస్తాం అని ప్రకటించే స్థాయికి చేరుకున్నాయి.

విద్యార్థుల హక్కుల రక్షణతోనే, ఉపాధ్యాయుల హక్కులు కూడా ముడి పడి ఉంటాయని, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రభుత్వాలు చట్టబద్ధ బాధ్యత వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ఎన్నడూ చర్చలు చేసిన దాఖలాలు లేవు. అందుకే ఆయా సంఘాలు అటు సమాజంలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ విశ్వసనీయత కోల్పోయాయి. చివరకు ఆయా సంఘాల సభ్యులలో కూడా పెద్దగా ఉత్సాహం, ఆశ కనిపించవు. ప్రభుత్వ సంస్థాగత తప్పిదాల వల్ల ఉపాధ్యాయుల మీద ఉన్న నమ్మకం మెల్ల మెల్లగా సన్నగిల్లుతున్నది.

1991లో 30శాతంగా ఉన్న పట్టణ జనాభా 2011 నాటికి 38.67శాతంగా నమోదు అయ్యింది. ఒక అంచనా ప్రకారం తెలంగాణ పట్టణ జనాభా 50శాతానికి చేరుకుంది. మరీ ముఖ్యంగా నాలుగు జిల్లాల పట్టణ జనాభా చూస్తే– హైదరాబాద్ 100శాతం, మేడ్చల్ 91.4శాతం, వరంగల్ అర్బన్ 68.8శాతం, రంగారెడ్డి 57.7శాతంగా నమోదు అయ్యింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం కొత్తగా పాఠశాలలు ఏర్పాటు చేయలేదు.

రాష్ట్రంలో ఉన్న మొత్తం 60 లక్షల మంది విద్యార్థులలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోనే దాదాపు 21 లక్షల మంది విద్యార్థులు (35శాతం) ఉన్నారు. ఈ మూడు జిల్లాలలో దాదాపు 15 లక్షల మంది విద్యార్థులు (76.42 శాతం) ప్రైవేటు బడులకు వెళుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇందులో 80శాతం పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే. వీళ్ళు కడుతున్న ఫీజులు వేల కోట్లలో ఉంటాయి.

ప్రభుత్వ బడుల తరగతి గదిలో పిల్లల సామాజిక నేపథ్యం పూర్తిగా మారిపోవడం, అతిపేద వర్గాలకు చెందిన పిల్లలే ఈ బడులకు రావడం, తల్లిదండ్రుల భాగస్వామ్యం కొరవడడం, కొన్ని ప్రాంతాల తరగతి గదులలో వివిధ రాష్ట్రాలు, వివిధ భాషలు మాట్లాడే వలస కార్మికుల పిల్లలు చేరడం, తరగతి వారీ అభ్యాసనా సామర్థ్యాలు అందించలేకపోవడం... ఈ కారణాల వల్ల కేంద్ర రాష్ట్ర విద్యా శాఖలు నిర్వహించే నివేదికలలో రాష్ట్ర గ్రేడింగ్ దేశంలోనే చివరి వరసలో పడిపోయింది. నివేదికలు రాగానే హడావిడిగా మీటింగులు పెట్టడం, హుకుంలు జారీ చేయడం, మొక్కుబడి ట్రైనింగులు పెట్టడమే తప్ప, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వినే పరిస్థితి లేకపోవడంతో ఉపాధ్యాయులే దోషిగా నిలబడాల్సి వస్తున్నది. ఈ నిందారోపణలు ఎదుర్కోవడానికి ఉపాధ్యాయులు పిల్లల మీద నెపం వేస్తున్నారు. ఒత్తిడి పెరిగినప్పుడు తరగతికి ఒక టీచర్ లేనందువల్లనే ఈ దుస్థితి అని ఆత్మరక్షణ వాదనలు చేస్తున్నారు. అయిదు తరగతులకు అయిదుగురు టీచర్లు ఉన్న బడులలో కూడా అభ్యసన సామర్థ్యాలలో పెద్దగా తేడాలేదని అధికారులు ప్రతివాదనకు దిగుతుంటారు.

ఈ పరిస్థితిలో విద్యాశాఖకు ఏం కావాలో ఉపాధ్యాయులకు అర్థం అయిపోయింది. చదువు చెప్పినా చెప్పకపోయినా కంప్యూటర్లలో నింపడానికి డాటా, సమాచారం కావాలి. 'నింపు, పంపు' వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే నైపుణ్యాన్ని వంటపుచ్చుకున్నారు ఉపాధ్యాయులు. అధికారులకు కావలసిన ఫార్మాట్లలో ఒక్కసారి కాదు, పదిసార్లు కూడా నివేదికలు సమర్పిస్తున్నారు. ఇచ్చిన సమాచారమే పదిసార్లు ఇస్తున్నారు. ఈ సమాచారం ఇచ్చేవాళ్ళకు ఉపయోగం ఉండదు, తీసుకునే అధికారికి ఉపయోగం ఉండదు, పిల్లలకు అసలే ఉపయోగం ఉండదు. వీటికితోడు బోధనేతర పనులైన మధ్యాహ్న భోజన లెక్కలు, 'మన ఊరు మన బడి' లెక్కలు ఉండనే ఉన్నాయి.

ఈ దుస్థితి చూస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు నిద్ర లేని రాత్రుళ్లు గడుపుతూ, ఆందోళన చెందుతూ తమ తమ పాఠశాలలను రక్షించుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. రిటైర్డ్ టీచర్స్ ఆనాటి తమ అనుభవాలను నెమరు వేసుకుంటూ దిగాలుగా ఉన్నారు. ఈ సంక్షోభ నివారణకు ఒక పెద్ద ప్రజా ఆందోళన అవసరం. ఇందులో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమే అయినప్పటికీ ఈ ఆందోళనకు పౌర సమాజాన్ని సిద్ధం చేయాలి. ప్రభుత్వాల ప్రాధాన్యతలు మార్చుకునేలా, విద్యా వ్యవస్థలో మౌలికమైన మార్పులు చేర్పులు చేసే విధంగా ఒత్తిడి పెంచిన నాడే ప్రభుత్వ విద్యకు, ఉపాధ్యాయులకు సమాజంలో పూర్వ వైభవం లభిస్తుంది.

■ ఆర్. వెంకటరెడ్డి
నేషనల్ కన్వీనర్, ఎం.వి. ఫౌండేషన్

పాలమూరుపై ఇంకా వేలాడుతున్న నిర్జల ఖడ్గం!

తెలంగాణ ఉద్యమంలోకి కేసీఆర్ ప్రవేశించిన తొలినాళ్ళలోనే మహబూబ్‌నగర్ ఎంపీగా ఆర్డీఎస్ నిర్మాణాన్ని బాగుచేయటం గురించి మాట్లాడారు. ఆయన ఎంపీగా ఉండగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ఆమోదం పొందింది (ఆయన పార్లమెంటులో ఆ రోజు పాల్గొన లేదన్నది వేరే విషయం, కానీ ముఖ్య విషయం). తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది, కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ మహబూబ్‌నగర్ సాగునీటి సమస్య పరిష్కారమే కాలేదు.

ఈ తొమ్మిదిన్నరేళ్ళ కాలం అంతా ఆయనేం చేశారు? జూరాల – పాకాల అనే ఒక తప్పుడు పథకాన్ని ముందుకు తెచ్చి మా మీద హుంకరించి నాలుక కరుచుకున్నాడు. డిండి ఎత్తిపోతల, పాలమూరు – డిండి అనే ఒక అనవసర, వ్యర్థ ప్రతిపాదన తెచ్చి అసెంబ్లీలో ఉపసంహరణ ప్రకటించారు. ఒక సర్వే కంపెనీతో కాని పథకానికి ఎనిమిది సర్వేలు చేయించి నిధులను ముగించారు. పదిహేనేండ్ల పోరాటం తరువాత 2013లో వచ్చిన 72 జీఓ అమలుకు సర్వేచేయించి అది కాదని, ఆ జీవో మూలనపడేసి 105 జీఓ ఇచ్చి పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని షోకేసులా మిగిల్చారు. రాజోలిబండ కాలువ కట్ట దుస్థితి ప్రత్యక్షంగా చూసి పునర్నిర్మాణం తన కర్తవ్యం అని చెప్పి వదిలేశారు. తొమ్మిదిమంది ముఖ్యమంత్రులు పోటీపడి సుంకేశుల ఆనకట్టను భారీ ప్రాజెక్టుగా నిర్మించి ఆర్డీఎస్‌ను శిథిల సమాధిగా మిగిల్చినారని చేసిన విమర్శలను మరిచిపోయాడు. ఇవాల్టికీ ఆర్డీఎస్ పాలకులందరినీ వెక్కిరిస్తూనే వుంది.

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానిది ఈ అన్నింటికన్నా విషాద గాథ. కేసీఆర్ నిర్వాకం వల్ల ఈ పథకమే చేర్వాకమైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి పథకాలన్నీ నాగర్ కర్నూల్‌లో పార్లమెంటు పరిధిలో మాత్రమే వున్నాయి. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో చేపట్టవలసిన భీమాను కూడా రెండుగా విభజించి ఫేజ్ 1 మాత్రమే ఇక్కడ చేపట్టారు. కోయిల్‌సాగర్ చాలా చిన్న లిఫ్ట్. ఈ కారణంగానే మహబూబ్‌నగర్, చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గాల బీడు భూముల కోసం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టాలని పోరాడాం. అనాడు అది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అర్థమై జీఓ ఇచ్చారు. కానీ తొలి తెలంగాణ ప్రభుత్వానికి అర్థం కాలేదు. కేసీఆర్‌కు మహబూబ్‌నగర్ అక్కర లేకపోయింది. మూడు ఏండ్లలో పూర్తి చేస్తానని చెప్పి ఎనిమిదిన్నర ఏండ్లు గడిచినా ఏ పనీ పూర్తి కాకుండానే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. ప్రచారం మీద వుండిన శ్రద్ధ పని మీద లేకపోయింది. రీ డిజైన్ మీద, నిర్మాణలోపాల మీద విమర్శను, సూచనలను స్వీకరించే సహృదయం లేకపోయింది. 'మొండి లెక్కలతో తప్పుడు పద్ధతులతో మొదలు పెట్టిందేమో పెట్టారు. కనీసం భీమా లాగా రెండు భాగాలుగా విభజించండి. సగం నీటినైనా వరద కాలంలో కృష్ణా భీమా నదుల సంగమ స్థలం నుండి తీసుకునే చర్యలు చేపట్టండి. తూర్పున కల్వకుర్తి లిఫ్టుతో సమన్వయపరిచి ఇబ్రహీం పట్నం దాకా, పడమర మరోభాగంలో మహబూబ్‌నగర్, చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గాలకు నీరివ్వండి' అని ఎంత కోరినా వినిపించుకోలేదు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ చేపట్టి తీరుతామని అనేకసార్లు నమ్మబలికి పాలమూరు పథకంలో నించి ఆ చివరి రిజర్వాయర్‌ను లోలోపలే తొలగించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం నాసిరకంగా ఉన్నా తగిన పర్యవేక్షణ చేపట్టలేదు. అసలు కేంద్రీకరణంతా కాళేశ్వరం వైపు తరలిపోయింది. కనీసం కాళేశ్వరమైనా చేవెళ్ళ దాకా తెచ్చారా అంటే అదీ లేదు. అన్ని విధాలుగా దక్షిణ తెలంగాణకు, మహబూబ్‌నగర్ రంగారెడ్డి జిల్లాలకు సాగునీరందకుండా దెబ్బకొట్టారు.

కృష్ణ నీటి సాధనను ఇంతకన్నా జటిలంగా మార్చారు. కృష్ణానది నీటిని బచావత్ ట్రిబ్యునల్ రాష్ట్రాలకే పంచింది. బ్రిజేశ్ ట్రిబ్యునల్ కూడా అవే రాష్ట్రాలకు సర్దుబాటు చేసింది. రెండవ ట్రిబ్యునల్ నివేదిక నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడబోతున్నా ట్రిబ్యునల్ వేచి చూడకుండానే నివేదిక ఇచ్చేసింది. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్లు ప్రత్యేకించి వివరణలు నీటి పంపిణీకి ప్రతిబంధకంగా వున్నాయి. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి నీరివ్వాలి గదా అని కేంద్ర ప్రభుత్వం అనుకోలేదు. విభజన చట్టం ప్రకారం ఏర్పడిన అపెక్స్ కౌన్సిల్ ముందు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ముందు తెలంగాణ ప్రభుత్వం తన వాటా కోసం సరైన వాదనలు వినిపించలేదు. ఒక ఏడాది కోసమైనా పంచిన నీటికి 299 అనే అంకెకు సమ్మతి తెలిపి సంతకం చేయవలసింది కాదు. 'ఒక్క సంవత్సరానికే ఒప్పుకున్నాం' అని ఎంత చెప్పినా పొరుగు రాష్ట్రం అదే అంకెను ఖాయం చేసుకొమ్మని చెబుతున్నది. దీనిని ఎదిరించకుండా అసలు తెలంగాణకు నీటి పంపిణీని వ్యతిరేకిస్తూ ఇంకోవైపు కొత్త పథకాలతో నీరు తరలించుకుపోయే పనిలోకి దిగిన పక్క రాష్ట్రానికి పోయి 'బేసిన్లు లేవు బేషజాలు లేవు' అని గంభీరమైన ప్రసంగాలు చేసి వచ్చారు. తెలంగాణకు నీరు పంచకుండానే దిగువ నుండి మరింత దిగువకు గోదావరి – కృష్ణా – కావేరి అనుసంధానానికి కేంద్రం ఏకపక్షంగా తెగబడుతుంటే నిలువరించలేపోయారు. 2021లో కేంద్ర ప్రభుత్వం అధికార దాహంతో నిర్దిష్టంగా విభజన చట్టం చెప్పకపోయినా గోదావరి, కృష్ణా నదులను స్వాధీనం చేసుకునే రాజపత్రం విడుదల చేసింది. ఈ దుష్ట చర్యనూ కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకోలేకపోయింది. తొమ్మిదిన్నర ఏండ్లుగా నిర్లక్ష్యం చేసిన ఈ సమస్యలన్నీ తీవ్రమైన సవాళ్ళుగా కొత్త ప్రభుత్వం ముందుకు వచ్చాయి. కృష్ణానదీ జలసాధనకు సంబంధించి, పంపిణీలో, వినియోగంలో తీవ్రమైన అంతరాలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్యనే కాక తెలంగాణ రాష్ట్రంలో కూడా న్యాయమైన పరిష్కారాన్ని కోరుతున్నాయి.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలు ఎన్నో ఉన్నాయి: 1. కృష్ణానది నీటిలో తెలంగాణ రాష్ట్రానికి న్యాయమైన నీటి వాటా సాధించాలి. సాధించిన నీటిని రాష్ట్రంలో జిల్లాల మధ్య పునః పంపిణీ చేయాలి. 2. తెలంగాణలోని భూములకు అన్నింటికీ ఒక పంటకైనా సాగునీరు అందించకుండా నదుల అనుసంధానాన్ని అంగీకరించకూడదు. నదుల అనుసంధానం పర్యావరణ పరిరక్షణకు భంగకరం కూడా. 3. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇది వరకే అనుభవంలో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టను కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి సుంకేసుల ప్రాజెక్టు వలే ఆధునీకరించి నిర్మించాలి. గ్రావిటీతో అందే నీటిని కూడా ఎత్తిపోసే పద్ధతి కాకుండా తెలంగాణ సరిహద్దులో మన వాటా మేరకు 15.9 టీఎంసీల నీరు తీసుకునే విధానం సాధించాలి. 4. కొల్లాపూర్ మాజీ శాసనసభ్యుడు సింగోటం చెరువులోకి ఎత్తిపోసిన నీటిని జూరాల కాలువతో గ్రావిటీతో నిండే పథకానికి తరలించే విధంగా చేసిన తప్పుడు ప్రతిపాదనకు కేసీఆర్ అనుమతించాడు. ఈ పనులు ఆపి భూముల ఆక్రమణ నివారించాలి. అక్కడి సాగునీటి అవసరాలు జూరాల ఎడమ కాలువతో తీర్చాలి. 5. కల్వకుర్తి, నెట్టెంపాడు లిఫ్టు పథకాలు మిగులు జలాలతో, భీమా కోయిల్‌సాగర్ లిఫ్టు పథకాలు నికర జలాలతో చేపట్టారు. ఈ పథకాల స్థాపిత సామర్థ్యం కేటాయింపు మేరకు నీరు తీసుకునే విధంగా లేదు. తక్షణం ఒక వెయ్యి కోట్లు కేటాయించి నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పొలాలకు నీరు అందించాలి. 6. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో జరిగిన పనులను సమగ్రంగా సమీక్షించాలి. ఈ పథకాన్ని కల్వకుర్తి లిఫ్టు పథకంతో సమన్వయపరిచి అదనపు రిజర్వాయర్ల అవసరం లేకుండా సాగు నీరివ్వాలి. (దీనిని 105 జీఓతో చేపట్టారు). 7. పాలమూరు – రంగారెడ్డి పథకంలో కరివెన, ఉదండపూర్ రిజర్వాయర్ల నుండి పడమటి వైపు టన్నెల్స్, కాలువలు తవ్వే ప్రతిపాదన విరమించి 72, 69 జీఓలను సమీక్షించి జూరాలపై నుండి అనగా భీమా కృష్ణ సంగమం నుండి నీరు తీసుకుని మహబూబ్‌నగర్ చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గ భూములకు నీరివ్వాలి. దీనినే నారాయణపేట – కొడంగల్ పథకం అంటున్నారు. 8. తెలంగాణ నీటి హక్కుల రక్షణ కోసం జూరాల దిగువన వెల్టూరు – గొందిమల్ల బ్యారేజి నిర్మించాలి. 9. చంద్రసాగర్ నుండి అమ్రాబాద్‌కు పైపులతో సాగునీరివ్వాలి. అలాగే జూరాల నుండి స్వతంత్ర లిఫ్టుతో కరువు బారిన పడిన గట్టు మండల బీడు భూములకు సాగునీరివ్వాలి. 10. గోదావరిలో అదనపు నీరుంది కనుక బస్వాపూర్ రిజర్వాయర్ నుండి గ్రావిటీతో డిండి పథకపు రిజర్వాయర్‌ను నింపాలి. నాగర్‌కర్నూల్ జిల్లా భూముల ముంపు నివారించాలి.

> కేసీఆర్‌కు మహబూబ్‌నగర్ అక్కర లేకపోయింది. మూడు ఏండ్లలో పూర్తి చేస్తానని చెప్పి ఎనిమిదిన్నర ఏండ్లు గడిచినా ఏ పనీ పూర్తి కాకుండానే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. ప్రచారం మీద వుండిన శ్రద్ధ పని మీద లేకపోయింది. రీ డిజైన్ మీద, నిర్మాణలోపాల మీద విమర్శను, సూచనలను స్వీకరించే సహృదయం లేకపోయింది.



• ఎం.రాఘవాచారి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA



గురువారం 1 ఫిబ్రవరి 2024



ఇక 'ప్రత్యేక' పాలనే

నేటితో ముగిసిన గ్రామ పంచాయతీల పాలక మండలిల పదవీకాలం

- రేపటి నుంచి ప్రత్యేక అధికారులను నియమించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ల జాబితా సిద్ధం
- తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచుల విజ్ఞప్తి
- పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళనలో సర్పంచులు
- 6 నెలల తరువాత ఎన్నికలు జరిపేందుకు సర్కారు నిర్ణయం

వరంగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీల పాలక మండలి పదవీకాలానికి నేటి తెరపడనుంది. 2019 ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచులు, వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరందరి ఐదేళ్ల పదవీకాలం గురువారంతో పూర్తి అవుతుంది. అయితే పంచాయతీలకు ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం ఆసక్తిగా లేకపోవటంతో సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. వివిధ శాఖల అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి అందజేశారు. అయితే తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోలేదు. పంచాయతీల్లో చేసిన పనులకు భారీగా బిల్లులు రావాల్సి ఉందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

స్పెషల్ ఆఫీసర్లు

గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తి కానుండటంతో శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. దీనికి కోసం జిల్లా పంచాయతీ అధికారులు స్పెషల్ ఆఫీసర్ల జాబితాను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్లకు పంపించారు. ఈ జాబితాలో మేజర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈలు, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంఈవోలు, పశువైద్యాధికారులు, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్‌లు, ఎంపీడీవో కార్యాలయ సూపరెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈవోలను గ్రామ పంచాయతీల జనాభా ఆధారంగా స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామం కూడా చేశారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, నూతన నిర్మాణాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్స్‌లు, పన్నుల వసూళ్లు, పచ్చదనం, వీధిదీపాల ఏర్పాటు తదితర పనులను పర్యవేక్షించనున్నారు. ఆరు నెలలపాటు జీపీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగించే అవకాశం ఉంది.

సర్పంచులకు ఝలక్

కరోనా నేపథ్యంలో రెండున్నరేళ్ల గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, స్పెషల్ ఆఫీసర్ల పాలన వద్దని, ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకవచ్చి తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులు అందుబాటులో ఉండరని, జవాబుదారీతనం కొరవడుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి సర్పంచులు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ సర్పంచుల విజ్ఞప్తిపై ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సర్పంచులే అత్యధికంగా ఉన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం సర్పంచ్‌ల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించలేదనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన రానుండటంతో సర్పంచుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. తమకు రావాల్సిన బిల్లులు ఎప్పటికి వస్తాయో అనే టెన్షన్‌లో ఉన్నారు.

భారీగా పెండింగ్ బిల్లులు

కరోనా కారణంగా రెండేళ్లు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. ఆ తరువాత పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం సర్పంచులు సొంత డబ్బులను ఖర్చు చేసి పనులు చేశారు. దీంతో కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతీ గ్రామంలో ఇప్పటికే సర్పంచులు రూ.2లక్షల నుంచి రూ.25లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశారు. అయితే తమ పదవీకాలం పూర్తి కాకముందే తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తికి కూడా ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు.

గ్రామపంచాయతీలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, ములుగు జిల్లాలోని మంగపేట మండలంలో 23 గ్రామ పంచాయతీలకు మినహా అన్నింటికీ ఎన్నికలు నిర్వహించారు. వీటిలో మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉండగా, జనగామ జిల్లాలో 281 జీపీలు, భూపాలపల్లి జిల్లాలో 241 పంచాయతీలు, హనుమకొండ జిల్లాలో 208 గ్రామ పంచాయతీలు, వరంగల్ జిల్లాలో 323 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ములుగు జిల్లాలో 174 జీపీలు ఉండగా, మంగపేట మండలంలోని 23 పంచాయతీలు షెడ్యూల్ ఏరియాలోకి వస్తాయనే అంశంపై కోర్టులో కేసు ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ములుగు జిల్లాలో 151 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 1665 పంచాయతీల్లోని సర్పంచులు, వార్డు సభ్యులు గురువారంతో తమ పదవులను కోల్పోనున్నారు.

జూన్‌లో సర్పంచ్ ఎన్నికలు...?

గ్రామపంచాయతీల్లో పాలక మండలి పదవీకాలం పూర్తి అవుతున్నప్పటికీ ఎన్నికలకు ప్రభుత్వం ఎలాంటి అడుగులు వేయటం లేదు. దీంతో ఆరు నెలల కాలానికి ప్రత్యేక అధికారులను నియమిస్తోంది. అయితే ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సర్పంచుల ఎన్నికల్లో ఇప్పట్లో జరిగే అవకాశం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జూన్ నెలలో జిల్లా, మండల పరిషత్తు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటితోపాటు సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. పరిషత్తులకు, పంచాయతీలకు ఒకేసారి లేదా వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించవచ్చునే మాటలు వినిపిస్తున్నాయి. అంటే ఆరు నెలల వరకు గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగనుంది.



23న మేడారానికి సీఎం రాక

- వనదేవతలను దర్శించుకోనున్న రేవంత్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జనవరి 31: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 23న మేడారానికి రానున్నారు. 21 నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర క్రమంలో ఆయన వస్తున్నారు. 23న మేడారానికి వచ్చి సమ్మక్క-సారలమ్మను దర్శించుకోనున్నారు. జాతర నిర్వహణ, విధుల సమీక్షలో ఉన్న వరంగల్ ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం ముఖ్యమంత్రి రావడం ఖరారైన క్రమంలో చేపట్టాల్సిన చర్యలను సమీక్షిస్తున్నారు.



వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మండిబజార్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ అధికారులు

ఆక్రమణలపై ఉక్కుపాదం

- నగరంలో అనుమతి లేని నిర్మాణాలను తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ
- మండిబజార్‌లో అధికారులతో యజమానుల వాగ్వాదం

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 31: వరంగల్ మహానగర పాలక సంస్థ కొద్ది రోజులుగా చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు పర్వం కొనసాగుతోంది. బుధవారం వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మండిబజార్‌తో పాటు తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డులోని బెస్తం చెరువువద్ద అక్రమంగా నిర్మించిన ప్రహరీ తొలగింపు చర్యలను జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు. మండిబజార్ వద్ద రెండు భవనాలు ఫుట్‌పాత్‌ను ఆనుకొని నిర్మించగా, అధికారులు తొలగించారు. ఈ పరిణామం రగడకు దారి తీసింది. భవనాల యజమానులు వ్యతిరేకించడం, టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు కొనసాగించడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. అంతలోనే అధికార పక్ష నేత నుంచి ఫోన్‌రావడంతో అధికారులు కూల్చివేత లను నిలిపివేసి వెనుదిరిగారు. దీనిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌ను మీడియా సంప్రదించగా ఆయన స్పందించారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, అయితే వారికి ముందుగా నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కొందరు స్వచ్ఛందంగా తొలగించుకుంటామని చెప్పడంతో సమయం ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో కూల్చివేతలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

బెస్తం చెరువు వద్ద గోడ కూల్చివేత

వరంగల్ తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని బెస్తం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని కొందరు ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. దీనిపై విచారణ జరిపిన ఇరిగేషన్, జీడబ్ల్యూఎంసీ అధికారులు.. ప్రహరీని కూల్చివేశారు. టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

ఎస్సీ సబ్‌ప్లాన్ పనులను సమీక్షించిన మేయర్

- 50 శాతమే పూర్తవ్వడంపై హెచ్చరికలు
- త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 31: ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా నగరంలో రూ.25కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని మేయర్ గుండు సుధారాణి సమీక్షించారు. బుధవారం సాయంత్రం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధి కారులతో ఆమె సమీక్ష జరిపారు. ఎస్సీ కాలనీల అభివృద్ధి, డ్రెయినేజీ, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర పనులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 50శాతం మాత్రమే పనులు పూర్తవ్వడంపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారాలని హెచ్చరించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్లు పేర్కొ న్నారు. లీకేజీలను అరికట్టే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ క్రిష్ణారావు, ఈఈలు రాజయ్య, డీఈలు రవికుమార్, సంతోశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

వారాంతపు జాతరకు వేలాదిగా వచ్చిన భక్తులు

ఐనవోలు, జనవరి 31: ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో భాగంగా బుధవారం భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచే భక్తులు వచ్చి ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఇతర జిల్లాలు ప్రధానంగా హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు ఆలయప్రాంగణంలో విడిదిచేసి పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్కపట్నాలు వేసి పూర్వీకులను స్మరించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు.



రథం లాగుతున్న భక్తులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి..

- ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారు..
- మా పోరాటం కార్పొరేట్, మతోన్మాదం మీదనే..
- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో బహిరంగసభ
- నేటి నుంచి జాతీయ సమావేశాలు



పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న తపన్‌సేన్, సభలో అభివాదం చేస్తున్న నాయకులు

హనుమకొండ క్రైం, జనవరి 31: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలని, కార్మిక, కర్షకులు ఒక్కటై ప్రధాని మోదీని గద్దె దించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు ఆల్‌ఇండియా సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశాలు కాజీపేటలో జరగనున్నాయి. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జిల్లా నాయకుడు ఉప్పల య్య అధ్యక్షతన బుధవారం బహిరంగసభను నిర్వహిం చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తపన్ సేన్ హాజరై ప్రసం గించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో మత విద్వేషాలు రేపుతూ ప్రజల్లో చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ మతరాజకీయాల వల్ల ప్రజలు సంక్షోభంలో కూరుకుపోతున్నా రని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారి హక్కులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. తమ పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేసిన సమ్మె అభినందనీయమని కొనియాడారు. ఫాసిస్టు విధానాలు విజయాలు సాధించిన దాఖలాలు దేశంలో ఎన్నడూ లేవని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 యేళ్లు గడుస్తున్నా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ మతాన్ని రాజకీయంతో మిళితం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు బీజేపీ కపట నాటకాలను గమనిస్తున్నారని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మించి మోదీ ప్రశ్నించే ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర చేస్తున్నాడని అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త భారత్‌బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని తపన్‌సేన్ పిలుపునిచ్చారు.

సీఐటీయూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీని ఓడించకపోతే హక్కులుండవని, ఆ పార్టీని ఓడించడమే ప్రజల కర్తవ్యం కావాలని చెప్పారు. మోదీ ప్రధాని అయిన తర్వాత రాజ్యాంగానికి, హక్కులకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే కవులు, కళాకారులు, మేధావులు, ఉద్యమ కారులను జైళ్లలో పెట్టించారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమకారులైన వరవరరావు, సాయిబాబలు అనారోగ్యంగా ఉన్నా జైళ్లో పెట్టించి చిత్రహింజలు పెట్టారని గుర్తు చేశారు. సనాతన ధర్మంతో మహిళలను కట్టిపడేసే కుట్ర చేస్తు న్నారని విమర్శించారు. చర్చల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

అంతకుముందు ములుగురోడ్డు నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సీఐటీయూ కార్యదర్శి ఏఆర్ సింధూ, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్రకార్యదర్శులు జి.వెంకటేశ్, రాగుల రమేష్, జిల్లా నాయ కులు ప్రభాకర్ రెడ్డి, రజిత, బొట్ల చక్రపాణి, చుక్కయ్య, వాసుదేవరెడ్డి, మంద సంపత్, పెండ్యాల రవీందర్, జి.వెంకట్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు పనులపై రేవూరి ఆరా

- అధికారులతో సమీక్ష.. పురోగతిపై అసంతృప్తి
- ఫిబ్రవరి 8న సందర్శనకు ఎమ్మెల్యే నిర్ణయం

హనుమకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ పనులు నత్తనడకన సాగుతుండడంపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. పార్క్ పనుల పురోగతిపై చర్చించారు. అక్కడ యూనిట్ల ఏర్పాటుపై ఆరా తీశారు. పార్క్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గీసుగొండ మండలం శాయంపేట గ్రామం, సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో అర్భాటంగా నిర్మించతలపెట్టిన కేఎంటీపీ పనులు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 8వ తేదీన టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శిస్తానని, అందులో ఏర్పాటు చేస్తున్న యూనిట్లను పరిశీలిస్తానని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులు హాజరుకావాలని అన్నారు.



కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

వనదేవతలకు మొక్కులు

- 50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

వివరాలు : 7లో..

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మల్లారెడ్డి

- ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం
- పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహాచారి

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, జనవరి 31: పోలీసు ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జనవరి 13న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే..

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రమ - సారంగం దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు శ్రీకాంత్ (25) అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ పడింది. ఈ పరీక్షకు కూడా హాజరయ్యాడు. ఫిజికల్ టెస్టులన్నీ పాస్ అయ్యాడు. లిఖిత పరీక్షలో రెండు మార్కులు తగ్గడంతో శ్రీకాంత్ ఉద్యోగానికి ఎంపిక కాలేక పోయాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్న శ్రీకాంత్‌ను తల్లిదండ్రులు ఓదార్చే ప్రయత్నం చేశారు. ఉద్యోగం రానందుకు బాధపడాల్సిన అవసరం లేదని, తమతో పాటు వ్యవసాయం చేసుకొని బతకొచ్చని ధైర్యం చెప్పారు. అయినా మానసికంగా కుంగిపోయిన శ్రీకాంత్.. ఆ వేదన నుంచి బయటకు రాలేకపోయాడు. జనవరి 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందుతాగాడు. చుట్టుపక్కలవారు చూసి ఆయనను వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చెట్టంత కొడుకు దూరమైనందుకు తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. మృతుడు అవివాహితుడు. శ్రీకాంత్ మృతితో నీరుకుల్ల గ్రామంలో విషాదం నెలకొన్నది.


శ్రీకాంత్(ఫైల్)

నేటి నుంచి గ్రూప్స్ ఉచిత శిక్షణ ప్రారంభం

హనుమకొండ రూరల్, జనవరి 31: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఈనెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందిని ఎంపిక చేశామన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ చలాన్ల గడువు పొడగింపు

హనుమకొండ క్రైం, జనవరి 31: పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై రాయితీతో చెల్లించే గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన గడువు జనవరి 31తో ముగియడంతో ప్రజల అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 15 వర కు పొడిగిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. డిసెంబరు 25 వరకు ఉన్న చలాన్లు మాత్రమే ఈరాయితీకి వర్తిస్తుందని తెలిపారు. ద్విచక్రవాహనాలకు, ఆటోలకు 80శాతం, ఆర్టీసీ బస్సులకు 90శాతం, ఇతర వాహనాలకు 60శాతం రాయితీలో చలాన్లను చెల్లించవచ్చని సీపీ సూచించారు.

5 నుంచి ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 31: కేయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు అమె పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 5, 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ఖిలాషాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 31: జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం ఖిలాషాపూర్‌లో బుధవారం బెల్టు షాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో రూ.23 వేల విలువ గల వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన చెవ్వ అంజయ్య అనే వ్యక్తి చాలారోజులుగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి పెద్దఎత్తున మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 23వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని రఘునాథపల్లి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నోట.. ట్రైబల్ వర్సిటీ మాట..

సమ్మక్క సారలమ్మ పేరిట ఏర్పాటు చేస్తున్నామంటూ వెల్లడి ● పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ద్రౌపది ముర్ము ప్రసంగంలో ప్రస్తావన



ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంకోసం కేటాయించిన స్థలం

ములుగు, జనవరి 31: జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు భారీ ముందడుగు పడింది. బుధవారం జరిగిన పార్లమెంట్ బడ్జెట్ ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూనివర్సిటీ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో సమ్మక్క, సారలమ్మ పేరిట గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా యూనివర్సిటీపై ఆశలు రేకెత్తుతున్నాయి. కేటాయింపులు ఏమేరకు ఉంటాయోననే ఆసక్తి నెలకొంది.

వడివడిగా అడుగులు

ఏపీ పునర్విభజన చట్టం 2014లో తెలంగాణకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీపై ఇటీవలే ఆశించిన స్థాయిలో కదలిక కనిపించింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ వర్సిటీపై ప్రకటన చేశారు. మహబూబ్‌నగర్‌లో అక్టోబరు 1న జరిగిన బహిరంగ సభలో గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ పేరిట జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేస్తామని, ఇందుకు ములుగు ప్రాంతంలో స్థల సేకరణ కూడా జరిగిందని తెలిపారు. ఆతర్వాత యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. యూనివర్సిటీల చట్టసవరణ బిల్లులో ట్రైబల్ వర్సిటీని కూడా చేర్చగా గత ఏడాది డిసెంబరు 7న పార్లమెంటులో, డిసెంబరు 13న రాజ్యసభలో ఆమోదం పొందింది. అదే నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. జనవరి 16న హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ అధికారుల బృందం ములుగు సమీపంలోని గట్టమ్మ వద్ద యూనివర్సిటీ కోసం కేటాయించిన 335 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. వీసీ బి.జె.రావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్ స్థలంతోపాటు తరగతుల నిర్వహణ కోసం జాకారం వద్దగల ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనాలను పరిశీలించారు. తాజాగా 24 తేదీన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ అధికారులతో కలిసి మరోసారి స్థలాన్ని, జాకారం వైటీసీ భవనాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు జరిగే అవకాశముందని వెల్లడించారు.



తాత్కాలిక క్యాంపస్ నిర్వహణకోసం ఎంపికచేసిన జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్

కేటాయింపుపై ఆసక్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాని ప్రకటన, తాజాగా పార్లమెంటు ఎన్నికల ముందు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన ఈ రెండు సందర్భాలను పలువురు రాజకీయ కోణంలో చూస్తున్నప్పటికీ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కలిసొచ్చిన సమయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్థల కేటాయింపు అంశాన్ని రాష్ట్రానికి అప్పగించి యూనివర్సిటీ స్థాపనకు అయ్యే పూర్తి ఖర్చు బాధ్యతను స్వీకరించింది. నిర్మాణం కోసం రూ.889 కోట్లను కేటాయించే అవకాశముందని ఇటీవల ప్రకటన కూడా వచ్చింది. అయితే ప్రస్తుతం జరిగే బడ్జెట్ సమావేశాలు చివరివి కావడంతో ఏ మేరకు కేటాయింపులు జరుగుతాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. కేటాయించిన నిధులను విడుదలచేసి శంకుస్థాపన చేయాలని, సత్వరమే పనులు కూడా మొదలు పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పత్తి రైతులకు సీసీఐ భరోసా

వరంగల్‌టౌన్, జనవరి31: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లను జనవరి 31 నుంచి నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజంలేదని, పత్తి కొనుగోళ్లను కొనసాగిస్తుందని సీసీఐ వరంగల్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అర్జున్ ఎస్.దవే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటకు మద్దతు ధర కల్పించేందుకు సమీపంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పత్తి రైతులు ఎవరూ నిరాశ చెందకుండా తమ పత్తిని సీసీఐ కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీసీఐ వెబ్‌సైట్. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సీవోటీసీవోఆర్‌పీ.ఓఆర్‌జీ. ఇన్‌ను సంప్రదించవచ్చునని, లేదా కాట్-అల్లీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు

కొత్తగూడ, జనవరి31: విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలైన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ప్రకారం వేలుబెల్లి గ్రామానికి చెందిన మురహరి రవికుమార్ కుమారుడు మంగళవారం చాణక్య ఇంటి డాబాపైకి వెళ్లి బస్తాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్సకోసం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

దొంగల చేతివాటం

మేడారం, జనవరి 31: మేడారంలో దొంగల చేతివాటం పరిపాటిగా మారింది. వనదేవతలకు ముందస్తు మొక్కలు చెల్లించుకోవడానికి మేడారం చేరుకున్న భక్తులు విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. బుధవారం సుమారు 10 మంది భక్తులు మొత్తం రూ.లక్షకు పైగా నగదు, రెండు తులాల బంగారాన్ని కోల్పోయారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. సీసీకెమెరాలను పరిశీలించినా పోలీసులకు దొంగల ఆచూకీ లభించలేదు.

వనదేవతలకు మొక్కులు

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

మేడారం, జనవరి 31: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారమ్మలకు మొక్కుల చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివాసీ సంప్రదాయాలతో తల్లులను దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, డోలి వాయిద్యాల నడుమ సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ గద్దెల వద్దకు చేరుకునానరు. క్యూలైన్ల ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 50 వేల భక్తులు మేడారం వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పోలీసులు పకడ్బందీ చర్యలు

వనదేవతలకు ముందస్తు మొక్కలు చెల్లించుకోవడానికి తరలి వస్తున్న భక్తులు నేరుగా తల్లి గద్దెలను దర్శించుకునేలా పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సుమారు 50 వేల మంది తరలి రావడంతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గేట్లు మూసివేయకుండా నేరుగా భక్తులు గద్దెలకు చేరుకొనేలా ఏర్పాట్లు చేయగా వారు దర్శనాలు చేసుకునేందుకు క్యూలైన్ల వద్ద పోలీసులు ఎంతో శ్రమపడాల్సి వచ్చింది.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

500 మందితో ట్రాఫిక్ నియంత్రణ

వనదేవతలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారి వాహనాలతో మేడారం కిటకిటలాడింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. దారి పొడవునా 25 రూట్ మొబైల్ ట్రీమ్స్‌ను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించారు. ఎస్పీ శబరీశ్ స్వయంగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. పస్రా నుంచి మేడారం వరకు వాహనాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. భక్తులు నేరుగా గద్దెల సమీపానికి చేరుకునేలా వన్‌వే రూట్‌ను ఏర్పాటు చేశారు. ఊరట్టం క్రాస్ వద్ద భారీ గేట్లు చేసి వాహనాలను పార్కింగ్‌లోకి మళ్లించారు. జంపన్నవాగు ఒడ్డుపై నుంచి గద్దెల సమీపంలోని పార్కింగ్‌లకు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు మొత్తం 500 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మల్లారెడ్డి

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం ● పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి ● ఇతర పదవుల్లో సైతం నియామకం



రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రంకు, పరీక్షల నియంత్రణాధికారి నరసింహచారికి నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ రమేశ్, మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 31: కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ పొందిన వారిని పదవుల్లో కొనసాగడంపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే రిటైర్డు అయిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రిజిస్ట్రార్‌గా కొనసాగగా, పదవి నుంచి తప్పుకున్నట్లు అయింది. దీంతో పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి గణితశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే సైన్స్ విభాగం డీన్‌గానూ పనిచేస్తున్నారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ కంపెనీతో రెండేళ్లపాటు పనిచేసి తైవాన్‌లో 5 ఏళ్లపాటు పోస్టు డాక్టరల్ డిగ్రీ పూర్తి చేశారు. 1998లో ఉస్మానియాలో పీహెచ్‌డీ పూర్తి చేయగా, సీఎస్‌ఐఆర్ యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించారు. సీఎస్‌ఐఆర్, యూజీసీ, డీఎస్‌టీ ప్రాజెక్టులను పూర్తిచేశారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో 16 మంది పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఇంటర్నేషనల్, నేషన్ జర్నల్స్‌లో దాదాపు 100 పరిశోధన పత్రాలను ప్రచురించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులుగా 4 ఏళ్లు కొనసాగారు.

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం

కేయూ దూరవిద్య కేంద్రం నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్థానంలో ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను నియమించారు. ప్రొఫెసర్ రామచంద్రం కేయూ సైకాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి

కేయూ కొత్త పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రొఫెసర్ మల్లారెడ్డి పరీక్షల నియంత్రణాధికారిగా కొనసాగడంతో ఆయన స్థానంలో నరసింహచారిని నియమించారు.

అలాగే కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధుల్లో ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందంను నియమించారు. ఇప్పటివరకు కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మల్లారెడ్డి స్థానంలో సదానందంను నియామించారు. కేయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పి.అమరవేణి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగిన ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి స్థానంలో అమరవేణిని నియమించారు. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి నియమితులయ్యారు. ఇప్పటివరకు అమరవేణి ప్రిన్సిపాల్‌గా ఉన్న స్థానంలో వరలక్ష్మిని నియమించారు.

అలాగే వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్‌ను నియమించారు. వీరిఉత్తర్వులను ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు జారీ చేశారు. నూతనంగా పరిపాలన పదవుల్లో నియమితులైన ప్రొఫెసర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సోనియాను కలిసిన రిజిస్ట్రార్ రవి

వరంగల్ ఎంపీ టికెట్ అభ్యర్థన.. బయోడేటా అందజేత



సోనియాగాంధీతో రవి

హనుమకొండ సిటీ, జనవరి 31: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీని కలిశారు. వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్న రవి.. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సోనియాను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమెకు తన బయోడేటాను అందచేశారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర, ఉద్యోగుల సమస్యలపై పోరాటం, సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా సమయంలో అందించిన సేవలు, నిరుపేద కుటుంబం నుంచి ఉద్యోగపరంగా ఉన్నతాస్థాయికి ఎదిగిన తీరు, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విధానాలను జనంలోకి తీసుకెళ్లడం తదితర అంశాలను సోనియాగాంధీకి వివరించారు. టికెట్ కేటాయిస్తే అందరి సహకారంతో విజయం సాధిస్తానని రవి విన్నవించుకున్నారు. దీనిపై సోనియాగాంధీ స్పందిస్తూ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఏకంగా సోనియాగాంధీనే కలిసి టికెట్ కోసం రవి అభ్యర్థించడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.

ఎంపీ టికెట్ కోసం ఆనంద్ దరఖాస్తు

వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని కోరుతూ హనుమకొండకు చెందిన మోజెస్ ఆనంద్ పాల్ దరఖాస్తు సమర్పించారు. బుధవారం హైదరాబాద్‌లో దరఖాస్తును గాంధీభవన్‌లోని సిబ్బందికి అందచేశారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి చేసిన సేవలు, సామాజిక కార్యక్రమాలతో కూడిన బయోడెటాను సమర్పించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయస్థాయి ఫెస్ట్‌కు గురుకుల విద్యార్థినుల ఎంపిక

మడికొండ, జనవరి 31: హైదరాబాద్‌లో డిసెంబరు 6న జరిగిన స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్-2023-24లో ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్ ప్రాజెక్టులో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచారు. జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో తమ ప్రాజెక్టు ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్‌ను ప్రదర్శించడానికి అర్హత సాధించారు. ఈ ప్రాజెక్టుని ఫిబ్రవరి 1, 2 తేదీలలో బెంగుళూరులోని ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో జరగబోయే జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో ప్రదర్శిస్తారు. 10వ తరగతి విద్యార్థినులు శ్రుతి, రమ్యలను వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఎస్.విద్యారాణి, మడికొండ ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు కె.జ్యోతితో పాటు అధ్యాపక బృందం అభినందించారు.



రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

సుబేదారి, జనవరి 31 : తెలంగాణ రిటైర్డ్ కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పుల్లయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాళ్ల డాక్టర్ జగన్నాథరావు, ఎం.ధర్మేంద్రరావు, ఎల్బీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు, డాక్టర్ సి. మదన్‌మోహన్, డాక్టర్ సూర్యనారాయణతో పాటు ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ టీచర్స్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

» హాజరు కానున్న 13,741 మంది విద్యార్థులు » ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హనుమకొండ రూరల్, జనవరి 31: ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బీపీసీ, ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థులతోపాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలో మొత్తం ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు కలిపి 126 ఉన్నాయి. ఇందులో 79 సెంటర్లు జనరల్ సబ్జెక్టు విద్యార్థులకు, 11 సెంటర్లు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు కేటాయించారు. బీపీసీ, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,869, ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు 1,872 మంది. మొత్తం 13,741 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానుండటంతో ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను సైతం ఇప్పటికే విద్యార్థులకు అందజేశారు. వార్షిక పరీక్షలకు సుమారు నెల రోజుల వ్యవధి ఉండటంతో కేంద్రాల్లో ఏర్పాటు చేసే వసతులపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మూడు విడతల్లో..

జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 86 సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మూడు విడతలుగా నిర్వహిస్తున్నారు. మొదటి విడత ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు, రెండో విడత 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు, మూడో విడత 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషులో ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ తెలిపింది. వీటికి 20 మార్కులు కేటాయించనున్నారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన పరికరాలు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. సుమారు 50 మంది విద్యార్థులకంటే తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని కళాశాలలకు మార్చినట్లు తెలుస్తోంది. తప్పనిసరిగా విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరయ్యేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రాక్టికల్ పరీక్షల పర్యవేక్షణ, నిర్వహణకు ప్రభుత్వ, ప్రయివేట్ లెక్చరర్లను ఎగ్జామినర్ డ్యూటీలు వేశారు. వీరితోపాటు 55మంది డిపార్ట్‌మెంటల్ అధికారులకు డ్యూటీలను నిర్ణయించారు. 86 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లకు ప్రాక్టికల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.



కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు

హనుమకొండ క్రైం, జనవరి 31: ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న ఇంటర్ మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల సందర్భంగా ఆయా సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం నిషేధం అని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలకు తావులేకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరంలో ప్రజలు సంచరించాలని తెలిపారు.



తగిన ఏర్పాట్లు చేశాం..

ఎ.గోపాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, హనుమకొండ

ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశాం. కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాం. హాల్ టికెట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇదివరకే పంపించాం. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలి.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

» వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



జర్నలిస్టులకు ఐడీ కార్డులను అందజేస్తున్న అంబర్ కిషోర్ ఝా

వడ్డెపల్లి, జనవరి 31: సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీపీ ఐడీ కార్డులు అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. హైదరాబాద్, బెంగుళూరు, మైసూర్ వంటి నగరాలతో సమానంగా గ్రేటర్ వరంగల్ నగరం అభివృద్ధి చెందాలంటే జర్నలిస్టులు ప్రధాన భూమిక పోషించాలని అన్నారు. విధి నిర్వహణలో వర్కింగ్ జర్నలిస్టులకు పోలీసుశాఖ నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ళ అమర్, సీనియర్ జర్నలిస్టులు దాసరి క్రిష్ణారెడ్డి, మెండు రవిందర్, తోట సుధాకర్, నూటెంకి ప్రభాకర్, మత్తా దుర్గా ప్రసాద్, పెండెం వేణుమాధవ్, వేముల సదానందం, గోకారపు శ్యామ్, అల్లం రాజేష్‌వర్మ, సంపెట సుధాకర్, బొడిగె శ్రీను, యాంసాని శ్రీనివాస్, భరత్ తదితరులు పల్గొన్నారు.

కష్టపడితేనే ఫలితం వరిస్తుంది..

» అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

హనుమకొండ రూరల్, జనవరి 31: కష్టపడితేనే ఫలితం వరిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బుధవారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాంరెడ్డి, బీసీ సంక్షేమశాఖ వరంగల్ జిల్లా అధికారి పుష్పలత, సహాయ సంక్షేమ శాఖ అధికారులు సీహెచ్.రవీందర్‌రెడ్డి, కె.శంకరయ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంవీవీ ప్రసాద్, అశోక్, రాజు, రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

పరీక్షల విభాగం ఎదుట ఫార్మసీ విద్యార్థులు ఆందోళన



పరీక్షల విభాగం ఎదుట నిరసన చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

కేయూ క్యాంపస్, జనవరి 31: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసీ విభాగం విద్యార్థులు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఫార్మసీ విభాగంలో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. తమకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని పరీక్షల నియంత్రణాధికారులు డిమాండ్ చేశారు. విద్యార్థులు పరీక్షల విభాగం వద్ద నిరసన ఆందోళన చేపట్టడంతో వర్సిటీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ వద్దకు కేయూ ఉన్నతాధికారులు రావాలని డిమాండ్ చేస్తూ పరీక్షల విభాగం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి ఫార్మసీ విద్యార్థులు కళాశాల మేనేజ్‌మెంట్ నుంచి లేఖ రాయాలని, స్టాండింగ్ కమిటీలో నిర్ణయం తీసుకుని డిటెన్షన్ విధానంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెల్పి చెప్పారు.

వీసీ చాంబర్‌లో బీఈడీ విద్యార్థుల నిరసన

కేయూ క్యాంపస్, జనవరి 31: వర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో టీసీ ఇవ్వడం లేదని, వెంటనే తమకు టీసీలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల కేటగిరిలకు చెందిన విద్యార్థుల కోర్సు ఫీజులు రెండేళ్లకు రూ.60వేల మేరకు వర్సిటీ క్యాంపస్ కళాశాలకు బకాయిలుపడ్డారు. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీలతోపాటు అయా వెల్ఫేర్ డిపార్టుమెంట్‌ల నుంచి డబ్బులు తమకు రాలేదని, వచ్చిన తర్వాతనే టీసీలు ఇస్తామని వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు మొండికేస్తున్నారు. డబ్బులు వచ్చినప్పుడు వర్సిటీ అధికారులు జమ చేసుకోవాలని, తమకు ఇప్పుడు టీసీలు ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థులకు నచ్చచెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్, ఏబీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, ఏబీఎస్‌ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దార సురేశ్, శిరీష, రాధిక, లక్ష్మణ్ , ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



వీసీ చాంబర్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులు నచ్చచెబుతున్న పోలీసులు

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో రామానుజ జీయర్ స్వామి

సుబేదారి, జనవరి 31: హనుమకొండ న్యూశాయంపేటలోని ధోనగుట్టపై వెలిసిన త్రి వేద్రాద్రి సంతోష లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని బుధవారం త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి సందర్శించి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. దేవాలయ చైర్మన్ గ్రంధి సత్యవతి ఆధ్వర్యంలో రామానుజ జీయర్ స్వామికి భక్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ఇక్కడి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. నరసింహస్వామి గురించి భక్తులకు తెలియజేశారు. దేవాలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గుట్టపైకి వెలుతున్న త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి

కాజీపేటలో గద్దర్ జయంతి వేడుకలు



గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రైల్వే కార్మికులు

కాజీపేట, జనవరి 31: రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు బుధవారం కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్రు నర్సింగరావు హాజరై మాట్లాడారు. గద్దర్ 2007లో కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయాలని కడిపికొండ బ్రిడ్జి నుంచి అజంజాహి మిల్లు మైదానం వరకు పాదయాత్ర నిర్వహించి బహిరంగ సభ నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవర్దన్, సాంబయ్య, సంతోష్‌కుమార్, రాఘవేందర్, ఎస్‌ఆర్‌వీ రావు, ఎంకే మూర్తి, భాస్కర్, సంగమయ్య, రమేష్, హరిబాబు, సారయ్య, సాయిరాజ్, లక్ష్మినారాయణ, సారంగపాణి పాల్గొన్నారు.

ఉద్యోగులు ఫ్రెండ్లీగా ఉండాలి



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, డైరెక్టర్ నాగయ్య

కేయూ క్యాంపస్, జనవరి 31: కేయూలో చదివిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ఎస్సై, జూనియర్ లెక్చరర్, పోలీస్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అన్నారు. బుధవారం కేయూ ఫిజిక్స్ విభాగం ఎదుట కేయూ ప్రీ కోచింగ్ సెంటర్‌లో చదువుకుని ఎస్సై, జూనియర్ లెక్చరర్, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను 69 మందిని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ తండ నాగయ్య నేతృత్వంలో ప్రత్యేకంగా శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు తమ తోటి వారితో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ సీజే శ్రీలత, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం. తిరుమలదేవి, హాస్టల్స్ జేడీ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ అశీర్వాదం, హిమబిందు, భవాని, మానస, రాకేశ్, తేజస్విని, రమ్య, సందీప్, గణేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేటలో మౌలిక వసతులు కల్పించాలి

వడ్డెపల్లి, జనవరి 31: కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారులోని దామెర ఉర్సు గుట్టల వద్ద నిర్వహించే అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతరలో మౌలిక వసతులు కల్పించాలని జాతర చైర్మన్ కోదూరి భిక్షపతి వరంగల్ మునిసిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బుధవారం మర్యాద పూర్వకంగా కమిషనర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించే జాతరలో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అమ్మవారల గద్దెల చుట్టూ ఫెన్సింగ్, బారికేడ్లతో పాటు జాతర ప్రవేశ మార్గంలో ముఖద్వారం నిర్మించాలని కోరారు. వీటికి సంబంధించి కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో జాతర ఆర్గనైజర్ దాసీ రామ్‌దేవ్, ధర్మకర్తలు ఆవునూరి రామ్మూర్తి, ఆవునూరి కుమారస్వామి, పోశాల స్వామి, ఆవునూరి రామన్న, బైరి నాగరాజు, బైరి హరినాథ్, చింత ప్రకాశ్ ఉన్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జాతర ధర్మకర్తలు

కాకతీయ మ్యూజికల్ క్లబ్ ఆవిర్భావం

కాజీపేట జంక్షన్, జనవరి 31: కాకతీయ కళలు సంస్కృతిని పెంపొందించే విధంగా, కళాకారుల సంక్షేమం కోసం కాకతీయ మ్యూజికల్ క్లబ్ ఆవిర్భవించింది. ఈ మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా సంగీత విద్వాంసుడు ప్రొఫెసర్ వెనకపల్లి తిరుపతయ్య, గౌరవ అధ్యక్షుడిగా మరో సంగీత విద్వాంసుడు వేదాంత జగన్నాథాచార్య, విశ్వకవి మహ్మద్ సిరాజోద్దీన్, కళాపోషకుడు డాక్టర్ జగదీష్ బాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మారదోజు సదానందచారి, గుజ్జారి రమేష్ బాబు, మహేశ్వరం ఉపేందర్, కూజ విజయ్‌కుమార్, టీవీ అశోక్‌కుమార్, కర్ణకంటి పోతనాచారి, కార్యదర్శిగా బిటవరం శ్రీమన్నారాయణ, కోశాధికారిగా నల్ల లక్ష్మీనారాయణ, బైలా సృష్టికర్త రంగు రఘుపతి నేత ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గం

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఐనవోలు, జనవరి 31: రోడ్డు ప్రమాదంలో చిన్ననాటి స్నేహితుడి మృతి చెందగా కుటుంబానికి పూర్వవిద్యార్థులు బాసటగా నిలిచి ఆర్థిక సహాయం చేశారు. ఐనవోలుకు చెందిన అలుగునూరి శ్రీనివాస్ గతనెల 21న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. 1998-99 బ్యాచ్‌కు చెందిన ఆయన స్నేహితులైన పూర్వవిద్యార్థులు బుధవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేసి రూ.54 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొట్టం రాజు, బొల్లేపల్లి ప్రదీప్, జి.విద్యాసాగర్, పి.భాస్కర్, కె.వేణు, ఉదయ్‌కుమార్, యాదగిరి, రవికుమార్, మోహన్, శివాజీ, అనిల్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

- బాధిత శ్రీనివాస్ కుటుంబానికి 50 కేజీల బియ్యంను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, నాయకులు రహీమ్‌పాషా, గ్యాదరి భాస్కర్, గడ్డం శ్రీనివాస్, కొత్తూరి ప్రతాప్, బొల్లేపల్లి సంపత్, తాటికాయల బాబు, కొండేటి శ్రీనివాస్, బరిగెల రాజయ్య, కొత్తూరి ఆనందం పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులు అర్పించి బియ్యంను అందజేశారు.

బీఎస్పీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా వేణుగోపాల్



హసన్‌పర్తి, జనవరి 31: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన చాతల్ల వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీఎస్పీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విజయలక్ష్మి కాలనీలో మద్యం పట్టివేత

హనుమకొండ క్రైం, జనవరి 31: కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలోని విజయలక్ష్మికాలనీలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని కేయూ పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.7600 మద్యాన్ని బెల్టు షాపు నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని స్టేషన్‌కు తరలించారు. మద్యం విక్రయించే సాంబయ్య అనే వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

పరిహారం చెల్లించాలని షాపింగ్ మాల్‌కు ఆదేశం

» వినియోగదారుల కమిషన్ తీర్పు

హనుమకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వినియోగదారుల కమిషన్ (వినియోగదారుల కోర్టు) బుధవారం సంచలనాత్మక తీర్పును ఇచ్చింది. వెండిగ్లాసుల్లో వెండిశాతం విషయంలో వినియోగదారులను మోసం చేస్తున్నందుకు హనుమకొండలోని ఓ కార్పొరేట్ వస్త్ర, వెండి బంగారు నగల షాపింగ్‌మాల్ నుంచి బాధితుడికి పరిహారం ఇప్పించింది. తీర్పు వివరాల్లోకి వెళితే.. వెండి గ్లాసులలో హానికరమైన కాడ్మియం కల్తీతోపాటు వెండి శాతం తక్కువగా ఉండడంపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ఆరు నెలల కిందట వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. చక్రపాణి, హనుమకొండలోని ఒక పేరున్న కార్పొరేట్ బట్టలు, బంగారు నగల షాపింగ్ మాల్‌లో వెండి గ్లాసును స్వయంగా కొనుగోలు చేసి అందులో తనకు జరిగిన మోసాన్ని గుర్తించి కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. వినియోగదారుల కమిషన్ (కోర్టు) అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు జనార్ధన్ రెడ్డి, సంధ్యారెడ్డిలు దీనిపై విచారణ జరిపారు. ఆ కార్పొరేట్ షాపింగ్ మాల్ విక్రయించిన వెండి గ్లాసులో వెండి 70శాతం మాత్రమే ఉన్నా మొత్తం బరువుకు వెండి ధరను వసూలు చేయడం, నాణ్యత విషయంలో తప్పుడు ప్రకటనలు ఇవ్వడం, మేకింగ్ చార్జీల పేరిట అదనంగా వసూలు చేయడం.. తదితర తప్పుడు విధానాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారణకు వచ్చారు. ఆ షాపింగ్ మాల్‌కు వెండి గ్లాసు అమ్మకంలో అదనంగా వసూలు చేసిన రూ.2100తో పాటు వెండి గ్లాస్ కొన్న తేదీ నుంచి ఇప్పటి వరకు ఏడాదికి 12శాతం వడ్డీ, వ్యాపారంలో తప్పిదానికి పాల్పడినందుకు పరిహారంగా రూ.10వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ. 2వేలు ఇవ్వాలని కమిషన్ ఆ షాపింగ్ మాల్‌ను ఆదేశించింది. ఈ మేరకు తీర్పును వెలువరించింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 31: రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా నగరవాసులకు ప్రయోజనకరంగా ఉంటుందని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన ట్యాక్స్ మేళాను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ బుధవారం మేళా నిర్వహణ ఉంటుందన్నారు. ఆస్తి, నల్లా పన్ను, ఇంటి నెంబరు కేటాయింపు, మ్యుటేషన్లు తదితర సమస్యలను మేళా ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సమస్యపై వినతిపత్రాన్ని అందచేయడంతో అధికారుల పరిశీలన ప్రారంభమవుతుందన్నారు. వెను వెంటనే చర్యలు చేపడతారని తెలిపారు. ఆన్‌లైన్ సేవలన్నీ కూడా సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఉంటాయని, వీటిని కూడా నగరవాసులు పొందవచ్చన్నారు. నగరాభివృద్ధి కోసం ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించాలని, అదే విధంగా వ్యాపారులు ట్రేడ్ ఫీజులు చెల్లించాలని కోరారు. వాస్తవానికి డిసెంబర్ మాసంలోనే పన్నుల చెల్లింపులు పూర్తి కావాల్సి ఉందని, ఇకనైనా పన్నులు చెల్లించని వారు వెంటనే స్పందించాలని కోరారు.

అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ మాట్లాడుతూ.. మేళాలో 13 వినతిపత్రాల సమర్పణ జరిగిందని తెలిపారు. వీటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని, నగర వాసులకు సత్వర సేవలు అందించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకుడు ఆనంద్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మేళాలో ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

రెడ్ నోటీసుల జారీ చేస్తాం...

ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు అందచేస్తామని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. బుధవారం వరంగల్‌లోని గోపాలస్వామి గుడి తదితర ప్రాంతాల్లో బల్దియా సిబ్బంది చేపట్టిన పన్నుల వసూళ్ల తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కౌన్సెలింగ్

కూలింగ్ గ్లాసెస్ అవసరమే!

డాక్టర్! కొద్దిపాటి ఎండను కూడా నా కళ్లు తట్టుకోలేకపోతున్నాయి. చలువ కళ్లజోడు తప్పనిసరిగా పెట్టుకోవాలా? అసలు నాకెందుకు ఇలా జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్.

ఎండ, వేడి, అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్... వీటన్నిటి నుంచి కళ్లకు రక్షణ కల్పించాలంటే చలువు కళ్లద్దాలు ధరించాలి. సాధారణంగా మార్కెట్లో ఎన్నో రకాల కూలింగ్ గ్లాసెస్ దొరుకుతూ ఉంటాయి. వాటిలో చవకవీ, ఖరీదైనవీ ఉంటాయి. వీటిలో ఏది కొనాలి? అనే విషయంలో అయోమయానికి గురవుతూ ఉంటాం. అయితే చలువ కళ్లద్దాలు వేటితోనైనా కళ్లకు రక్షణ దొరుకుతుంది. అయితే వాటికి అతినీలలోహిత కిరణాలను ఆపే 'యువి ప్రొటెక్షన్' ఉందా? అనేది తెలుసుకోవాలి. చవక చలువ కళ్లద్దాలతో పోలిస్తే, ఖరీదైన ప్రముఖ కంపెనీ ఉత్పత్తులు ఈ ఫిల్మ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తాయి. కాబట్టి కళ్లకు పూర్తి రక్షణ కోరుకుంటే, మన్నికైన, నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్‌నే ఎంచుకోవాలి. తక్కువ ఖర్చులో చలువ కళ్లజోడు కొనే సమయంలో వాటి అద్దాల నాణ్యత పరిశీలించాలి. చత్వారం ఉన్న వాళ్లు ఎండ సోకితే నల్లబడే 'ఫొటోక్రోమ్' జోడు ఎంచుకోవాలి.



ఫొటో సెన్సిటివిటీ

కళ్లు ఏ కొద్ది ఎండ, వెలుగులను తట్టుకోలేని స్థితి ఇది. ఎక్కువగా ఎండ బారిన పడిన వాళ్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో వారి కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఈ సమస్యను సరి చేయడం అసాధ్యం. ఇలాంటివారు బయటకు వెళ్లినప్పుడల్లా చలువు కళ్లద్దాలను ధరిస్తూ ఉండాలి.

డాక్టర్ శ్రీలక్ష్మి నిమ్మగడ్డ
క్యాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్, హైదరాబాద్.

బ్యూటీ

జుట్టు సంరక్షణ ఇలా...

మార్కెట్లో దొరికే క్రీమ్స్ కాకుండా మన ఇంట్లోని వంటగదిలో ఉండే వాటితోనే హెయిర్‌మాస్కులు వేసుకోవచ్చు. ముఖ్యంగా సహజసిద్ధమైన మాస్కులు వేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

- బౌల్‌లో నాలుగు టేబుల్‌స్పూన్లు తాజా అలోవెరా జెల్‌ను, రెండు టేబుల్ స్పూన్లు కొబ్బరినూనె కలిపి మిక్స్ చేయాలి. దీన్ని మాడుకు పట్టేలా పట్టించాలి. అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు అందం, ఆరోగ్యంగా ఉంటుంది.



- టేబుల్ స్పూన్ తేనె, ఒక పచ్చి అరటిపండును మెత్తగా చేసుకోవాలి. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె కూడా తీసుకోవాలి. ఈ మిశ్రమం అంతా కలిపి జుట్టుకు పట్టిస్తే కుదుళ్లు గట్టిగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, టేబుల్ స్పూన్ తేనె కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టులో చుండ్రు పోతుంది.
- రెండు ఉల్లిపాయలను గ్రైండ్ చేసి, అందులో కొబ్బరినూనె టీస్పూన్ వేయాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే జుట్టు ఊడిపోదు.
- ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనె, గుప్పెడు కరివేపాకు వేసి వేడిచేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత జుట్టుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు పెరుగుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే పేస్ట్ చేయాలి. ఇందులోకి టేబుల్ స్పూన్ కొబ్బరి పాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే జుట్టు గట్టిగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, టీస్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను తరచూ పట్టిస్తుంటే తల చల్లగా ఉంటుంది. జుట్టులోని దురద తగ్గుతుంది.
- గుప్పెడు మందార పూలను పేస్ట్‌గా చేయాలి. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు పెరుగుతుంది.
- ఒక కోడిగుడ్డు వైట్‌తో పాటు టీస్పూన్ నిమ్మరసం కలిపి మిశ్రమాన్ని కలపాలి. దీన్ని జుట్టుకు పట్టిస్తే జుట్టులో ఫ్రెష్‌నెస్ వస్తుంది.

వంటింటి చిట్కాలు

- గ్యాస్‌బర్నర్‌ను తరచుగా శుభ్రం చేస్తుండాలి. లేకపోతే మురికి చేరి మంట తగ్గిపోతుంది. తద్వారా వంట ఆలస్యం అవుతుంది.
- వెల్లుల్లి రెబ్బల పొట్టు సులువుగా తీయాలంటే మాత్రం వాటిని వేడినీటిలో వేసి తర్వాత తీస్తే సులువుగా పొట్టు ఊడిపోతుంది.
- ఆమ్లెట్ రుచికరంగా ఉండాలంటే.. గుడ్లు సొనను గిలక్కొట్టేప్పుడు మూడు చెంచాలు పాలు కలిపితే సరి.
- ఉల్లిపాయల ముక్కలను వేయించేప్పుడు కాస్త చక్కెర వేసి కలిపితే రుచిగా ఉంటుంది.
- తీపి బోండాలను చేయాలనుకున్నప్పుడు పిండిలో నీళ్లకు బదులు పాలు వాడితే బావుంటాయి.

స్ఫూర్తి

'ఆడపిల్లకు ఒంటి మీద నగల కన్నా పేరు చివర విద్యార్హతలే విలువైనవి'... అనే తన తల్లి మాటల స్ఫూర్తితో 'టైమ్స్' (తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ) నెలకొల్పారు. తద్వారా చదువు'కొనలేని' అమ్మాయిలకు అండగా నిలిచారు. అమెరికాలో స్థిరపడినా, సొంతూరు రావినూతలకు సేవ చేయాలనే సంకల్పంతో ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాటి సరోజిని... 'టైమ్స్' ఫౌండేషన్ సేవల గురించి 'నవ్య'తో చెబుతున్నారిలా.



చదువు'కొనలేని' అమ్మాయిల కోసం..

"ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న కుటుంబాల్లో అమ్మాయిల చదువుకు ఎప్పుడూ రెండో ప్రాధాన్యతే. ఈ విషయంలో మధ్యతరగతిలో కొంత మార్పు కనిపిస్తున్నా... అణగారిన వర్గాల్లో మాత్రం అలానే కొనసాగుతోంది. నేను ఉద్యోగరీత్యా ఇరవై ఏళ్ల కిందట అమెరికాలో స్థిరపడ్డాను. అప్పుడప్పుడు సొంతూరికి వెళుతుంటాను. ఆ సమయంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అమ్మాయిలు చాలామంది కుటుంబ పరిస్థితులు అనుకూలించక కూలి పనులకు వెళ్లడం గమనించాను. ఒక కుటుంబంలో అయితే అక్కాచెల్లెళ్లు ఇద్దరూ బ్రిలియంట్ స్టూడెంట్స్. ప్రమాదవశాత్తు వాళ్ల నాన్న చనిపోవడంతో కుటుంబ భారమంతా తల్లి మీద పడింది. ఆమెకు ఇద్దరినీ చదివించే స్తోమత లేక, ఒకరిని తన వెంట వ్యవసాయ పనులకు తీసుకెళ్లేది. 'పదో తరగతిలో 500కు పైగా మార్కులు వచ్చిన అమ్మాయి కూలికి వెళ్లడం ఏమిట'ని నాలో నేను కుమిలిపోయాను. మరొక అమ్మాయికి తల్లి లేదు. తండ్రి బాధ్యతారాహిత్యం వల్ల అమ్మాయి భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఇంకొక అమ్మాయి తల్లిదండ్రులిద్దరూ అప్పుల బాధతో పురుగులమందు తాగి చనిపోయారు. దాంతో తానూ కాలేజీ మానేయాల్సిన పరిస్థితి. ఇలాంటివారి గురించి విని బాధపడుతూ కూర్చొని లాభం లేదనిపించింది. నా శక్తికొద్దీ సాయపడాలనుకున్నాను. వారందరినీ చదివించే బాధ్యత తీసుకున్నాను.

అమ్మ పేరుతో...

మనం చేసే మంచి పనికి ఒక వేదికంటూ ఉంటే బావుంటుంది అని నా స్నేహితులు సూచించారు. దాంతో 'ఆడపిల్లలకు ఒంటి మీద నగలకన్నా పేరు పక్కన విద్యార్హతలే విలువైనవి' అని నమ్మే మా అమ్మ పేరుతో 'తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ' (టైమ్స్) నెలకొల్పాం. ప్రస్తుతం నలభైమంది నిరుపేద ఆడపిల్లల ఉన్నత చదువుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని సమకూరుస్తున్నాం. ఇలా ఏటా పదిమంది చొప్పున కొత్త విద్యార్థులను తీసుకుంటూ 'టైమ్స్' సేవలను మరింతమందికి చేరువ చేయాలని భావిస్తున్నాం.

స్థానికులు ట్రస్టీలుగా...

'టైమ్స్' సహకారంతో హైందవి అనే విద్యార్థిని ఇంజనీరింగ్ పూర్తి చేసింది. రెండేళ్లు ఉద్యోగం చేసి, దాచుకున్న డబ్బుతో, ఇప్పుడు అమెరికాలో మాస్టర్స్ చదువుతోంది. మరో అమ్మాయి సుచిత్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరి తన తమ్ముడు, చెల్లెలు చదువు బాధ్యతను స్వీకరించింది. తండ్రి లేని ఆ కుటుంబానికి పెద్ద దిక్కు అయింది. వీళ్లిద్దరి విజయగాథలు మాలో మరింత మందికి సాయం చేయాలన్న తృష్ణను పెంచాయి. 'టైమ్స్'ను కేవలం మా వ్యక్తిగత సంస్థలా మార్చకుండా, సమాజం పట్ల బాధ్యతగా మెలిగే మరికొంతమంది స్థానికులను ఇందులో ట్రస్టీలుగా చేర్చాం. భారత్‌కు వచ్చినప్పుడల్లా ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని మేడికొండూరు, రావినూతల, నూజెళ్లపల్లి, దుద్దుకూరు, పంగులూరు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళుతుంటాం. అక్కడి ఉపాధ్యాయుల ద్వారా పదో తరగతి లేదా ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి, పై చదువులకు వెళ్లలేని విద్యార్థినులను గుర్తించి, వారికి పూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'టైమ్స్' గురించి తెలిసి నెల్లూరు, చిత్తూరు తదితర జిల్లాల నుంచి కూడా కొందరు మమ్మల్ని సంప్రతిస్తున్నారు. అయితే, చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, చదువు కొనలేని అమ్మాయిలకు మాత్రమే సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. అదీ ట్రస్ట్ సభ్యులంతా కలిసి ప్రతి ఒక్క విద్యార్థిని దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించిన తర్వాతే వారి చదువు బాధ్యత స్వీకరిస్తాం. విద్యార్థినులకు ఫీజు చెల్లించడంతో వదిలేయకుండా... ఫోన్, వాట్సప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు వారి బాగోగులు విచారిస్తుంటాం. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటాం. మా నాన్న కూడా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. విద్యార్థినుల ఎంపికకు అత్యుత్తమ ప్రతిభ, పేదరికమే ప్రామాణికం. అంతకు వించి కుల, మత భేదాలకు ఇక్కడ తావు లేదు. బంధుప్రీతికి అవకాశం లేదు. మా విద్యార్థినుల జాబితా చూస్తే అది సుస్పష్టం అవుతుంది.

పర్వతాన్ని అధిరోహించాం

మా అమ్మాయి వర్ష, నేను కలిసి టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాం. తర్వాత ఎవరెస్టు బేస్ క్యాంప్ వరకు వెళ్లాం. డిజిటల్ ప్రపంచంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లకే అతుక్కుపోకుండా ఆరుబయట ఆటలతో శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో చిన్నప్పటి నుంచి వర్షకు ట్రెక్కింగ్ అలవాటు చేశాం. తాను ఇప్పుడు హాఫ్ మారథాన్ పూర్తి చేసింది. ఎవరెస్టు ఎక్కేందుకు సిద్ధమవుతోంది.



అదే ప్రధాన కారణం...

మా పుట్టింటి వారిది గుంటూరు జిల్లా వేములూరిపాడు. మాది విద్యావంతుల కుటుంబం. మా అమ్మ బీఎస్సీ, నాన్న ఇంజనీరింగ్ చదివారు. నాకు తమ్ముడు, చెల్లి. అమ్మానాన్న మా ముగ్గురికీ చిన్నప్పుడు ఒక్కటే చెప్పారు... 'మీకెవరికి డొనేషన్ అంటూ కట్టం. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సీటు సంపాదించుకొనేలా మీరే బాగా చదవాలి' అని. మేమంతా అలానే చదివాం. చెల్లి డాక్టరుగా, తమ్ముడు, నేను కార్పొరేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డాం. చాలాకాలం కిందట అనారోగ్యంతో అమ్మ కన్నుమూశారు. ఆమె పేరుతోనే ఫౌండేషన్ ప్రారంభించాం. నా భర్త పూనాటి రవీంద్రది ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతల. ఆయన చిన్న రైతు కుటుంబం నుంచి వచ్చారు. మా రవికన్నా వాళ్ల పెద్ద చెల్లి అపర్ణ చాలా బాగా చదివేవారు. అయితే అత్తమ్మ వాళ్ళకు ఇద్దరినీ చదివించే స్తోమత లేక 7వ తరగతి తర్వాత మా ఆడపడుచుకు పెళ్లి చేశారు. దాంతో తనవల్లే చెల్లి చదువుకోలేకపోయిందని మా వారు ఎప్పుడూ బాధపడుతుండేవారు. 'టైమ్స్' ద్వారా కేవలం ఆడపిల్లల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా మేము ముందుకెళ్ళడానికి రవీంద్ర అనుభవం కూడా ఒక ప్రధాన కారణం. ఆయనకు ఆస్తులు కూడబెట్టాలన్న ఆలోచన లేదు. నాకు నగలు, చీరల మీద ఇష్టం లేదు. మా ఇద్దరి అభిరుచులు, ఆసక్తులు ఒక్కటే. అది 'టైమ్స్' ద్వారా వీలైనంత ఎక్కువ మందికి సాయపడటమే.

బహిర్భూమి రహిత గ్రామం...

'టైమ్స్'తో అనుబంధంగా ఉన్న అయిదు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇంగ్లీషు నిఘంటువులు, వ్యాకరణం లాంటి పుస్తకాలను ఏటా ఉచితంగా ఇస్తున్నాం. అలా ఇప్పటి వరకు మూడు వేలమందికి పంచాం. రావినూతలలోని అణగారిన వర్గాల పిల్లల కోసం గౌరవ వేతనంతో ప్రత్యేకంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి, ఉచితంగా ట్యూషన్లు నిర్వహిస్తున్నాం. బడికి సక్రమంగా వెళ్లని వారిని, అసలు బడికే వెళ్లని పిల్లలను... యాభై మంది వరకు గుర్తించాం. వాళ్ల ఇళ్లకు వెళ్లి, పెద్దలతో మాట్లాడి చిన్నారులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపేలా అవగాహన కల్పిస్తున్నాం. రావినూతల 'బండ', 'యానాది' కాలనీలను చూశాక... నేటికీ చాలా గ్రామాల్లో మరుగుదొడ్డి సౌకర్యంలేని ఇళ్లు ఎన్నో ఉన్నాయని మాకు తెలిసింది. దాంతో నా భర్త పూనాటి రవీంద్ర ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఊరిలో 220కు పైగా మరుగుదొడ్లు కట్టించారు. రావినూతలను బహిర్భూమి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. గ్రామీణ బాలికలకు నెలసరి ఆరోగ్యం మీద గైనకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం.

నిరంతర సేవ...

ప్రస్తుతం నేను అమెరికాలోని ఒక కార్పొరేట్ కంపెనీలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. నా భర్త కూడా మరొక కార్పొరేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ స్థాయిలో ఉన్నారు. ఉద్యోగ జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడం, మనల్ని మనం నిరూపించుకోవడం, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు... ఈ ఆనందాలన్నింటినీ ఇరువురం ఇరవై ఏళ్లుగా అనుభవిస్తున్నాం. అందుకు పూర్తి భిన్నంగా, మరొకరికి సహాయపడటం ద్వారా అసలైన సంతోషాన్ని ఇప్పుడు అస్వాదిస్తున్నాం. 'టైమ్స్' ద్వారా 'ఇన్ని వందల మందిని చదివించాలి. ఇన్ని గ్రామాలకు మా సేవలు చేరువవ్వాలి' లాంటి లక్ష్యాలేమీ మేము పెట్టుకోదలుచుకోలేదు. మాకు ఉద్యోగ జీవితం, సొసైటీ సేవలు మినహా ఇతర వ్యాపకాలేమీ లేవు. మా అమ్మాయి వర్ష పూనాటి కూడా ఫౌండేషన్ సేవల్లో చురుగ్గా పాల్గొంటోంది. కనుక మేం తలపెట్టిన ఈ సేవా కార్యక్రమాలు మాతో ఆగకూడదు. అవి నిరంతరం కొనసాగాలని అనుకొంటున్నాం. నిజానికి 'టైమ్స్' బలం, బలగమంతా రావినూతల గ్రామ ప్రజలు, మా ట్రస్ట్ సభ్యులే. వారందరి సమష్టి శ్రమ, సహకారంవల్లే మేం తలపెట్టిన సేవా కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. నిస్వార్థంతో సాటి మనిషికి సాయపడాలనుకొనే మంచి వ్యక్తులు 'టైమ్స్'కు వాలంటీర్లుగా ఉన్నారు. అలాంటి వ్యక్తులు దొరకడం మాకు పెద్ద వరం. గ్రామస్తుల భాగస్వామ్యంతో రావినూతలను ప్లాస్టిక్ రహిత పల్లెగా... స్వచ్ఛ గ్రామంగా మార్చాలన్నది మా ఆలోచన. ఆ దిశగానూ అడుగులు వేస్తున్నాం."

అమెరికాలోని విద్యార్థులకు...

కాలిఫోర్నియాలోని హెవార్డ్, టెన్నెసన్ హైస్కూల్ విద్యార్థినులకు కెరీర్ విషయంలో మార్గనిర్దేశం చేస్తున్నాను. ఈ స్కూలు పిల్లలంతా అత్యంత నిరుపేదలు. వారి తల్లిదండ్రులు కూడా పెద్దగా చదువుకోలేదు. ఇంకా చెప్పాలంటే, వారంతా మెక్సికో, క్యూబా తదితర దక్షిణ అమెరికా దేశాల నుంచి పొట్ట చేత పట్టుకొని వచ్చినవారు. అలాంటి వారికి సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల మీద అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన అవకాశాలను చేరువ చేయచ్చనే ఉద్దేశంతో వారంలో ఒకరోజు తరగతులు తీసుకొంటున్నాను. అందులో పన్నెండు మందికి ఈ మధ్యనే మ్యాక్ ల్యాప్‌టాప్‌లు ఇచ్చాం.



• సాంత్వన్

కేర్‌టేకర్

ఒడిశా నిస్తిపూర్ గ్రామం... అరచండి ప్రాంతం... ఒకప్పుడు ఇది వలస పక్షులకు స్వర్గధామం. సందర్శకుల తాకిడి... వేటగాళ్ల అలికిడికి వాటి సంచారం తగ్గింది. కొందరు స్థానిక మహిళలను ఇది కలవరపెట్టింది. పన్నెండుమంది కలిసి ఒక జట్టుగా ఏర్పడి... శీతాకాలం విడిదికి వచ్చే ప్రియ నేస్తాలకు రక్షణ కవచంలా నిలిచారు. పరిసరాలను వాటికి అనువుగా మలిచి... ఆహ్లాదకరమైన ఆతిథ్యం అందిస్తున్నారు.

వలస పక్షుల రక్షకులు



అరుదైన పక్షి జాతులకు విహార కేంద్రం ఒడిశాలోని నిస్తిపూర్. శీతాకాలం వచ్చిందంటే... రకరకాల పక్షులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ వాలుతాయి. పచ్చని పైరులు... విస్తారంగా చెట్లు... నీటి కొలనులు... చుట్టూ కొండలు... ఎన్నెన్నో ప్రకృతి సోయగాలతో అరచండి చిత్తడి నేలలు (వెట్‌లాండ్స్) అలరారుతాయి. దీనికి విభిన్న పక్షుల కేరింతలు, కిలకిలారావాలు అదనపు ఆకర్షణ. అందుకే ఇక్కడ సందర్శకుల తాకిడి విపరీతంగా ఉంటుంది. ఈ సంఖ్య ఏటికేడూ పెరుగుతూ పోతోంది. కానీ అదే వలస పక్షుల పాలిట శాపంగా మారింది.

"ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో మా ప్రాంతమంతా కాలుష్యమయంగా మారింది. దగ్గర్లోని అరచండి ఆలయానికి వచ్చే భక్తులు, మైకులు, వాయిద్యాలతో శబ్ద కాలుష్యం కూడా ఎక్కువైంది. మరోవైపు వేటగాళ్ల అలజడి. వీటన్నిటి నేపథ్యంలో పక్షుల సంఖ్య క్రమంగా తగ్గింది. చిన్నప్పటి నుంచి నేను వాటిని చూస్తూ పెరిగాను. అవి ఆకాశంలో అలా ఎగురుతుంటే... జంటలుగా ఊసులాడుకొంటుంటే... ప్రతి దృశ్యం నాకు అద్భుతంగానే అనిపించేది. మనసు పరవశించేది. ఆ తరువాత కాలంలో కాలుష్యానికి కొన్ని, వేటగాళ్ల ఆహారానికి మరికొన్ని... మృత్యువాత పడటం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఏటా వేలమంది పర్యాటకులకు కనువిందు చేస్తున్న పక్షులు... ఒక్కొక్కటిగా కనుమరుగవుతుంటే తట్టుకోలేకపోయాను. ఈ సమస్యకు పరిష్కారం కనుగొని... పూర్వంలా పక్షులు ఇక్కడ హాయిగా విహరించేలా ఏదైనా చేయాలనుకున్నాను' అంటూ చెప్పుకొచ్చారు సూర్యకాంతి మొహంతి. పన్నెండుమంది మహిళలు కలిసి ఏర్పడిన వలస పక్షుల సంరక్షణ బృందంలో ఆమె ఒకరు.

అవగాహన కల్పించి...

వేటగాళ్లు పక్షులను వేటాడి తినేవారు. మరికొందరు వల వేసి పట్టుకుని, వాటికి ఉన్న ప్రత్యేక ఆకర్షణను మార్కెట్లో సొమ్ము చేసుకొనేవారు. "ఇది పక్షుల వలసలపై తీవ్ర

> — 66 —
> సూర్యకాంతి బృందం అలుపెరుగని కృషితో ఒకప్పుడు అనూహ్యంగా తగ్గిన పక్షుల వలస తిరిగి ఊపందుకుంది. రెండేళ్లలో సాధారణ స్థితికి చేరుకుంది.
> — 99 —

ప్రభావం చూపింది. దీనిపై గ్రామస్తులందరితో సమావేశమయ్యాను. నాతో మరో పదకొండు మంది గృహిణులు కలిసి నడిచారు. అందరం ఇంటింటికీ తిరిగాం. కాలుష్యానికి, వేటకు అడ్డుకట్ట వేయపోతే అరుదైన పక్షులు అంతరించిపోతాయని వివరించి చెప్పాం. ముందు మా ఇంటి మగవాళ్లకు అవగాహన కల్పించాం. వారి సహకారంతో ఊళ్లో వారందరినీ ఒక తాటి పైకి తేగలిగాం. ముఖ్యంగా రసాయనాలు లేకుండా సేంద్రియ ఎరువులతో పంటలు పండించాల్సిందిగా రైతులను కోరాం. ఎందుకంటే పక్షుల ఆహారానికి ఇక్కడి వరి పంటలే ఆహారం. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడితే... అవి తినే ఆహారం విషతుల్యం అవుతుంది. అందుకే రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాం. వాళ్లు కూడా పెద్ద మనసుతో అర్థం చేసుకున్నారు. తరువాత మా పన్నెండు మంది మహిళలం కలిసి 'అరచండి పక్షి సురక్ష్య సమితి' ఒకటి ఏర్పాటు చేశాం. వలస పక్షులకు రక్షణ కవచంలా నిలిచాం" అని చెప్పారు సూర్యకాంతి.



పరిరక్షణ... పరిశుభ్రత...

వలస పక్షులకు ఎలాంటి హానీ కలగకుండా చూసుకోవడానికే ఈ మహిళలు పరిమితం కాలేదు. ఉదయం లేవగానే వారు ఇక్కడి చిత్తడి నేలను పరిశుభ్రం చేస్తారు. పర్యాటకులు వాడి పడేసిన వస్తువులు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తారు. పరిసరాల్లో చెత్తాచెదారం వేయడం, బిగ్గరగా శబ్దాలు చేయడంవల్ల పక్షులు బెదిరిపోతాయని, ఆ ప్రభావంతో వలసలు తగ్గిపోతాయని సందర్శకులు, ఆలయానికి వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తారు. ప్లకార్డులు ప్రదర్శిస్తారు. ఈ మహిళల కృషికి గ్రామ పెద్దలు కూడా మద్దతుగా నిలిచారు. రైతులు పక్షి ప్రేమికులుగా మారి... సేంద్రియ సాగు వైపు మళ్లారు. గతంలో కంటే అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

తిరిగి విడిదికి...

సూర్యకాంతి బృందం అలుపెరుగని కృషితో ఒకప్పుడు అనూహ్యంగా తగ్గిన పక్షుల వలస తిరిగి ఊపందుకుంది. రెండేళ్లలో సాధారణ స్థితికి చేరుకుంది. గత ఏడాది చివరల్లో ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి పక్షుల గణన కూడా చేపట్టారు. అందులో తేలిందేమంటే... పూర్వంలా వందల రకాల పక్షులు మళ్లీ అరచండికి వలస వస్తున్నాయని. 'మేమే కాదు... సందర్శకులు, గ్రామస్తులు కూడా ఇప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటున్నారు. వాటి ప్రశాంత విహారానికి భంగం కలగకుండా, వేటగాళ్ల నుంచి ప్రాణహాని లేకుండా చూసుకొంటున్నారు. నిజంగా ఇది శుభపరిణామం' అంటూ సంతోషం వ్యక్తం చేశారు బృందంలోని మరో సభ్యురాలు స్నేహాంజలి బిస్వాల్.

అందరి బాధ్యత...

కేవలం పన్నెండు మంది మహిళలు కలిసి కృషి ఫలితం... వలస పక్షులకు మళ్లీ అరచండీ బాట పట్టడం. అదే ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తే... ఈ ప్రాంతం మరింతమందికి ఆహ్లాదం, ఆనందం పంచుతుందంటారు స్థానికులు. 'ఇదివరకటిలా మా గ్రామం పక్షుల విహారంతో చూపరులను ఆకట్టుకుంటోంది. అందులో సందేహం లేదు. కానీ కొన్ని అరుదైన జాతులు క్రమంగా తగ్గిపోతున్నాయి. స్వచ్ఛంద, ప్రభుత్వ సంస్థలు, సందర్శకులు... అందరూ కలిసి నడిస్తేనే వాటిని రక్షించుకోగలుగుతాం. ఇక్కడే కాదు... వన్యప్రాణులకు ఆవాసమైన ఏ ప్రాంతమైనా కాలుష్యం, వేటగాళ్ల బారిన పడకుండా చూసుకోవాలి. లేదంటే వాటి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది' అంటున్న సూర్యకాంతి బృందం... తమ ప్రయత్నాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

శేఖర్ కమ్ములతో మూడో సినిమా!



అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకొనే అద్భుతమైన చిత్రాలను రూపొందించడంలో పేరొందిన దర్శకుడు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం నాగార్జున, ధనుష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే శేఖర్ కమ్ములతోనే మరో చిత్రాన్ని నిర్మించనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ బుధవారం ప్రకటించింది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించనున్నాయి. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ చిత్రం లార్జర్ దాన్ లైఫ్‌గా ఉండబోతోందని నిర్మాతలు వెల్లడించారు. టాప్ క్లాస్ టెక్నీషియన్లతో, హై బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మిస్తామన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ప్రస్తుతం నిర్మిస్తున్న చిత్రం పూర్తి కాగానే కొత్త సినిమా సెట్స్‌కు వెళుతుందని నిర్మాతలు వెల్లడించారు. ఇంతకుముందు నాగచైతన్య, సాయిపల్లవి, శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో 'లవ్‌స్టోరీ' చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహనరావు నిర్మించిన సంగతి విదితమే.

మెకానిక్ సందేశం



మణిసాయి తేజ, రేఖా నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకత్వంలో ఎం నాగమునెయ్య నిర్మించారు. ఈ నెల 2న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా 'మెకానిక్' ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా చిత్రబృందం ఆవిష్కరించింది. ఫ్లోరైడ్ బాధిత ప్రజల జీవితాలే ఇతివృత్తంగా తెరకెక్కిన 'మెకానిక్' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'మంచి సినిమా తీశాం. సందేశంతో పాటు వాణిజ్య హంగులూ ఉన్నాయ'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా నిర్మాతల ధైర్యం వల్లే మంచి సినిమా తీయగలిగాం. సిద్ శ్రీరాం ఓ పాట పాడారు. తనికెళ్ల భరణి గారి సహకారం మరువలేనిద'న్నారు.

విడాకుల వార్తలకు చెక్



సూర్య, జ్యోతిక దంపతులు తాము విడిపోబోవడం లేదని చెప్పకనే చెప్పారు. తమ విదేశీ విహార యాత్రతో విడాకుల వదంతులకు ముగింపు పలికారు. సినిమాలకు విరామం ఇచ్చిన సూర్య, జ్యోతిక ఫిన్లాండ్ వెళ్లి ఆనందంగా గడిపారు. ఆ వీడియోను బుధవారం సోషల్ మీడియాలో జ్యోతిక షేర్ చేశారు. ఇలాంటి పర్యటనలతో ఈ ఏడాదంతా తమకు ఆహ్లాదం పంచాలని ఆమె ఆకాంక్షించారు. చాన్నాళ్ల తర్వాత సూర్య, జ్యోతిక కలసి కనిపించడంతో వారు విడిపోబోతున్నారనే వార్తలకు ఇక ముగింపు పలికినట్లైందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పిల్లల చదువు, బాలీవుడ్ సినిమాలు చేస్తుండడంతోనే తాను ముంబైలో ఉంటున్నాననీ, తమ వైవాహిక జీవితంలో ఎలాంటి ఇబ్బందులు లేవని జ్యోతిక గతంలోనూ పలు సందర్భాల్లో తెలిపారు. సూర్య నటించిన 'కంగువ' చిత్రం త్వరలోనే విడుదలవనుంది. సైతాన్, 'శ్రీ'తో పాటు మరో హిందీ చిత్రంలోనూ జ్యోతిక నటిస్తున్నారు.

యాక్షన్ సీక్వెన్స్‌తో

సుమన్ బాబు దర్శకత్వంలో ఎన్‌వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన చిత్రం 'ఎర్రచీర'.



శ్రీరామ్, కారుణ్య చౌదరి జంటగా నటించారు. మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రం యాక్షన్ ట్రైలర్‌ను నిర్మాత దిల్‌రాజు చేతుల మీదుగా విడుదల చేశారు. 45 నిమిషాల పాటు సాగే గ్రాఫిక్స్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ అని ఈ సందర్భంగా నిర్మాత తెలిపారు. ఈ చిత్రంలో రఘుబాబు, అలీ, అన్నపూర్ణమ్మ కీలకపాత్రలు పోషించారు.



ఈ సినిమా ట్రైలర్‌ని పదిసార్లు చూశా

అడివి శేష్

'ఈ వేదిక పై ఉన్న వాళ్లంతా ఏదో ఒక కల కని సాధించిన వాళ్లే. సుహాస్ గొప్పస్థాయికి వెళ్తాడని చెప్పగలను. ఇలాంటి టాలెంటెడ్ ఆర్టిస్టులు అరుదుగా ఉంటారు. ఈ సినిమా ట్రైలర్‌ను పదిసార్లు చూశా. అంత బాగా నచ్చింది. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. సుహాస్ హీరోగా నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'నిర్మాతగా నేను మీ ముందు నిలబడడానికి ముగ్గురు వ్యక్తులు కారణం.. అల్లు అరవింద్, శిరీష్, బన్నీ వాసు. దర్శకుడు దుష్యంత్ ఈ సినిమా కోసం రెండేళ్లు పనిచేశాడు. ఈ చిత్రం రిలీజ్ అయ్యాక అతని లైఫ్ మారిపోతుంది. అలాగే హీరో సుహాస్ మరో సినిమా జోలికి పోకుండా ఏడాది పాటు ఈ మూవీ మీదే ఫోకస్ చేశారు' అన్నారు. 'నేను గీతా ఆర్ట్స్‌లో నటిస్తున్నానంటే మా పేరెంట్స్ నమ్మలేదు. నాకు అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థాంక్స్ ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో 'అంబాజీపేట మ్యారేజి బాండ్'లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చానని చెప్పగలను. దీనికి దర్శకుడు దుష్యంత్ డిటెయిలింగ్ కారణం' అన్నారు సుహాస్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బన్నీ వాసు, ఎస్.కె.ఎన్, దర్శకుడు సాయి రాజేశ్ తదితరులు కూడా మాట్లాడారు.

'ధీర' విజయవంతం కావాలి

దిల్ రాజు



'చదలవాడ బ్రదర్స్‌ను పాతికేళ్ల నుంచి చూస్తూనే ఉన్నా. అనూరాధ ప్రొడక్షన్స్ బేనరుపై ఎన్నో అద్భుత చిత్రాలు నిర్మించారు. ప్రారంభంలో నాకు వారితో పెద్దగా పరిచయం లేదు. 'దసరా' చిత్రాన్ని శ్రీనివాసరావుగారు కొన్నారని తెలిసిన తర్వాత ఆయన్ని కలిశాను. ఆ తర్వాత వ్యక్తిగతంగా ఎంతో దగ్గరయ్యాం. ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నేను గెలవడం కోసం ఆయన చాలా సాయం చేశారు. శ్రీనివాసరావుగారి అబ్బాయి లక్ష్ నటించిన 'ధీర' ట్రైలర్ బాగుంది. అతని కష్టానికి, యూనిట్ శ్రమకు తగిన ప్రతిఫలం రావాలి. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు దిల్ రాజు. మంగళవారం జరిగిన 'ధీర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. చిత్రం బిగ్ టికెట్‌ను దిల్ రాజు, గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఇన్నేళ్లలో ఏ హీరోని నేను డేట్స్ అడగలేదు. ఎంతో మంది కొత్త దర్శకులను పరిచయం చేశాను. 'ధీర' చిత్రంతో విక్రాంత్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మా అబ్బాయి లక్ష్ ను చూసి గర్విస్తుంటాను. 'ధీర' ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఐదేళ్ల నుంచి నేను ఓ సినిమా తీస్తున్నా. అది పాన్ వరల్డ్ చిత్రం. మా బేనర్‌లో ఇప్పుడు పదహారు చిత్రాలు తయారవుతున్నాయి. ప్రతి నెలా ఒకటి చొప్పున విడుదల చేస్తాం.' అని చెప్పారు. 'ఈ సినిమాలో పాత్రకూ, రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కూ ఏ మాత్రం సంబంధం లేదు. పక్కనోడి గురించి పట్టించుకోకుండా తనకు నచ్చింది చేస్తుంటాడు. అలాంటి వాడికి ఓ మిషన్ అప్పగిస్తే, ఆ ప్రయాణంలో వచ్చే సమస్యల్ని 'ధీర'లో చూపిస్తున్నాం. మా నాన్నగారు లేకపోతే నేను లేను. ఆయన వన్ మ్యాన్ ఆర్మీ. విజయాలు వచ్చినా, అపజయాలు ఎదురైనా ఆయన బ్యాలెన్స్‌డ్‌గా ఉంటారు. మా సినిమాతో పాటు విడుదలవుతున్న చిత్రాలన్నీ ఆడాలి' అన్నారు లక్ష్. ఎన్టీఆర్ నటించిన 'డ్రైవర్ రాముడు' రిలీజ్ అయిన ఫిబ్రవరి రెండున వస్తున్న 'ధీర' సక్సెస్ కావాలని నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ చెప్పారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ కోరారు. 'ధీర' చాలా యూనిక్ పాయింట్ అని దర్శకుడు విక్రాంత్ చెప్పారు. హీరో పాత్రకు కూడా గ్రే షేడ్స్ ఉంటాయనీ, ఎనభై శాతం చిత్రం నైట్ ఎఫెక్ట్‌లోనే ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి తదితరులు మాట్లాడారు.

దమ్ బిర్యానీలాంటి హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి



'సినిమాలో అందమైన హ్యూమన్ ఎమోషన్ ఉంది. సినిమా కథకు అసలైన పాయింట్ అదే. శాపం అనేది చిన్న డ్రైవింగ్ ఫోర్స్ మాత్రమే. కథలో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేది ఎమోషన్‌కే. అన్ని దినుసులు ఉన్న దమ్ బిర్యానీ లాంటి సినిమా 'హ్యాపీ ఎండింగ్' అని చెప్పారు యశ్ పూరి. ఆయన హీరోగా నటించిన 'హ్యాపీ ఎండింగ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా యశ్ మీడియాతో మాట్లాడుతూ 'పురాణాల్లోని శాపాలు అనే కాన్సెప్ట్ తీసుకుని మా దర్శకుడు కౌశిక్ ఈ చిత్రకథ తయారు చేశారు. సినిమాలో అంతా ఫన్. వినోదభరితంగా సాగిపోతుంది. ముఖ్యంగా చివరి పదిహేను నిముషాలు మిస్ కావద్దు.' అన్నారు, మూడు వేల ఏళ్ల కిందటి కాన్సెప్ట్ తీసుకుని ఇప్పటి జనరేషన్ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీసినట్లు యశ్ చెప్పారు. ' న్యూ హీరో యంగ్ ఆడియన్స్‌ను అట్రాక్ట్ చేయాలంటే కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండాలి. ఫ్రెండ్స్‌తో మీరు ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. నేను నాలుగు సినిమాలు చేశాను. అన్నింటిలోనూ స్టోరీ ఫస్ట్ హీరో. నేను సెకండ్ హీరోని. ఈ చిత్రంలోనూ అంతే' అని తెలిపారు యశ్.

స్పోర్ట్స్

మా అమ్మ ఆరోగ్యంగానే ఉంది

కోహ్లి సోదరుడు వికాస్

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లి తల్లికి తీవ్ర అనారోగ్యం అంటూ సోషల్ మీడియాలో రెండో రోజులుగా హల్‌చల్ చేస్తున్న వార్తలను అతడి సోదరుడు వికాస్ ఖండించాడు. అవన్నీ తప్పుడు కథనాలన్నాడు. 'మా అమ్మ ఆరోగ్యం గురించి అసత్య ప్రచారం జరుగుతోంది. ఆమె బేషుగ్గా.. ఫిట్‌గా ఉన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇలాంటి వదంతులను వ్యాప్తి చేయవద్దని ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నాన'ని వికాస్ ఇన్‌స్టాలో పోస్టు పెట్టాడు. కోహ్లి తల్లి సరోజ్ కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, అందుకే అతడు ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది.

కోహ్లి కెప్టెన్ అయ్యుంటే టీమిండియా ఓడేది కాదు!

ఇంగ్లండ్ మాజీ సారథి వాన్



లండన్: విరాట్ కోహ్లి కెప్టెన్సీలో అయితే హైదరాబాద్ టెస్ట్‌లో భారత జట్టు ఓటమి పాలై ఉండేది కాదని ఇంగ్లండ్ మాజీ ఆటగాడు మైకేల్ వాన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ కెప్టెన్సీ తీరును తప్పుపట్టాడు. ఉప్పల్ టెస్ట్‌లో 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా.. భారత్ 28 పరుగులతో ఓడడం ఫ్యాన్స్‌ను షాక్‌కు గురి చేసింది. 'టెస్టుల్లో విరాట్ సారథ్యాన్ని టీమిండియా ఎంతో మిస్ అవుతోంది. రోహిత్ గొప్ప ఆటగాడే. కానీ, ఈ మ్యాచ్‌లో ఏదో లోకంలో ఉన్నట్టుగా నిలుచుండిపోయాడు. పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ మార్పులు కూడా చేయలేదు. పోప్ రివర్స్ స్వీప్‌లకు అతడి వద్ద సమాధానమే లేకపోయింద'ని వాన్ ఓ కాలమ్‌లో రాశాడు.

తెలంగాణ 6, ఆంధ్ర 13

ఖేలో ఇండియా క్రీడలు



లక్ష్మీసిరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణ ఆరు, ఆంధ్రప్రదేశ్ 13వ స్థానంతో ముగించాయి. చెన్నైలో వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణ మొత్తంగా 13 స్వర్ణాలు సహా 24 పతకాలతో ఆరో స్థానంలో.. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలతో కలిపి 27 పతకాలు సొంతం చేసుకొని 13 స్థానంతో సరిపెట్టుకుంది. మహారాష్ట్ర ఓవరాల్ చాంపియన్ టైటిల్ గెలుచుకుంది. బాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్ర ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఇక, ఆఖరి రోజు జరిగిన బాలికల టెన్నిస్ సింగిల్స్ ఫైనల్లో తెలంగాణ అమ్మాయి దండు లక్ష్మీసిరి 1-6, 3-6తో రేవతి (తమిళనాడు) చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. స్విమ్మింగ్‌లో 500 మీటర్ల ఫ్రీస్టయిల్ కేటగిరీలో వ్రితి అగర్వాల్ స్వర్ణం సాధించింది.

పూర్తిగా స్పిన్నర్లతోనే?



విశాఖ టెస్ట్‌కు ఇంగ్లండ్ వ్యూహం



విశాఖపట్నం: భారత్‌తో జరిగే రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ తన వ్యూహాన్ని మార్చబోతోందట! విశాఖపట్నంలో జరిగే ఈ టెస్ట్‌కు మొత్తం స్పిన్నర్లతోనే బరిలోకి దిగాలని భావిస్తోందట!! హైదరాబాద్‌లో జరిగిన మొదటి టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో వెనుకంజలో నిలిచి కూడా..పర్యాటక జట్టు అద్భుత విజయం దక్కించుకుంది. ఇందుకు ప్రధాన కారణం అరంగేట్ర స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లు తీసి జట్టు విజయంలో అతడు కీలక భూమిక పోషించాడు. రెండో టెస్ట్ జరిగే విశాఖ పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలిస్తుందని అంచనా వేస్తున్నారు. అలాగే భారత బ్యాటర్లు స్లో బౌలర్ల బౌలింగ్‌లోనూ తడబాటుకు లోనవుతున్న తీరును చూసిన ఇంగ్లండ్ జట్టు యాజమాన్యం తమ సంప్రదాయానికి భిన్నంగా..పూర్తిగా స్పిన్నర్లతోనే ఆడితే ఎలా ఉంటుందని ఆలోచిస్తోంది. ఇంగ్లండ్ కనుక ఇదే వ్యూహాన్ని అమలు చేస్తే..20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ విశాఖ టెస్ట్‌లో అరంగేట్రం చేసే అవకాశాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. 'మా స్పిన్నర్లందరినీ ఆడించేందుకు భయపడబోం' అని ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్ అనడం రెండో టెస్ట్‌కు ఆ జట్టు వ్యూహాన్ని పరోక్షంగా తెలియజేస్తోంది. హార్ట్‌లీకి, బషీర్ తోడైతే మాత్రం భారత్‌కు కష్టాలు తప్పవు.

లీచ్ దూరం!

ఇంగ్లండ్ సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్ రెండో టెస్ట్‌కు దాదాపు దూరమైనట్టే. హైదరాబాద్ టెస్ట్ తొలి రోజు ఆటలో ఫీల్డింగ్ సందర్భంగా అతడి ఎడమ మోకాలికి గాయమైంది. దాంతో బుధవారం జరిగిన ప్రాక్టీస్‌లో లీచ్ పాల్గొనలేదు. మైదానం వెలుపల అతడికి జట్టు ఫిజియో చికిత్స చేస్తూ కనిపించాడు.



పిచ్‌ను పరిశీలిస్తున్న సిరాజ్

గిల్, శ్రేయా‌స్‌పై ఆందోళన లేదు..

శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ వైఫల్యాలపై ఆందోళన చెందడంలేదని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నాడు. ఇక..ఇంగ్లండ్ దూకుడుకు విశాఖ టెస్ట్‌లో తెలివిగా చెక్ పెట్టాలని జట్టుకు సూచించాడు. హైదరాబాద్ టెస్ట్‌లో భారత్ 190 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకున్నా.. 28 రన్స్‌తో మ్యాచ్ ఓడిన సంగతి తెలిసిందే. 'జట్టులోని యువ బ్యాటర్లకు ఎక్కువగా టెస్టులు ఆడిన అనుభవం లేదు. అందువల్ల వారి బ్యాటింగ్ ఫామ్‌పై ఆందోళన చెందడంలేదు. గిల్, శ్రేయాస్, జైస్వాల్ త్వరలో భారీ స్కోర్లు చేస్తారు' అని రాథోడ్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

వామ్మో..భారత వికెట్లా..: ఫోక్స్

భారత పిచ్‌లపై వికెట్ కీపింగ్ ఎంతో కష్టమని..ఇంగ్లండ్ కీపర్ బెన్ ఫోక్స్ అభిప్రాయపడ్డాడు. 'భారత వికెట్లపై బంతులు అనూహ్యంగా బౌన్స్ అవుతాయి. అందుకే స్పిన్నర్ల బౌలింగ్‌లోనూ వికెట్లకు దూరంగా ఉండి కీపింగ్ చేయాలి' అని చెప్పుకొచ్చాడు.

అది సహజంగా వచ్చిందే..

బజ్‌బాల్ వ్యూహాన్ని తమ జట్టు బ్యాటర్లంతా పూర్తిగా వంటబట్టించుకున్నారని ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ తెలిపాడు. అలా ఆడడం ప్రారంభించాక వారంతా బ్యాటింగ్‌లో ఎంతో మెరుగయ్యారన్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన బ్రెండన్ మెకల్లమ్ తానాడే రోజుల్లో దూకుడైన బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచాడు. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా వచ్చాక సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ దూకుడుగా ఆడే 'బజ్‌బాల్' విధానాన్ని..ఆ జట్టుకు అలవాటు చేశాడు. బజ్‌బాల్ వ్యూహాన్ని అనుసరించడం మొదలుపెట్టాక ఇంగ్లండ్ ఇప్పటి వరకు ఒక్క టెస్ట్ కూడా ఓడిపోకపోవడం విశేషం. 'ఇంగ్లండ్ దేశవాళీలో చాలా జట్లు దూకుడుగా ఆడతాయి. అంటే..బజ్‌బాల్ మాకు సహజంగా వచ్చిందే' అని క్రాలీ వివరించాడు.

టాప్‌లోనే అశ్విన్

టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బౌలర్‌గా నెంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 853 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. పేసర్ బుమ్రా ఓ స్థానం మెరుగుపరచుకొని నాలుగో ర్యాంక్‌కు ఎగబాకాడు. జడేజా ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్లలో జడేజా టాప్‌లో, అశ్విన్ రెండో స్థానంలో ఉండగా, అక్షర్ పటేల్ ఆరో ర్యాంక్‌కు పడిపోయాడు. ఇక బ్యాటర్ల విభాగంలో భారత్ నుంచి విరాట్ కోహ్లి ఆరో ర్యాంకుతో టాప్-10లో నిలిచాడు.

అతడిపై భారమే కానీ..

న్యూఢిల్లీ: గాయంతో షమి జట్టుకు దూరం కావడం.. ప్రధాన పేసర్ బుమ్రాపై భారం పెంచేదేనని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. అయితే బుమ్రా ప్రస్తుతం శారీరకంగా దృఢంగా ఉన్న నేపథ్యంలో..ఆ భారం అతడికి సమస్య కాబోదని అభిప్రాయపడ్డాడు. వన్డే వరల్డ్ కప్ సందర్భంగా మోకాలి గాయం అయిన షమి..ప్రస్తుతం జట్టుకు అందుబాటులో ఉండని సంగతి తెలిసిందే.

మళ్లీ జై షాకే ఏసీసీ పగ్గాలు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షా ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)లో తన ఆధిపత్యాన్ని మళ్లీ చాటుకున్నాడు. వరుసగా మూడోసారి ఏసీసీ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఇండోనేసియాలోని బాలిలో బుధవారం జరిగిన ఏసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఏసీసీ చీఫ్ పదవికి జై షా పేరును శ్రీలంక క్రికెట్ చీఫ్ షమీ సిల్వా ప్రతిపాదించగా, మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలిసారిగా 2021లో ఏసీసీ పగ్గాలు చేపట్టిన 35 ఏళ్ల షా.. మరో రెండేళ్లు ఆ పదవిలో కొనసాగనున్నాడు. ఇక, షా నాయకత్వంలో ఆసియా కప్‌ను 2022లో (టీ20 ఫార్మాట్‌లో), నిరుడు (వన్డే ఫార్మాట్‌లో) సమర్థవంతంగా నిర్వహించారు.

శ్రీకాంత్ శుభారంభం

» థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: ఇటీవల వరుస టోర్నమెంట్లలో విఫలమవుతున్న భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ ఈవెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ శ్రీకాంత్ 22-20, 21-19తో చైనీస్ తైపీ షట్లర్ వాంగ్ జూ వీపై గెలిచాడు. మరో భారత ఆటగాడు మిథున్ మంజునాథ్ 21-17, 21-8తో జాసన్ గునవాన్ (హాంకాంగ్)ను చిత్తుచేసి కిడాంబి శ్రీకాంత్‌తో రెండోరౌండ్ పోరుకు సిద్ధమయ్యాడు. మిగతా భారత షట్లర్లలో శంకర్ ముత్తుస్వామి 21-14, 21-17తో లియోంగ్ జున్ (మలేసియా)పై, అస్మిత చాలియా 21-10, 21-16తో వోంగ్ లింగ్ (మలేసియా)పై, మాళవికా బన్సోడ్ 22-20, 21-8తో ఇనెస్ లూసియా (పెరూ)పై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. సమీర్ వర్మ, కిరణ్ జార్జ్ ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగారు.

అవి నకిలీ టోర్నీలు

» రెజ్లర్ సాక్షి మాలిక్ ఆరోపణ

న్యూఢిల్లీ: వేటుపడిన భారత రెజ్లింగ్ సంఘం (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ నకిలీ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాడని ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ ఆరోపించింది. చట్టవ్యతిరేకంగా జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ నిర్వహించి.. ఆటగాళ్లకు నకిలీ సర్టిఫికెట్లు ప్రదానం చేశాడని ఎక్స్‌లో పోస్టు చేసింది. వీటి వల్ల ఆటగాళ్లకు భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని చెప్పింది. దీనిపై క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ దృష్టి సారించాలని కోరింది. స్పోర్ట్స్ కోడ్ ఉల్లంఘన కారణంగా కొత్తగా ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గాన్ని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

మయాంక్ డిశ్చార్జ్

» ఆరోగ్యంగానే ఉన్నానంటూ పోస్టు



అగర్తల: విమానంలో తీవ్ర అనారోగ్యానికి గురైన కర్ణాటక రంజీ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రయాణం చేసేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో మరో విమానంలో బుధవారం సాయంత్రం అతడు బెంగళూరు చేరుకొన్నాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి మరోసారి పరీక్షలు చేయించుకొంటాడని సమాచారం. ప్రస్తుతం అతడికి విశ్రాంతి తప్పనిసరి కావడంతో శుక్రవారం నుంచి సూరత్‌లో రైల్వేస్‌తో జరిగే రంజీ మ్యాచ్‌కు దూరమయ్యాడు. 32 ఏళ్ల మయాంక్ టీమిండియా తరఫున 21 టెస్టులు, 5 వన్డేలు ఆడాడు.

అఖిల్ కంచు మోత



కైరో (ఈజిప్టు): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో చివరిరోజు భారత షూటర్ అఖిల్ షెరాన్ పతకంతో మెరిశాడు. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత ఈవెంట్‌లో అఖిల్ కాంస్యం సాధించాడు. ఫైనల్లో అఖిల్ 451.8 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచాడు. చెక్ రిపబ్లిక్ షూటర్ జిరి ప్రివ్రాట్‌స్కీకి స్వర్ణం, ఫ్రాన్స్‌కు చెందిన రొమైన్ అఫ్రెరెకు రజతం లభించాయి. ఈ టోర్నీలో భారత షూటర్లు ఓవరాల్‌గా రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఓ కాంస్యం గెలిచారు.

అగ్రస్థానంలో జైపూర్ పింక్ పాంథర్స్

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10లో జైపూర్ పింక్ పాంథర్స్ అగ్రస్థానానికి చేరుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 42-27తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. ఈ విజయంతో మొత్తం 71 పాయింట్లతో జైపూర్ టాప్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో జైపూర్ రైడర్లు అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో, అజిత్ కుమార్ 9 పాయింట్లతో సత్తా చాటి, ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. తలైవాస్ రైడర్ నరేందర్ (12 పాయింట్లు) ఒంటరి పోరాటం వృధా అయింది. ఇక, పట్నా పైరేట్స్-బెంగళూరు బుల్స్ తలపడిన మరో మ్యాచ్ 29-29 స్కోరుతో టైగా ముగిసింది.

బిజినెస్

పసిడీలా..!

3 శాతం తగ్గిన డిమాండ్

ముంబై: గత సంవత్సరం భారత్‌లో బంగారం గిరాకీ వార్షిక ప్రాతిపదికన 3 శాతం తగ్గి 747.5 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అధిక ధరలు ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. 2022లో గోల్డ్ డిమాండ్ 774.1 టన్నులుగా నమోదైంది. "అక్టోబరులో నవరాత్రుల సమయంలో ధరలు తగ్గుముఖం పట్టడం వినియోగదారుల్లో బంగారం కొనుగోలుపై ఆసక్తి పెరగడానికి, నవంబరులో దీపావళి సందర్భంగా విక్రయాలు పెరిగేందుకు దోహదపడింది. కానీ, డిసెంబరులో ధరలు మళ్లీ ఎగబాకడంతో డిమాండ్ మళ్లీ డీలా పడింది. దాంతో డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గిరాకీ వార్షిక ప్రాతిపదికన 9 శాతం తగ్గింది" అని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా, సోమసుందరం పీఆర్ అన్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది 780.7 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నామని, 2022లో దిగుమతి చేసుకున్న 650.7 టన్నులతో పోలిస్తే 20 శాతం అధికమని ఆయన చెప్పారు.

ఈ ఏడాది డిమాండ్ 800-900 టన్నులు : దేశీయ ఆర్థిక వ్యవస్థలో సానుకూల పరిస్థితులతో పాటు ధరలు నిలకడగా కొనసాగితే ఈ ఏడాది బంగారం గిరాకీ మళ్లీ పుంజుకోవచ్చని సోమసుందరం అభిప్రాయపడ్డారు. 2024లో గోల్డ్ డిమాండ్ 800-900 టన్నుల స్థాయిలో నమోదుకావచ్చని ఆయన అంచనా వేశారు.

జీఎస్‌టీ @ 1.72 లక్షల కోట్లు

జనవరిలో 10.4 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: జనవరి నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,72,129 కోట్లుగా నమోదయ్యాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన వసూళ్లను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక శాఖ ఈ గణాంకాలు ప్రకటించింది. గత ఏడాది జనవరి 31వ తేదీ సాయంత్రం 5 గంటల సమయానికి వసూలైన రూ.1,55,922 కోట్లతో పోల్చితే 10.4 శాతం వృద్ధి నమోదయింది. జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత ఇది రెండో అత్యధిక వసూలని ఆర్థిక శాఖ తెలిపింది. అలాగే వసూళ్లు రూ.1.70 లక్షల కోట్లు దాటడం వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఇది మూడో సారి. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో స్థూల వసూళ్లలో 11.6 శాతం వృద్ధి నమోదయింది. గత ఏడాదితో పోల్చితే వసూలైన మొత్తం రూ.14.96 లక్షల కోట్ల నుంచి రూ.16.69 లక్షల కోట్లకు పెరిగింది. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఒక నెలలో గరిష్ఠ వసూలు 2023 ఏప్రిల్‌లో నమోదైన రూ.1.87 లక్షల కోట్లు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు షాక్

ఈ ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్ల స్వీకరణకు ఆర్‌బీఐ నో

» యూపీఐ, బిల్ పేమెంట్, నగదు బదిలీ సర్వీసులనూ నిలిపివేయాలని ఆదేశాలు



ముంబై: పేటీఎం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్‌కు (పీపీబీఎల్) ఆర్‌బీఐ గట్టి షాకిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 29 తర్వాత నుంచి బ్యాంక్ డిపాజిట్లు స్వీకరించకుండా ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతోపాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్‌లు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ బుధవారం ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, క్యాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమచేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ ట్రాన్సాక్షన్లు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది. బ్యాంక్ పద్దులపై సమగ్ర ఆడిటింగ్ రిపోర్టుతోపాటు నిబంధనల అమలుకు సంబంధించిన ఆడిటింగ్ రిపోర్టుల ఆధారంగా బ్యాంక్‌పై ఆర్‌బీఐ తాజా చర్యలు చేపట్టింది. నిరంతరం నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా పర్యవేక్షణ లోపాలున్నాయని నివేదికల్లో వెల్లడైందని ఆర్‌బీఐ పేర్కొంది. 2022 మార్చిలోనే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. ఆర్‌బీఐ తాజా ఆదేశాలు కేవలం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ అందించే సేవలకు మాత్రమే వర్తిస్తాయి. కాబట్టి, పేటీఎం యాప్ యూజర్లు యథావిధిగా తమ సేవలను వినియోగించుకోవచ్చు. పీపీబీఎల్ అకౌంట్ మినహాయిస్తే, మిగతా బ్యాంక్‌ల అకౌంట్లతో అనుసంధానం ద్వారా పేటీఎం యాప్ నుంచి యూపీఐ చెల్లింపులు జరుపవచ్చు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.2,351 కోట్లు

హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.486 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ రూ.103 కోట్ల ఏకీకృత లాభాన్ని నమోదు చేసింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,351 కోట్లకు పెరిగింది. గత క్యూ3లో రూ.1,922 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో తమ విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ వార్షిక ప్రాతిపదికన 16 శాతం పెరిగి 2.82 కోట్ల మందికి చేరుకుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ వెల్లడించింది.

విప్రోలో కొలువుల కోత

వందల మందిపై వేటు

బెంగళూరు: భారత్‌లోనూ కొలువుల కోత ఊపందుకుంది. ప్రముఖ ఐటీ కంపెనీ విప్రో ఇందుకు నాంది పలుకుతోంది. ఎంత మందిని తీసివేసేది కంపెనీ వెల్లడించకపోయినా, ఇది వందల సంఖ్యలోనే ఉంటుందని భావిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 2021లో కొనుగోలు చేసిన కన్సల్టెన్సీ సంస్థ కాప్కో ఉద్యోగులని సమాచారం. జనవరి నెల ప్రారంభంలోనే తీసివేసే ఉద్యోగులకు కంపెనీ సమాచారం పంపినట్టు తెలుస్తోంది.

లాభాల కోసమే!: టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ వంటి ప్రముఖ భారత ఐటీ కంపెనీలతో పోలిస్తే విప్రో లాభాల మార్జిన్లు తక్కువ. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలోనూ విప్రో లాభాల మార్జిన్లు 16 శాతం మించలేదు. దీనికి తోడు గత నాలుగు త్రైమాసికాలుగా కంపెనీ ఆదాయ వృద్ధిరేటు ఎదుగూ బొదుగు లేకుండా పేలవంగా ఉంది. దీంతో జీతాలు ఎక్కువగా ఉండే మిడ్ లెవల్ ఉద్యోగుల్లో ఎక్కువ మందిని ఇంటికి పంపించి లాభాలు పెంచుకోవాలని కంపెనీ భావిస్తున్నట్టు సమాచారం.

మొబైళ్లు మరింత చవక..!

ధరలు 3-5 శాతం తగ్గే అవకాశం

» విడిభాగాలపై దిగుమతి సుంకం 10 శాతానికి తగ్గింపు

న్యూఢిల్లీ: దేశంలో మొబైల్ ఫోన్ల ధరలు మరింత తగ్గనున్నాయి. మొబైల్ ఫోన్ల విడిభాగాల దిగుమతిపై సుంకాన్ని 15 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ప్రకటించింది. మొబైళ్ల తయారీకి అవసరమైన బ్యాటరీ కవర్, ఫోన్ల ఫ్రంట్, మిడిల్, బ్యాక్ కవర్స్, మెయిన్ లెన్స్, స్క్రూ, సిమ్ సాకెట్ ఇతర యాంత్రిక వస్తువులన్నీ ఈ పరిధిలోకి వస్తాయని తెలిపింది. అదనంగా, డిస్‌ప్లే అసెంబ్లింగ్ భాగాల పైనా సుంకాన్ని 10 శాతానికి తగ్గించారు. తద్వారా స్థానిక మార్కెట్లో ఫోన్ల ధరలు 3-5 శాతం మేర తగ్గవచ్చని పరిశ్రమ నిపుణులంటున్నారు. అంతే కాదు, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ, ఎగుమతులను పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. దేశంలో మొబైళ్ల తయారీ పరిశ్రమను మరింత బలోపేతం చేయనుందని.. సుంకం తగ్గింపు ఈ పరిశ్రమకు ప్రస్తుతం అవసరమైన నిశ్చయత్వాన్ని, స్పష్టతను కల్పించిందని టెలికాం మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు.

బిగ్ సీలో గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్ విడుదల



శాంసంగ్ కొత్తగా మార్కెట్లోకి తెచ్చిన అత్యాధునిక ఫీచర్లు గల గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్‌ను మొబైల్ రిటైలింగ్‌లోని బిగ్ సీలో బుధవారం విడుదల చేశారు. సినీ నటి మృణాళ్ ఠాకూర్ కంపెనీ సీఎండీ బాలు చౌదరి, డైరెక్టర్ వై స్వప్నకుమార్‌లతో కలిసి ఈ హ్యాండ్‌సెట్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేశారు.

మార్కెట్‌లో ప్రీబడ్జెట్ ర్యాలీ

సంపద రూ.4.58 లక్షల కోట్లు అప్

ముంబై: స్టాక్‌మార్కెట్లో బుధవారం ప్రీ బడ్జెట్ ర్యాలీ కనిపించింది. సెన్సెక్స్ 612.21 పాయింట్ల లాభంతో 71752.11 వద్ద, నిఫ్టీ 203.6 పాయింట్ల లాభంతో 21725.70 వద్ద ముగిశాయి. దీంతో బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.4.58 లక్షల కోట్లు పెరిగి రూ.379.78 లక్షల కోట్లకు చేరింది. బుధవారం నాటి ర్యాలీకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఎంతగానో దోహదం చేశాయి.

నోవా అగ్రిటెక్ లిస్టింగ్ అదుర్స్: ఇటీవల ఐపీఓకు వచ్చిన హైదరాబాద్ కంపెనీ నోవా అగ్రిటెక్ కంపెనీ షేర్లు బుధవారం లిస్టయ్యాయి. ఒక్కోటి రూ.41 ధరతో జారీ చేసిన ఈ కంపెనీ షేర్లు బీఎస్‌ఈలో 36.58 శాతం లాభంతో రూ.56 వద్ద లిస్టయ్యాయి. చివరికి 43.39 శాతం లాభంతో రూ.58.79 వద్ద ముగిశాయి.

మారుతి లాభం 33% వృద్ధి

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.33,513 కోట్ల ఆదాయంపై రూ.3207 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 15 శాతం, లాభం 33 శాతం పెరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం క్యూ3లో కంపెనీ రూ.29,251 కోట్ల ఆదాయంపై రూ.2406 కోట్ల లాభం ఆర్జించింది. ఇదే త్రైమాసికంలో కంపెనీ 8 శాతం వృద్ధితో 5,01,207 కార్లు విక్రయించింది. చిన్న కార్లకు డిమాండు తక్కువగానే ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్లో తాము 4,03,929 కార్లు విక్రయించామని, 71,785 కార్లు ఎగుమతి చేశామని కంపెనీ ప్రకటించింది. ఎగుమతులు ఇంతవరకు ఒక త్రైమాసికంలో అత్యధిక రికార్డు అని పేర్కొంది. ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో 9 నెలల కాలంలో అత్యధిక స్థూల, నికర అమ్మకాలు; అత్యధిక నికర లాభం రికార్డులను కూడా నమోదు చేసినట్టు తెలిపింది. 9 నెలల కాలంలో కంపెనీ 15,51,292 కార్లు విక్రయించిందని, దేశీయ మార్కెట్ అమ్మకాలు 13,46,965 ఉండగా ఎగుమతులు 2,04,327 యూనిట్లని వివరించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం ముందు ఏడాదితో పోల్చితే రూ.5576 కోట్ల నుంచి రూ.9,536 కోట్లకు పెరిగిందని వెల్లడించింది.

అమరరాజా లాభం రూ.239 కోట్లు

హైదరాబాద్: అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (గతంలో అమరరాజా బ్యాటరీస్) డిసెంబరు త్రైమాసికానికి రూ.239.64 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.222.81 కోట్ల లాభంతో పోలిస్తే 7 శాతానికి పైగా వృద్ధి నమోదు చేసుకుంది. మొత్తం ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.2,904.77 కోట్లకు చేరుకుంది.

మార్కెట్లోకి కొత్తగా రెండు బెంజ్ కార్లు

» కొత్త జీఎల్ఏ, ఏఎంజీ జీఎల్ఈ 53

» కాన్సెప్ట్ ఈక్యూజీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తాజాగా భారత మార్కెట్లోకి మరో రెండు కొత్త కార్లను అందుబాటులోకి తెచ్చింది. సరికొత్త జీఎల్ఏ ఎస్‌యూవీ మోడల్‌తోపాటు ఏఎంజీ జీఎల్ఈ 53 4 మ్యాటిక్ మోడళ్లను బుధవారం విడుదల చేసింది. కొత్త జీఎల్ఏ ధరల శ్రేణి రూ.50.5-56.9 లక్షల స్థాయిలో ఉండగా.. ఏఎంజీ జీఎల్ఈ 53 ప్రారంభ ధర రూ.1.85 కోట్లుగా ఉంది. 7,000 కాంబినేషన్లలో కస్టమైజ్ చేయగలిగే ఏఎంజీ జీఎల్ఈ 53 గరిష్ఠ రేటు రూ.2.2 కోట్లు. అంతేకాదు, జీ వ్యాగన్‌లో ఎలక్ట్రిక్ వెర్షన్ అయిన 'కాన్సెప్ట్ ఈక్యూజీ'ని సైతం కంపెనీ ఆవిష్కరించింది. ఈ ఏడాదిలోనే దీన్ని మార్కెట్లోకి తెస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,280 ▲	57,800 ▼	78,000 ▲
ముంబై	62,680 ▲	57,420 ▲	71,670 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ	
హైదరాబాద్	520
1 ఫిబ్రవరి	
చిత్తూరు	573
గోదావరి	525
విజయవాడ	525
విశాఖపట్నం	545
వరంగల్	522
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109
వరంగల్	109
కరీంనగర్	109
మహబూబ్‌నగర్	109
కర్నూలు	109
విశాఖపట్నం	110
గోదావరి	113
విజయవాడ	113
గుంటూరు	114
ఒంగోలు	114
చిత్తూరు	118

నేడు ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో గురువారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన 12 గంటలకు అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకుంటారు. ఆ తర్వాత 12.45కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం అసెంబ్లీలోని ఎల్‌వోపీ కార్యాలయానికి చేరుకుని అక్కడ బీఆర్ఎస్ శాసన సభాపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి 38 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరు కానున్నారు.

ఇక ఎన్నికల్లో పోటీ చేయను: మల్లారెడ్డి

శామీర్‌పేట, జనవరి 30: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలే తనకు చివరివని, భవిష్యత్తులో ఇక పోటీ చేయబోనని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్పష్టంచేశారు. రానున్న ఐదేళ్లలో మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల పరిధిలోని సీఎంఆర్ కన్వెన్షన్‌లో బుధవారం విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే తన బలగమని, కార్యకర్తలు కుటుంబమని అన్నారు. ప్రతి మునిసిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కష్టపడ్డానని గుర్తుచేశారు. తన సేవలను గుర్తించిన ప్రజలు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

జమ్మికుంటలో 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల రాజీనామా

జమ్మికుంట,జనవరి 31: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి భారీ షాక్ తగిలింది. జమ్మికుంట మున్సిపాలిటీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు గాంధీభవన్‌కు తరలి వెళ్లి లిఖిత పూర్వకంగా రాజీనామా చేశారు. బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గల కారణాలను ఓ వీడియో ద్వారా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కార్యాలయంలో చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం ఈ నెల 25న వీగిపోయిందని, ఐదు రోజులు గడుస్తున్నా ఆయన వైఖరిలో మాత్రం ఎటువంటి మార్పు రాలేదని విమర్శించారు. చైర్మన్‌ను కట్టడి చేసే సత్తా ఎమ్మెల్యేకు లేదని వివరించారు. అందుకోసమే తాము బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీల నియామకాలను అడ్డుకోవడం సరికాదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన ఆచార్య కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్‌ల నియామకాలకు బీఆర్ఎస్ ఆటంకాలు సృష్టించడాన్ని తెలంగాణ సమాజం హర్షించదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జేఏసీ సారథిగా ఉంటూ సకల జనులను ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మమేకం చేసిన కోదండరాంను ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకోవడం మంచిది కాదని బీఆర్ఎస్‌కు ఆయన సూచించారు. సీనియర్ జర్నలిస్టు అలీఖాన్ నియామకంలోనూ అడ్డుపడటం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. తక్షణమే బీఆర్ఎస్ నేతలు తమ కేసును ఉపసంహరించుకుని నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకాలకు సహకరించాలని కూనంనేని కోరారు.

141 మంది ఉద్యోగులు తిరిగి సచివాలయంలోకి

- ఏపీ నుంచి తిరిగి వచ్చినవారికి పోస్టింగులు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి తిరిగి వచ్చిన 498 మంది క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగుల్లో 141 మందిని తెలంగాణ సచివాలయంలోని వివిధ శాఖల్లో ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టింగులకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ కల్లెపు హరిత బుధవారం అయిదు జీవోలను జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని వివిధ శాఖల్లో పని చేసిన 498 మంది క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులను రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. వీరంతా తెలంగాణకు చెందినవారు కావడంతో ఉద్యోగ సంఘాల విజ్ఞప్తుల మేరకు వారిని తిరిగి ఇక్కడికి రప్పించారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఆ ఉద్యోగులను తెలంగాణ సచివాలయంలో నియమించకుండా వివిధ శాఖల విభాగాధిపతుల(హెచ్‌ఓడీ) కార్యాలయాల్లో పోస్టింగులిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీరిని తిరిగి సచివాలయంలోకి తీసుకోవాలని నిర్ణయించింది.

అభ్యర్థుల కొరత..అరకొరగా వైసీపీ ఐదో జాబితా

నలుగురు ఎంపీ, ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ అభ్యర్థుల కొరతతో సతమతమవుతోంది. దీంతో కేవలం ఏడుగురితోనే ఐదో జాబితాను బుధవారం రాత్రి విడుదల చేశారు. నాలుగు ఎంపీ స్థానాలకు, మూడు అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ఖరారుచేశారు. తిరుపతి (ఎస్సీ) లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో.. మళ్లీ అక్కడ ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తికే అవకాశమిచ్చారు. సత్యవేడు (ఎస్సీ) అసెంబ్లీ అభ్యర్థిగా నూకతోటి రాజేశ్‌ను ప్రకటించారు. కాకినాడ లోక్‌సభ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం పార్లమెంటుకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబును ఇన్‌చార్జులుగా ప్రకటించారు. సింహాద్రి చంద్రశేఖరరావును అవనిగడ్డ అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించారు. నెల్లూరు సిటీ స్థానంలో గెలుపు అవకాశాల్లేవని.. ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. ఇప్పటివరకు ఐదు విడతల్లో 61 మంది అసెంబ్లీ.. 14 మంది లోక్‌సభ ఇన్‌చార్జులను ప్రకటించారు. అరకులోయ అసెంబ్లీ స్థానానికి ఇప్పటికే అరకు (ఎస్టీ) ఎంపీ గొడ్డేటి మాధవిని అభ్యర్థిగా ప్రకటించగా.. బుధవారం ఆమెను మార్చి ఆర్.మత్స్యలింగానికి అవకాశమిచ్చారు. ఇంకోవైపు.. ఒంగోలు లోక్‌సభ స్థానం అభ్యర్థిగా ఇంకా ఎవరినీ తేల్చలేదు. ఆ స్థానంతో పాటు సంతనూతలపాడు, కందుకూరు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెవిరెడ్డిని ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించడం గమనార్హం. అలాగే గుంటూరు లోక్‌సభ సమన్వయ బాధ్యతలను విజయసాయిరెడ్డికి అదనంగా అప్పగించారు.

13 ఎంపీ సీట్లకు టీడీపీ- జనసేన అభ్యర్థులు ఖరారు

- 11 చోట్ల టీడీపీ.. రెండు చోట్ల జనసేన పోటీ..

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకుగాను 13 చోట్ల టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను ఖరారు చేసింది. బయటకు అధికారికంగా ప్రకటించకపోయినా అంతర్గతంగా వారి అభ్యర్థిత్వాలపై ఆ పార్టీల్లో స్పష్టత వచ్చినట్లు సమాచారం. వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలను దృష్టిలో ఉంచుకుని 2-3 సీట్లలో అభ్యర్థులను ఖరారు చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. అధికార పార్టీ వైసీపీ నుంచి బయటకు వచ్చిన ముగ్గురు సిటింగ్ ఎంపీలకు.. టీడీపీ తరఫున రఘురామకృష్ణంరాజు(నరసాపురం), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట).. వల్లభనేని బాలశౌరి (మచిలీపట్నం)కి టికెట్లు లభించనున్నాయి. మరో వైసీపీ ఎంపీకి కూడా టీడీపీ టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. 25 లోక్‌సభ స్థానాల్లో జనసేనకు ఎన్ని ఇస్తారో నిర్దిష్టంగా తేలకపోయినా.. ఇప్పటికి 13 సీట్లలో మచిలీపట్నం, కాకినాడ సీట్లు ఆ పార్టీకి దక్కాయి.

టీడీపీ, జనసేన ఎంపీ అభ్యర్థులు వీరే!

లోక్‌సభ స్థానం	అభ్యర్థి పేరు	పార్టీ
శ్రీకాకుళం	రామ్మోహన్‌నాయుడు	టీడీపీ
అనకాపల్లి	బైరి దిలీప్ చక్రవర్తి	టీడీపీ
విశాఖపట్నం	మెతుకుమల్లి భరత్	టీడీపీ
కాకినాడ	సాన సతీశ్‌కుమార్	జనసేన
నరసాపురం	రఘురామకృష్ణంరాజు	టీడీపీ
ఏలూరు	గోపాల్ యాదవ్	టీడీపీ
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)	టీడీపీ
మచిలీపట్నం	వల్లభనేని బాలశౌరి	జనసేన
నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవ రాయలు	టీడీపీ
తిరుపతి(ఎస్సీ)	అంగలకుర్తి నీహారిక	టీడీపీ
రాజంపేట	సుగవాసి బాలసుబ్రమణ్యం	టీడీపీ
హిందూపురం	బీకే పార్థసారథి	టీడీపీ
అనంతపురం	కాల్వ శ్రీనివాసులు	టీడీపీ



టీ సుబ్బరామిరెడ్డితో దీపాదాస్ మున్షీ భేటీ

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ టీ సుబ్బరామిరెడ్డితో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారు. సుబ్బరామిరెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశం మర్యాదపూర్వకంగా జరిగిందేనని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సోనియాను కలిసిన హరికోట్ల రవి

వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రిజిస్ట్రార్ హరికోట్ల రవి బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీని కలిశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్న ఆయన.. సోనియాను కలవడం చర్చనీయాంశంగా మారింది.



గ్రూప్-1పై దారెటు!

(మొదటి పేజీ తరువాయి)



టీజీపీని, కొంతమంది సభ్యులను నియమించిన సంగతి తెలిసిందే. దాంతో కమిషన్ తన పని మొదలు పెట్టింది. ప్రతీ రోజు సమావేశమవుతూ పోస్టుల భర్తీని ఎలా పూర్తి చేయాలన్న అంశంపై చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రూపు-1 పోస్టుల ఖాళీలను పంపించాలని తాజాగా ఆర్థిక శాఖ అధికారులు ఇతర శాఖలను సమాచారం అడిగారు. గతంలో నోటిఫికేషన్‌లో పేర్కొన్న వాటితో పాటు కొత్త పోస్టుల వివరాలు కూడా సేకరిస్తున్నారు. దాంతో గతంలోని పోస్టులకు అదనంగా మరికొన్ని నోటిఫికేషన్‌లో చేర్చే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే ప్రస్తుతం మధ్యలో ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలా నిర్వహిస్తారనే అంశంపై నిరుద్యోగుల్లో చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో 503 గ్రూపు-1 పోస్టుల భర్తీ కోసం ఏప్రిల్ 28, 2022న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టుల కోసం సుమారు 3.80 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. మొదటిసారి నిర్వహించిన పరీక్షను పేపర్ లీకేజీ కావడంతో రద్దు చేశారు. రెండోసారి పరీక్ష నిర్వహించి, తుది 'కీ' కూడా విడుదల చేశారు. అయితే కొంతమంది అభ్యర్థులు పరీక్ష నిర్వహణలో లోపాలు ఉన్నాయని, అధికారులు పొరపాట్లు చేశారని కోర్టులో కేసు వేశారు. ముఖ్యంగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు పరచలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ అనంతరం పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై టీఎస్‌పీఎస్సీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. కేసు విచారణకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. పాత కమిషన్ రాజీనామా చేసింది. కొత్త కమిషన్ ఏర్పడింది. గ్రూపు-1 పోస్టుల భర్తీలో ప్రభుత్వం అనుసరించబోయే విధానంపై అందరి దృష్టి ఉంది. ఒక ఆలోచన ప్రకారం... హైకోర్టు తీర్పు ప్రకారం గతంలో నిర్వహించిన పరీక్షను రద్దు చేయాలన్న ప్రతిపాదనను కమిషన్ పరిశీలిస్తోంది. దీనికి ముందుగా సుప్రీం కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. పోస్టుల సంఖ్య ఎలాగూ పెంచుతున్నందున అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. గతంలోని దరఖాస్తులను పరిగణిస్తూనే కొత్త అభ్యర్థుల కోసం మరోసారి దరఖాస్తులకు అవకాశం ఇచ్చే వీలుంది. అనంతరం పరీక్ష నిర్వహించడం ద్వారా భర్తీపై ముందుకెళ్లవచ్చు. మరో ప్రతిపాదన ఏమిటంటే.. సుప్రీం కోర్టు అనుమతితో ఇప్పటికే నిర్వహించిన పరీక్ష ఫలితాలు వెల్లడించడం! ఇలా చేసినా ఇప్పుడు కొత్తగా పెంచాలనుకుంటున్న పోస్టులను కూడా పాత నోటిఫికేషన్ ప్రకారమే భర్తీ చేయవచ్చు. అయితే కోర్టు కేసులో తీర్పు రావడానికి సమయం పట్టే అవకాశం ఉంది. దాంతో పరీక్ష రద్దు ప్రతిపాదనకే ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది. కాగా, గ్రూపు-1 పోస్టుల భర్తీలో భాగంగా ప్రిలిమినరీ, మెయిన్ అనే రెండు పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనపరిచే అభ్యర్థుల నుంచి ఒక్కో పోస్టుకు 50 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో మెరిట్ సాధిస్తే నేరుగా ఉద్యోగాలకు ఎంపికవుతారు. ఇందులో ఎలాంటి ఇంటర్వ్యూలు ఉండవు.

● ఇతర పోస్టుల భర్తీపై కూడా కమిషన్ దృష్టి పెట్టింది. సుమారు 8,039 గ్రూపు-4 పోస్టుల కోసం ఇప్పటికే పరీక్షలు నిర్వహించి, తుది కీ కూడా ప్రకటించారు. ఫలితాలు విడుదల చేయాల్సి ఉంది. మహిళా రిజర్వేషన్‌పై కోర్టులో కేసు కొనసాగుతోంది. తుది తీర్పు రాకపోవడంతో వీటి ఫలితాలపై సందిగ్ధత ఉంది.

● గ్రూపు-2 పోస్టులకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం జనవరి 6, 7 తేదీల్లో జరగాల్సి ఉంది. అప్పటికి కొత్త కమిషన్ ఏర్పాటు కాకపోవడంతో వాయిదా వేశారు. తాజాగా షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. మొత్తం 783 గ్రూపు-2 పోస్టుల భర్తీ కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదట నిర్ణయించిన ప్రకారం గత ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. పేపర్ లీకేజీ వ్యవహారం బయటపడడంతో వాయిదా వేశారు. తిరిగి నవంబరు 2, 3 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అభ్యర్థుల ఆందోళనతో వాయిదా వేశారు. జనవరిలో మరోసారి వాయిదా వేశారు.

● గ్రూపు-3 పోస్టుల పరీక్ష తేదీలు కూడా ప్రకటించాల్సి ఉంది. సుమారు 1,363 గ్రూపు-3 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 5.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు పరీక్షల తేదీలు ప్రకటించలేదు.

● గ్రూపు పోస్టులే కాకుండా ఇతర పోస్టుల విషయంలోనూ టీఎస్‌పీఎస్సీ అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా లైబ్రేరియన్లు (71), డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు (18), ఇంటర్మీడియట్ జూనియర్ లెక్చరర్లు (1392), అసిస్టెంట్ ఇంజనీర్లు (833), వెటర్నరీ సర్జన్లు (185), టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (175), ఉద్యాన అధికారులు (22), అకౌంట్స్ ఆఫీసర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, ఏఎంవీఐ, వ్యవసాయ అధికారుల వంటి పోస్టులకు పరీక్షలు పూర్తి చేశారు. వీటి ఫలితాలను ప్రకటించాల్సి ఉంది.

కేసీఆర్ పాలనలో పంచాయతీరాజ్ విధ్వంసం

- కేంద్రం నిధులను కేసీఆర్ సర్కారు దారి మళ్లించింది
- సర్పంచ్‌ల పదవీకాలాన్ని పొడిగించాలి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలో పంచాయతీరాజ్ వ్యవస్థ విధ్వంసమైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను దొడ్డిదారిన కేసీఆర్ సర్కార్ దారిమళ్లించిందని ఆరోపించారు. బుధవారంతో తెలంగాణలో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున ఎన్నికలు నిర్వహించేవరకు ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారులతో పాలనకు రేవంత్ సర్కారు ప్రణాళిక చేస్తోందని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. 73వ రాజ్యాంగ సవరణను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందని చెప్పారు. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. గ్రామసభలు పెట్టి ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పారని, సర్పంచ్‌లు లేకుంటే గ్రామసభలు నిర్వహిస్తారా? లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. సర్పంచ్‌లే లేకుంటే లబ్ధిదారుల ఎంపిక జరగదని, అప్పుడు పథకాలను అమలుచేయాల్సిన అవసరం ఉండదన్నారు. కాగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిస్థాయి కార్యాచరణతో ముందుకెళ్తామని, పకడ్బందీగా బీజేపీ ప్రచారం ఉండబోతోందని ఆయన చెప్పారు. గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఎండీ, అమెరికన్ బ్యాంకు మాజీ ఉద్యోగి సుధాకర్, వ్యాపారవేత్త వినోద్ రావు, సైంటిస్ట్ ఎల్లారెడ్డి.. కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

రాకూర్.. నోటీసులు నాక్కాదు కోమటిరెడ్డికి పంపండి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "పరువు నష్టం నోటీసులు నాకు పంపడం కాదు.. మీ పార్టీ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపండి ఠాకూర్" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. సిరిసిల్లలో తాను చేసిన ఆరోపణలకు తనపై పరువునష్టం దావా వేస్తానని కాంగ్రెస్ తెలంగాణ మాజీ ఇన్‌చార్జ్ మాణికం ఠాకూర్ అనడంపై కేటీఆర్ బుధవారం ఎక్స్(ట్విటర్)లో స్పందించారు. "మాణికం గారు.. మీరు ఎందుకు అయోమయంలో ఎందుకు ఉన్నారు.. నోటీసులను తప్పుడు అడ్రెస్‌కు పంపిస్తున్నారు. పీసీసీ అధ్యక్ష పదవి కోసం రేవంత్‌రెడ్డి మీకు రూ.50 కోట్లు లంచం ఇచ్చారని మీపార్టీ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో బహిరంగంగానే(ఆన్‌రికార్డ్) ఆరోపణలు చేశారు. ఆయన ఆ ఆరోపణలను ఇప్పటి దాకా వెనక్కి తీసుకోలేదు. వివరణ కూడా ఇవ్వలేదు. ఆయన చేసిన ఆరోపణలు నేను గుర్తు చేశాను. అలాంటప్పుడు మీరు పంపే నోటీసులు నా చిరునామాకు కాకుండా, సచివాలయంలో కూర్చున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్యాలయానికి పంపించండి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

చెప్పేది కొండంత.. చేసేది గోరంత

బీఆర్ఎస్ హయాంలోనే నర్సుల నోటిఫికేషన్

రేవంతే నియమించినట్టు సొంతడబ్బా:హరీశ్



హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల అందజేత పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డబ్బా కొట్టుకున్నారని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చెప్పేది కొండంత.. చేసేది గోరంత అన్నట్లుగా ఆయన తీరు ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే స్టాఫ్ నర్సుల నియామక నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దాన్ని కాంగ్రెస్ సర్కారు ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్న రేవంత్ తీరునే తాము తప్పుబడుతున్నామన్నారు. నర్సులుగా ఉద్యోగాలు పొందిన వారికి కూడా వాస్తవాలు తెలుసని అన్నారు. రేవంత్ ప్రసంగంలో గ్రూప్-1 నోటిఫికేషన్ గురించి ఒక్క మాటైనా మాట్లాడలేదని, నిరుద్యోగుల ఆశలపై ఆయన నీళ్లు చల్లారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని మరోసారి నిరూపించారని మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లలో 1.65 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 40 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్న మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. రోజూ అబద్ధాలు మాట్లాడే రేవంత్‌కు కాంగ్రెస్ అధిష్ఠానమైనా గడ్డి పెట్టాలని సూచించారు.

టీహబ్‌లో ఫ్రాన్స్ కాన్సులేట్ కార్యాలయం

- త్వరలో ప్రారంభించనున్న భారత్‌లోని ఫ్రాన్స్ అంబాసిడర్
- ఐటీ మంత్రి దుద్దిళ్లకు ఆహ్వానం
- సచివాలయంలో భేటీ అయిన ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్..
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరిన మంత్రి



సచివాలయంలో బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సులర్ జనరల్‌తో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): టీహబ్‌లో ఫ్రాన్స్ కాన్సులేట్ కార్యాలయం ఏర్పాటు కానుంది. త్వరలో దీనిని భారత్‌లోని ఫ్రాన్స్ అంబాసిడర్ ప్రారంభిస్తారని బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ థెయిరి బెర్తెలోట్ తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ఆయన బుధవారం సచివాలయంలో భేటీ అయ్యారు. కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనువైన వాతావరణం తదితర అంశాలను మంత్రి వివరించారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమ విశేషాలను పంచుకున్నారు. క్లస్టర్ల వారీగా ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఎస్‌బీ లాంటివి హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. 165 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయని, ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ మానవ వనరులు ఇచ్చే రాష్ట్రంగా తెలంగాణ ఉండబోతోందని మంత్రి వివరించారు. ఇటు ఫ్రాన్స్‌కు చెందిన టెలి పెర్ఫార్మెన్స్ ప్రతినిధులు కూడా మంత్రిని సచివాలయంలో కలిశారు. ఆ సంస్థ ఈ నెల 5-8 వరకు ఐటీసీ కోహినూర్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్య అతిథిగా రావాలని మంత్రిని ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా తమ సంస్థలో 90 వేల మంది ఉద్యోగులు, ప్రపంచవ్యాప్తంగా 95 దేశాల్లో 5 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని మంత్రికి తెలిపారు. త్వరలోనే హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాలుగా ఉన్న పలు జిల్లా కేంద్రాల్లోనూ తమ సంస్థ ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మమతా లంబ మంత్రికి వివరించారు. సంస్థ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం: సీఎం

శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ కన్సార్టియం ప్రతినిధులు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, వ్యాపార రంగాల్లో సాంకేతిక నిపుణుల తయారీకి కన్సార్టియం కీలక పాత్ర పోషించాలని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి వ్యాపార, ఇంజనీరింగ్ విభాగాల్లో పది వేల మంది గ్రాడ్యుయేట్లకు శిక్షణ ఇవ్వాలని కోరారు. బీఎస్ఎఫ్ఐ కన్సార్టియం ప్రతినిధి రమేశ్ రాజా మాట్లాడుతూ.. విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని సీఎంకు వివరించారు. త్వరలోనే ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ అధికారులు పాల్గొన్నారు.

పాలన చేతకాక మాపై నిందారోపణలు

- ఓటర్లను అవమానించేలా రేవంత్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలకు దిగుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, కోరుకంటి చందర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. మూసీలో వేసినట్లేనని రేవంత్ వ్యాఖ్యానించడం ఓటర్లను అవమానించడమేనన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయంటూ సీఎం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీని కేసీఆర్ ప్రశ్నించినంతగా ఎవరూ ప్రశ్నించలేదని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కష్టపడ్డ కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా రంగాలతో పోల్చడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమను గెలిపిస్తేనే.. హామీలను నెరవేరుస్తామని రేవంత్ వ్యాఖ్యానించడం ప్రజలను మోసం చేయడమేనని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. చెప్పులు మోసే వారిని కూడా ఎమ్మెల్సీలుగా కేసీఆర్ నామినేట్ చేశారన్న రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కె.సత్యరాయణ పేర్కొన్నారు. రేవంత్ వ్యాఖ్యలు ఎరుకల జాతినే అవమానపరిచేలా ఉన్నాయని ధ్వజమెత్తారు.

● అడ్డగోలు 'విద్యుత్తు' కొలువులు

ఒక్కో పోస్టుకు రూ.30 లక్షలు?

- దొడ్డిదారిలో చేరిన వారికి నెలకు రూ.లక్ష జీతం
- పథకం ప్రకారం తొలుత మేనేజ్‌మెంట్ ట్రైనీలు.. పాలక మండలిలో ఆమోదం
- తాజాగా వెలుగులోకి ఐదు కొలువుల బాగోతం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సంస్థల్లో దొడ్డిదారి నియామకాల బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అర్హతలు లేకున్నా.. కనీసం నియామక నోటిఫికేషన్లలో అర్హత సాధించని వారికి కూడా పెద్ద జీతాల కొలువులను కట్టబెట్టారు. ఇందుకోసం ఒక్కో పోస్టుకు రూ.30 లక్షల మేర వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. పరీక్షలు రాస్తే.. అర్హత సాధించలేని వారికి ఏకంగా నెలకు రూ.లక్ష వచ్చే కొలువులను కట్టబెట్టారు. ఇప్పటికే జెన్‌కోలో మాజీ సీఎం మేనల్లుడి భార్యకు కొలువును కట్టబెట్టిన విషయం వెలుగు చూసింది. తాజాగా మరో ఐదుగురిని ఇదేవిధంగా పెద్ద పోస్టుల్లో శాశ్వత ప్రాతిపదికన నియమించినట్లు తేలింది. 2018లో జెన్‌కోలో ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 12 మందిని మేనేజ్‌మెంట్ ట్రైనీ/స్టూడెంట్స్ ట్రైనీగా నియమించారు. కాంట్రాక్ట్ ఒప్పందంపై.. నెలకు రూ.20 వేల వేతనంతో నియామకాలు జరిపారు. ఇక్కడ అక్రమార్కులు జాబ్ పర్మినెంట్ పేరుతో వీరితో బేరసారాలకు దిగారనే ఆరోపణలున్నాయి. రూ.30 లక్షల దాకా డిమాండ్ చేయడంతో.. ఐదుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు మాత్రం అందుకు ఒప్పుకొన్నట్లు తెలిసింది. అంతే.. 2019 డిసెంబరు 10న జరిగిన జెన్‌కో 41వ పాలక మండలి సమావేశంలో వీరిని జెన్‌కోలో విలీనం చేసుకునే ప్రతిపాదనను లేవనెత్తారు. దానికి ఆమోదం లభించేలా చేశారు. దాంతో.. 2020 మార్చిలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(జేఏవో)గా వీరిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2022 మార్చికల్లా వీరు రెండేళ్ల ప్రొబేషనరీని పూర్తిచేసుకోవడంతో.. ఆ కొలువులు పర్మినెంట్ అయ్యాయి. నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలను నిర్వహిస్తే.. కనీసం అర్హత సాధించలేని వారికి శాశ్వత ఉద్యోగాలు దక్కడం జెన్‌కోలో చర్చనీయాంశంగా మారింది. గత నోటిఫికేషన్లలో జరిగిన పరీక్షలో వీరంతా అనర్హులైనట్లు సమాచారం. నిజానికి ఎంటెక్, బీటెక్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యను అభ్యసించిన వారికీ విద్యుత్తు సంస్థల్లో ఆర్టిజన్లుగా నియమించుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. అర్హతలే లేనివారికి పెద్ద జీతాల కొలువులు కట్టబెట్టడం గమనార్హం. కాగా వరుస ఆరోపణల నేపథ్యంలో జెన్‌కో డైరెక్టర్(హెచ్ఆర్) తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ

'మునిసిపల్' అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో
జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లలో అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. అవిశ్వాసాలను అడ్డుకోవాలని కోరుతూ పలువురు మున్సిపల్ ఛైర్ పర్సన్లు, ఛైర్మన్లు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది. తమపై కౌన్సిలర్లు చేపట్టిన అవిశ్వాస తీర్మానాలను ఆయా జిల్లాల కలెక్టర్ స్వీకరించడం.. అవిశ్వాస ప్రక్రియను ప్రారంభించడాన్ని ఆపాలని కోరుతూ వి.ప్రణీత (మేడ్చల్ జిల్లా-దమ్మాయిగూడ ఛైర్‌పర్సన్), పిల్లోడి జయమ్మ (సంగారెడ్డి జిల్లా-సదాశివపేట్ ఛైర్‌పర్సన్), పోకల జమున(జనగామ జిల్లా-జనగామ ఛైర్‌పర్సన్), మేకల కావ్య (మేయర్, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్), గూడెం మల్లయ్య (సంగారెడ్డి జిల్లా-అందోల్ జోగిపేట్ ఛైర్మన్), వి.శంకరయ్య(యాదాద్రి జిల్లా ఆలేరు ఛైర్మన్) హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ధర్మాసనం ఆ పిటిషన్లను కొట్టేసింది. సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ పిటిషనర్లు డివిజన్ బెంచ్ వద్ద అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నూతన మున్సిపల్ చట్టం-2019లో అవిశ్వాస తీర్మానం ఆమోదించడానికి తగిన విధానం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. నిబంధనలు రూపొందించేదాకా అవిశ్వాస తీర్మానాలను ఆపాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. అవిశ్వాస ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ అప్పీళ్లను డిస్మిస్ చేసింది.

పంచాయతీల్లో ప్రత్యేక పాలనపై స్టే ఇవ్వలేం

» రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు హై కోర్టు నోటీసులు

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలనపై రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేస్తూ బుధవారం విచారణ వాయిదా వేసింది. గ్రామ పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని.. ఎన్నికలు జరిగే వరకు పాలనను తమకే అప్పగించాలని, ప్రత్యేక అధికారుల నియామకంపై స్టే ఇవ్వాలని కోరుతూ జనగామ జిల్లా కాంచనపల్లి, చెంగెర్ల, నిర్మల్ జిల్లా తల్వాడ, కరీంనగర్ జిల్లా నిజాయతీగూడెం సర్పంచులు విజయ, వేణుగోపాల్, అనిల్‌కుమార్, మురళీధర్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జనవరి 31వ తేదీతో తమ పదవీ కాలం ముగియనుందని అందులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.శరత్ ధర్మాసనం.. స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ పిటిషన్లలో ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి, జనగామ, నిర్మల్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతోపాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

నేటితో సర్పంచుల పదవీకాలం పూర్తి

» రేపటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సర్పంచుల పదవీ కాలం గురువారంతో పూర్తికానుంది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేని కారణంగా.. గ్రామ పాలన బాధ్యతలను ప్రత్యేకాధికారులు చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. మండల కేంద్రాలకు చెందిన పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారిని, మేజర్ గ్రామ పంచాయతీలకు తహశీల్దార్లు, అధిక జనాభా గల ఇతర గ్రామాలకు ఎంపీడీవోలు, తక్కువ జనాభా ఉన్న వాటికి పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల్లోని సీనియర్ అసిస్టెంట్, ఆ పైస్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా గ్రామాలకు అధికారులను నియమించారు. ఇప్పటివరకు సర్పంచులు, ఉప సర్పంచులకు జాయింట్ చెక్‌పవర్ ఉండగా, ఇకపై ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక పాలన కొనసాగిస్తున్న కారణంగా మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ నెల 3న వీడియోకాన్ఫరెన్సు నిర్వహించనున్నారు.

ఉచిత బస్సు అంశం..రిట్ పిటిషన్‌గా స్వీకరణ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్‌ను) రిట్ పిటిషన్‌గా మార్చాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఈ పథకం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నది పిటిషనర్ వాదన అని.. అందులో ప్రజాప్రయోజనం ఏమీ లేదని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం పేర్కొంది. గత ఏడాది డిసెంబరు 8న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 47ను కొట్టివేయాలని కోరుతూ నాగోల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి హరేందర్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు ఇది విరుద్ధమని తెలిపారు.త్వరలో ఈ పిటిషన్ సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానుంది.

ఎంపీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ బుధవారం గాంధీభవన్‌లో ప్రారంభమైంది. తొలి రోజున నాలుగు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం ఏడు దరఖాస్తులు అందాయి. నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి, చారుగొండ వెంకటేష్ దరఖాస్తు చేసుకున్నారు. భువనగిరి నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత, తీన్మార్ మల్లన్న దరఖాస్తులు సమర్పించారు. మల్కాజ్‌గిరి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ కపిలవాయి దిలీప్‌కుమార్, మహబూబాబాద్ సీటును ఆశిస్తూ చందా లింగయ్యదొర దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 3 సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది.

డిస్కమ్‌ల్లో డైరెక్టర్ల భర్తీకి నోటిఫికేషన్

» రెండు పంపిణీ సంస్థల్లో మొత్తం 8 పోస్టులు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఇప్పటి దాకా పనిచేసిన డైరెక్టర్లను తొలగించడంతో ఆ స్థానంలో కొత్త డైరెక్టర్ల నియామకానికి డిస్కమ్‌లు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశాయి. దక్షిణ డిస్కమ్‌లో నాలుగు, ఉత్తర డిస్కమ్‌లో నాలుగు డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇప్పటిదాకా దక్షిణ డిస్కమ్‌లో ఏడుగురు డైరెక్టర్లు ఉండగా... తాజాగా నాలుగు పోస్టులే భర్తీచేయాలని నిర్ణయించడం గమనార్హం. పూర్తిచేసిన దరఖాస్తులను మార్చి 1వ తేదీలోపు పంపించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

పామాయిల్ సాగుదారులకు అండగా ఉంటాం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా సాగుదారులకు ప్రోత్సాహకాలు అందించి అండగా ఉంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు. ఆయిల్ పామ్ సాగు పథకం అమలుపై ఆయన బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దేశంలో వంటనూనెల ఉత్పత్తి 123 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా వినియోగం మాత్రం 250 లక్షల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. వంటనూనెల కొరతను అధిగమించేందుకు పామాయిల్ సాగును విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు డిజిటల్ ప్రశ్నపత్రాలు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల్లో డిజిటల్ ప్రశ్నపత్రాలను ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు పరీక్షల విభాగం కంట్రోలర్ జయప్రద బాయి బుధవారం మీడియాకు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎగ్జామ్ అధికారులుగా వెళ్లే వారు డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదుచేయాలని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీనివాసరావు బదిలీ

ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయనను తొమ్మిదేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై మండలి కార్యదర్శిగా నియమించారు. తాజాగా ఆయనను నార్కట్‌పల్లి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా బదిలీచేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆమెకు అండగా సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ఒకరు ఆమె స్టాల్‌ను సందర్శిస్తారని వెల్లడించారు. తన సమస్యపై ముఖ్యమంత్రి స్పందించడం పట్ల కుమారి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సీఎం ఆదేశాల అనంతరం తన హోటల్ వద్దకు చేరుకున్న ఆమె.. మళ్లీ హోటల్ పెడతామని అనుకోలేదంటూ భావోద్వేగానికి గురైయ్యారు. తన సమస్యను పరిష్కరించిన సీఎంకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి తన హోటల్‌కు వస్తే ఆయనకు నచ్చిన వంట చేసి పెడతానని సంతోషంగా చెప్పారు.

ఇదీ నేపథ్యం..

హైదరాబాద్‌లోని రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, ఐటీసీ కోహినూర్ హోటల్ పక్కనున్న రోడ్డులో కుమారి కొంతకాలంగా ఫుడ్ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. ఆమె వద్ద భోజనం బాగుందంటూ పలువురు యూట్యూబర్లు వీడియోలు తీసి పెట్టడంతో కొద్ది రోజులుగా భోజన ప్రియులు అక్కడికి బారులు తీరుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం వస్తున్నారు. అలా వస్తున్నవారందరి వాహనాలతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని.. కాబట్టి ఫుడ్ పాయింట్‌ను వేరే చోటుకు మార్చాలని పోలీసులు మంగళవారం ఆదేశించారు. తనకు వార్నింగ్ ఇచ్చిన పోలీసులు హోటల్ వాహనాన్ని కూడా తీసుకెళ్లారని కుమారి తెలిపింది. పోలీసుల ఆదేశాల నేపథ్యంలో బుధవారం ఆమె హోటల్ తెరవలేదు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం స్పందించి ఆమెకు అభయమిచ్చారు. అయితే.. ఈ మొత్తం వ్యవహారంతో ఎలాంటి సంబంధమూ లేని వైసీపీ రంగంలోకి దిగి వికృత ప్రచారానికి తెరతీయడంతో ఈ అంశం రాజకీయ రంగు పులుముకొంది. గతంలో కుమారి ఒక యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూనే వారి జోక్యానికి కారణం. తనకు ఏపీలోని పెద్దఎరికపాడులో జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క ఇల్లు తప్ప ఇంకే ఆస్తులూ లేవని ఆ ఇంటర్వ్యూలో కుమారి చెప్పిన క్లిప్‌ను వైసీపీ వైరల్ చేసింది. జగన్ తనకు ఇల్లు ఇచ్చినట్టు ఆమె చెప్పడాన్ని తట్టుకోలేక.. చంద్రబాబు ఆమెను టార్గెట్ చేశారని, తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలను పురమాయించి కుమారి హోటల్ తొలగింపునకు కారణమయ్యారని అబద్ధపు ప్రచారాన్ని చేసింది. జగన్ పేరును తలుచుకున్నవారిని చూసినా ప్రతిపక్ష నేతలు భయపడుతున్నారంటూ దుష్ప్రచారానికి దిగింది. కుమారికి రేవంత్ అభయం ఇవ్వగానే.. తమ ప్రచారాన్ని మార్చేసింది. హోటల్ తొలగింపును తాము తప్పుపట్టడంతో తెలంగాణ సర్కారు అప్రమత్తమైందని, ఇదంతా జగన్ ఘనతే అన్నట్టుగా ప్రచారం చేసింది. అయితే.. తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీకే ఓటు వేశానని కుమారి ఒక యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం వైరల్‌గా మారింది.

15,000 పోలీస్ ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

అందించే కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గత ప్రభుత్వం వారి కుటుంబసభ్యుల ఉద్యోగాల గురించే ఆలోచించింది. 2019 ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె కవితను అక్కడి ప్రజలు ఓడిస్తే.. ఉద్యోగంలేని కవితకు కేసీఆర్ వెంటనే ఎమ్మెల్సీ ఉద్యోగమిచ్చారు. అంతే తప్ప.. మీ నర్స్ ఉద్యోగాల గురించి ఏమాత్రం ఆలోచించలేదు" అని రేవంత్ విమర్శించారు. నిత్యం కొడుకు, కూతురు, మేనల్లుడి ఉద్యోగాల గురించే కేసీఆర్ ఆలోచించేవారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6,956 మంది నర్సులకు ఉద్యోగాలిస్తే కనీసం వారిని ఆశీర్వదించాలన్న సోయి కూడా కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా దండగేనన్నారు. కేసీఆర్ అల్లుడు హరీశ్‌రావు ఎన్ని ఉద్యోగాలిచ్చారంటూ అడుగుతున్నారని, ఇచ్చే ఉద్యోగాలు కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. నర్సులకు ఉద్యోగాలిస్తుంటే ఎందుకిస్తున్నారని హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని, ఆయనకు గడ్డి పెట్టాలని వ్యాఖ్యానించారు. ఉద్యోగాలిచ్చే తమ ప్రభుత్వంపై హరీశ్‌రావు శాపనార్థాలు పెడుతున్నారని, ఆయన వంకరబుద్ధి ఎలా ఉందో అందరూ గమనించాలని అన్నారు. ఫాంహౌస్‌లో పడుకుని ఇంతమంది నర్సులకు ఉద్యోగాలిస్తున్న ఆనందాన్ని చూసి కుళ్లకున్నా, ఏడ్చినా, పెడబొబ్బలు పెట్టినా తమకేం కాదని పరోక్షంగా కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

ఆ సంతోషం కనిపించాలనే..

డిసెంబరు 7న తమ ప్రభుత్వం ఏర్పడగానే ఎల్బీ స్టేడియంలోనే ప్రమాణం చేశామని, ఆ రోజు తాము, తమ కుటుంబ సభ్యులంతా ఎంతో సంతోషంగా ఉన్నామని సీఎం రేవంత్ తెలిపారు. అదే సంతోషం కొత్తగా నియమితులైన నర్సులు, వారి కుటుంబ సభ్యుల్లోనూ కనిపించాలనే ఉద్దేశంతోనే ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. తమకు మంత్రులు, సీఎంగా ఉద్యోగాలు రాగానే ఊరికే కూర్చోలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాల



కల్పన గురించి ఆలోచించామని అన్నారు. నిరుద్యోగుల కళ్లలో ఆనందాన్ని చూసేందుకు రోజుకు 16, 17 గంటలపాటు కష్టపడుతున్నామని చెప్పారు. రాష్ట్ర విభజనకు ముందు ఉద్యోగాల కోసం వేలాదిమంది పోరాటం చేసి అమరులయ్యారని గుర్తు చేశారు. తీరా తెలంగాణ ఏర్పడ్డ తర్వాత గత సర్కారు పదేళ్లపాటు ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేసిందని ఆరోపించారు. "మీ ఉద్యోగాల గురించి గత ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం వల్లే... మీరంతా కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల ఉద్యోగాలను ఊడగొట్టారు. ఆరోగ్య తెలంగాణ సాధనకు నర్సులు కృషి చేయాలి. రోగులకు డాటర్స్ మీరే.. డాక్టర్స్ మీరే" అని రేవంత్ అన్నారు. కొత్తగా నియమితులైన స్టాఫ్ నర్సులకు అభినందనలు తెలిపారు.

నిరుద్యోగుల కలల్ని నిజం చేస్తున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నిరుద్యోగుల కలల్ని నిజం చేసేందుకు తొలి అడుగులో భాగంగా నర్సులకు ఉద్యోగాలిచ్చిందని తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్యశాఖలో మరో 5వేల ఉద్యోగాల భర్తీకి అధికార యంత్రాగమంతా కసరత్తు చేస్తోందన్నారు. అంతకుముందు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పసిపాప నుంచి చివరిశ్వాస వరకు వెంటే ఉండి సేవలందించేది నర్సులేనన్నారు. ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ చేస్తామని ప్రకటించారు. కొత్తగా నియమితులైన స్టాఫ్‌నర్సులలో 88శాతం మహిళలేనని, అందులోనూ 84 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని తెలిపారు. గతంలో మాదిరిగా లీకులు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వేదికపై వివిధ జిల్లాలకు చెందిన 18 మందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా నియమితులైన నర్సులతో నర్సింగ్ డైరెక్టర్ విద్యుల్లత వేదికపైనుంచే ప్రమాణం చేయించారు. కాగా, వారంతా తమ నియామక పత్రాలను తీసుకునేందుకు స్టేడియం ప్రాంగణంలో 74 స్టాల్స్‌ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి వరకు అందరికీ అపాయింట్‌మెంట్ లెటర్స్ అందేలా చర్యలు తీసుకున్నారు.

రాజన్న ఆలయాభివృద్ధికి రూ.20 కోట్లు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గతంలో హెచ్‌ఎండీఏ సాఫ్ట్‌లోన్ ద్వారా మంజూరై నిలిచిపోయిన రూ.20 కోట్లను విడుదల చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. మూలవాగు బ్రిడ్జి నిర్మాణం, అక్కడి నుంచి 800మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. వీటి కోసం అవసరమైన రూ.35 కోట్ల నిధులను త్వరలో విడుదల చేయాలన్నారు. బుధవారం వీటీడీఏ అధికారులతో హైదరాబాద్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. దేవస్థానం అభివృద్ధి నమూనాను, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ చేపడుతున్న పనులను వీటీడీఏ వైస్‌ఛైర్మన్ అనురాగ్ జయంతి వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహం ఏర్పాటు, పార్కు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. గుడిచెరువులోకి మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని, కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

3 వేలకు పైగా ఖాళీల భర్తీకి
ఆర్టీసీ కసరత్తు!

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 3 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేసేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈ యేడు కొత్తగా 2,375కు పైగా బస్సులను సమకూర్చుకునేందుకు సన్నాహాలు ప్రారంభించిన ఆర్టీసీ.. అదేస్థాయిలో 2 వేలకు పైగా డ్రైవర్, మరో వేయికి పైగా కండక్టర్ పోస్టులతో పాటు 200కు పైగా సూపర్‌వైజర్ స్థాయి పోస్టుల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫిబ్రవరి మూడో వారంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే ఆయా పోస్టులకు నోటిఫికేషన్ వెలువడే అవకాశమున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే పలు ప్రధాన మార్గాల్లో కొత్త సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ ఏడాది 1,325 డీజిల్ బస్సులతో పాటు మరో 1,050కి పైగా ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి సమకూర్చాలని అధికారులు ఆయా బస్సు ఉత్పత్తి సంస్థలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. నెలనెలా 100 నుంచి 200 వరకు దశల వారీగా కొత్త బస్సులు ఆయా డిపోలకు చేరనున్నాయి. కొత్త బస్సులు వచ్చే నాటికి ఆయా డిపోల్లో డ్రైవర్, కండక్టర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం కారుణ్య నియామకాల కింద 813 పోస్టుల భర్తీ జరుగుతోంది. కాగా, ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2009-10లో ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ఖాళీను భర్తీ చేసింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయలేకపోయింది. ఇప్పుడు 14 ఏళ్లకు మళ్లీ కాంగ్రెస్ సర్కారు పోస్టులను భర్తీ చేయబోతోంది.

మాజీ సీఎస్ సోమేశ్‌కు
రూ.లక్షల్లో రైతుబంధు

» సాగుకు పనికిరాని భూమికి మంజూరు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ భూవ్యవహారం చర్చనీయాంశంగా మారింది. రంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో తన భార్య పేరుతో కొనుగోలు చేసిన 25 ఎకరాల 19 గుంటల భూమి పూర్తిగా గుట్టలు, రాళ్లతో నిండి ఉంటుంది. సాగుకు అనుకూలంగా లేకపోయినా రైతు బంధు కింద రూ.14లక్షల సాయం ఆయన ఖాతాల్లో పడటం గమనార్హం.

విద్యా శాఖకు
రూ.25వేల కోట్లివ్వండి

» పాఠశాలల్లో సదుపాయాలకు 4వేల కోట్లు

» విద్యా శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు

» ఖమ్మం, ఆదిలాబాద్‌లో వర్సిటీలు: భట్టి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొత్త బడ్జెట్‌లో తమకు రూ.25 వేల కోట్లను కేటాయించాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రతిపాదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ దేవసేన, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా శాఖ పథకాలు, మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధుల గురించి బుర్రా వెంకటేశం వివరించారు. ఈసారి మొత్తం రూ.25వేల కోట్ల వరకు కేటాయించాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులకంటే ఇది రూ.6000 కోట్లు ఎక్కువ. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్న సంగతి తెలిసిందే. అందుకు మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని, వీటికి రూ.4000కోట్లను కేటాయించాలని విద్యాశాఖ కోరింది. అలాగే, యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.600కోట్లు కేటాయించాలని కోరింది. ప్రతి మండల కేంద్రంలోని పాఠశాలను మరింత ఉన్నతీకరించాలని యోచిస్తోంది. వీటికి అదనపు భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.5000 కోట్లు అవసరమవుతాయని సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిసింది.

విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించామన్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో యూనివర్సిటీలు లేనందున.. ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు నుంచి వర్సిటీల దాకా ఫీజుల నియంత్రణకు ముసాయిదాను సిద్ధం చేయాలన్నారు.

3 నెలల్లోగా ట్రాఫిక్ హోంగార్డుల భర్తీ

» ఆలోగా ఇతర విభాగాల వారిని రప్పించి సేవలు వినియోగించుకోండి

» రద్దీ సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసులనూ ఉపయోగించుకోండి

» ట్రాఫిక్ నిర్వహణపై సమగ్ర ప్రణాళిక రూపొందించండి: రేవంత్



ట్రాఫిక్ నిర్వహణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో సీఎస్, డీజీపీ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రేటర్ సిటీ ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నిపుణులైన కన్సల్టెన్సీలకు బాధ్యత అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయించాలన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేరని చర్చకు వచ్చింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ట్రాఫిక్‌కు అవసరమైన మేర హోంగార్డుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తిచేయాలని, వారికి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. అయితే ఈ నియామకాలు పూర్తయ్యేలోపు.. ఇతర విభాగాల్లో పనిచేస్తున్న హోంగార్డులను ట్రాఫిక్ విభాగానికి రప్పించి, వారి సేవలను వినియోగించుకోవాలని నిర్దేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో (పీక్ అవర్స్‌లో) గ్రేటర్ సిటీ ట్రాఫిక్ కంట్రోల్ విధులకు లా అండ్ ఆర్డర్ పోలీసులను కూడా వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల స్థాయిని అప్‌గ్రేడ్ చేయాలని, సరిపడ సంఖ్యలో సిబ్బంది నియామకాలు చేపడుతామని చెప్పారు. నగరంలో రహదారులు, జంక్షన్ల విస్తరణపై దృష్టి పెట్టాలని, రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లలో ఎల్బీనగర్ జంక్షన్ తరహాలో సబ్‌వే, అండర్‌పాస్, సర్వీస్ వేలను ఎక్కడెక్కడ నిర్మించాలి, అందుకు ఆయా ప్రాంతాల్లో ఉన్న సాధ్యాసాధ్యాలేంటన్నది గుర్తించాలని అన్నారు. నిర్మాణాలను చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సిటీ పరిధిలో అన్ని జంక్షన్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కేవలం ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థపై ఆధారపడకుండా ట్రాఫిక్ సిబ్బంది అక్కడ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టూ వీలర్ ట్రాఫిక్ ఇంటర్‌సెప్టర్స్‌పై ఎస్ఐలు, కానిస్టేబుళ్లను పంపించి ట్రాఫిక్ జామ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోలీస్, మునిసిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి..

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులు, మునిసిపల్ జోనల్ కమిషనర్లు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నెలకోసారి సమావేశమై ట్రాఫిక్ ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించాలన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యను అధిగమిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని సమావేశంలో చర్చకు వచ్చింది. అందుకు పరిష్కారంగా వీలైనన్ని చోట్ల మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సెంటర్ల నిర్మాణాలను ప్రోత్సహించాలని, పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వ పరంగా రాయితీలు ఇవ్వాలని సీఎం సూచించారు. అందుకు అవసరమైన ప్రత్యేక పార్కింగ్ పాలసీని రూపొందించాలన్నారు. అంతేకాకుండా.. హైదరాబాద్‌లో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చేటపుడు ఆ ప్రాంతంలో ఉండే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకోవాలని ఆదేశించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో లే అవుట్లకు అనుమతులు ఇచ్చేటపుడు ఆయా ప్రాంతంలో రోడ్లు, పార్కులు, మౌలిక వసతులకు ఎంత స్థలం కేటాయించాలనే ప్రమాణాలను పునఃపరిశీలించాలన్నారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత వాహనాల్లో టాప్ 2లో గ్రేటర్ సిటీ..

సమీక్ష సందర్భంగా పోలీసు అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్ వివరాలను తెలిపారు. దీని ప్రకారం.. వ్యక్తిగత వాహనాల్లో హైదరాబాద్ నగరం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో ఉన్న బెంగళూరులో ప్రతి 1000 మందికి 827 వాహనాలుంటే.. హైదరాబాద్‌లో 800 ఉన్నాయి. ఢిల్లీలో 521 చొప్పున ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ ఏరియా 650 చదరపు కిలోమీటర్లలో ఉండగా.. ఇందులో 9వేల కిలోమీటర్ల మేర రహదారులున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కోటి జనాభా ఉందని, అందులో దాదాపు 80 లక్షల మందికి వాహనాలున్నాయని వివరించారు. నగరంలో 282 ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రతి వెయ్యి మంది ప్రయాణికులకు 30 బస్సులు అందుబాటులో ఉన్నాయని, కనీసం 60 బస్సులైనా ఉంటే.. మంచి ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్లవుతుందని తెలిపారు.

పన్ను ఆదాయం రూ. 99,693 కోట్లు

» డిసెంబరు నాటికి 65.37 శాతం వసూలు

» మొత్తం ఆదాయం రూ.1.25 లక్షల కోట్లు

» వ్యయం రూ.1.56 లక్షల కోట్లు: కాగ్ నివేదిక

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పన్ను ఆదాయం డిసెంబరు నాటికి రూ.99,693 కోట్లు లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి పన్నుల రూపంలో రూ.1,52,499 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఇందులో గత నెలాఖరుకు 65.37 శాతం వచ్చింది. అన్ని రకాల ఆదాయం కలిపి రూ.2,16,566 కోట్లు వస్తుందని అంచనా వేయగా రూ.1,25,002 కోట్లు (57.72 శాతం) సమకూరింది. ఈ మేరకు 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' బుధవారం నివేదిక విడుదల చేసింది. ఒక్క డిసెంబరులోనే రూ.12,609 కోట్ల పన్నుల వసూళ్లు నమోదయ్యాయి. ఒక రకంగా పన్నులే రాష్ట్రానికి ఊరటనిస్తున్నట్లు విశదమవుతోంది. ఈ పన్నుల్లో జీఎస్టీ కింద రూ.34,147 కోట్లు (67.03%), స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కింద రూ.10,654 కోట్లు (57.59%), సేల్స్ ట్యాక్స్ కింద రూ.22,251 కోట్లు (56.33%), స్టేట్ ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.16,500 కోట్లు (82.98%), కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.10,253 కోట్లు (70.57%), ఇతర పన్నులు, సుంకాల కింద 5,885 కోట్లు (64.45%) సమకూరాయి. పన్నేతర రాబడుల కింద రూ.20,331 కోట్లు (89.14%), కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.4,978 కోట్లు (12.07%) వచ్చాయి. ఈసారి మూలధన రాబడుల కింద రూ.43,294 కోట్లు వస్తాయని అంచనా వేయగా డిసెంబరు నాటికి రూ.36,562 కోట్లు (84.45%) వచ్చాయి. ఇందులో అప్పులే రూ.36,536 కోట్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.38,234.94 కోట్లను నికరంగా అప్పులు తీసుకోవాలని అంచనా వేయగా డిసెంబరు నాటికి రూ.36,536.01 కోట్లు తీసుకున్నట్లు కాగ్ రిపోర్టు స్పష్టం చేసింది. అంటే ఆర్థిక సంవత్సరంలో మూలధన, రెవెన్యూ రాబడుల కింద రూ.2,59,861.91 కోట్లను అంచనా వేయగా డిసెంబరు నాటికి రూ.1,61,565.61 కోట్లు (62.17%) సమకూరినట్లయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.2,49,209.93 కోట్లు ఉంటుందని అంచనా వేయగా డిసెంబరు నాటికి రూ.1,56,078.61 కోట్లు (62.63%) వ్యయమైనట్లు నివేదిక వెల్లడించింది. ఇందులో పథకాలకు రూ.59,134 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.16,998 కోట్లు, వేతనాలు, భత్యాలకు రూ.29,377 కోట్లు, పెన్షన్లకు రూ.12,489 కోట్లు, సబ్సిడీలకు రూ.6,679 కోట్లు వ్యయమైనట్లు వివరించింది.

ఎట్టకేలకు పదవీ విరమణ చేసిన
జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో సుదీర్ఘ కాలం నుంచి రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ ఎట్టకేలకు బుధవారం పదవీ విరమణ చేశారు. ఆయన ఆ పదవిలో మూడున్నరేళ్లుగా కొనసాగుతున్నారు. పదవీ విరమణ తేదీ సమీపించినప్పటికీ మరో మూడు నెలల పాటు తానే రిజిస్ట్రార్‌గా కొనసాగుతానని పేర్కొంటూ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆపివేయించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తున్నాయంటూ చివరి నిమిషం వరకు చెప్పుకొచ్చారు. అయితే రిజిస్ట్రార్‌గా మంజూర్ హుస్సేన్ కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సంకేతాలు రాకపోవడంతో ఆయన్ను బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా పరీక్షల విభాగం డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్‌రావును నియమించారు. అలాగే ఆరున్నరేళ్లుగా రెక్టార్ పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసర్ గోవర్ధన్‌కు ఎట్టకేలకు స్థానచలనం కల్పించారు. ఆయన్ను ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా వీసీ ఆదేశించారు.

రాష్ట్ర అకౌంటెంట్ జనరల్‌గా పి.మాధవి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అకౌంటెంట్ జనరల్(ఏజీ)గా బదిలీపై వచ్చిన పి.మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2001 'ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్ సర్వీసెస్(ఐఏ అండ్ ఏఎస్)' బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ స్థాయి హోదాలో ఉన్నారు. తమిళనాడులోని చెన్నైలో ఆడిట్(సెంట్రల్) ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పని చేసిన ఆమె జనవరిలో ఇక్కడికి బదిలీపై వచ్చారు. 2017 నుంచి 2018 ఏప్రిల్ వరకు మహారాష్ట్రలోని ముంబైలో అకౌంటెంట్ జనరల్‌గా, 2018 ఏప్రిల్ నుంచి 2020 అక్టోబరు వరకు చెన్నైలోని రీజనల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత అక్కడే 2024 జనవరి వరకు ఆడిట్(సెంట్రల్) ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పని చేశారు.

జస్టిస్ మహేశ్వరి కుమార్తె పెళ్లికి ధర్మారెడ్డి, వేమిరెడ్డి

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి కుమార్తె డాక్టర్ దీక్ష వివాహానికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ వేడుక జరిగింది. టీటీడీకి చెందిన వేద పండితులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ జేకే మహేశ్వరి ప్రస్తుతం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన ఆహ్వానం మేరకే ధర్మారెడ్డి, వేమిరెడ్డి వివాహ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది. వీరిద్దరూ 2021లో ఒక న్యాయమూర్తి కుటుంబ సభ్యుడి పెళ్లికి హాజరై వజ్రాలు పొదిగిన వాచ్‌ను బహుమతిగా ఇవ్వజూపారని, దాన్ని ఆ జడ్జి తిరస్కరించారని 'ఆంధ్రజ్యోతి' వెల్లడించిన సంగతి తెలిసిందే!

గద్దర్‌కు పోరాటమే జీవితం: పవన్‌కల్యాణ్

» తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆక్సిజన్ లాంటివారు: నారాయణ

అమరావతి, హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'అతడు అనేక ప్రజా యుద్ధముల ఆరితేరిన యోధుడనే మాటలను ప్రజానౌక దివంగత గద్దర్‌కు అన్వయించడం అతిశయోక్తి కాదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. పోరాటమే జీవితం, జీవితమే పోరాటంగా జీవనయానం సాగించిన విప్లవకారుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. బుధవారం గద్దర్ జయంతి సందర్భంగా పవన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో.. "గ్రామాల్లో ప్రజల మాటలను పాటలుగా కూర్చి, ఆ పాటలనే తూటాలుగా పేర్చి జనం కోసం జనారణ్యంలో యుద్ధమొనరించిన సైనికుడు గద్దర్" అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఆచార్య జయశంకర్, ప్రజాయుద్ధనౌక గద్దర్.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆక్సిజన్ లాంటి వారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి: ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహావిష్కరణ సభలో పాల్గొని ప్రసంగించారు. భూమి కోసం, భుక్తి కోసం తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో గద్దర్ పాల్గొన్నారని ఆర్ఎస్ ప్రవీణ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కొని ఒక్కో ఎకరాన్ని రూ.100 కోట్లకు బడా కంపెనీలకు విక్రయించిందని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.

పోలీసులు ఎంత కట్టడి చేస్తున్నా రకరకాల మార్గాల్లో రవాణా

లిక్విడ్ గంజాయితో తినుబండారాలు.. 'సోషల్' ప్రచారం

డార్క్ నెట్‌లో ఆర్డర్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

మత్తు కేసుల్లో పట్టుబడితే కఠినశిక్షలు.. భవిష్యత్తుకే దెబ్బ

ఉన్నత విద్య, విదేశీ, ప్రభుత్వ ఉద్యోగాలపై కేసుల ప్రభావం

"టమాటా ట్రేల మధ్యలో గంజాయి ప్యాకెట్లు ఉంచి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టు"

"బొలేరో వాహనాల కింది భాగంలో బాక్సుల్లాంటి నిర్మాణాలు ఏర్పాటు చేసి గంజాయి రవాణా"

"నర్సరీ మొక్కలను తరలించే వాహనాల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు"



..ఇలాంటి వార్తలు పత్రికల్లో కనీసం రోజుకు ఒకటైనా చూస్తుంటాం! రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి అక్రమ రవాణా దందాకు ఉదాహరణలివి! గంజాయి కట్టడికి పోలీసులు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. అక్రమార్కులు రకరకాల కొత్త మార్గాలను కనిపెట్టి మరీ దాన్ని రవాణా చేస్తున్నారు. ఆ మత్తుకు బానిసైనవారు.. డార్క్‌నెట్‌లో ఆర్డరిచ్చి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఒక దశ దాటాక.. డబ్బు కోసం గంజాయి విక్రేతలుగా మారి పోలీసులకు దొరికిపోతున్నారు. అలా గంజాయి కేసుల్లో పట్టుబడితే.. వారి భవిష్యత్తు దెబ్బతింటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

గంజాయి పుష్పలు

పోలీసులు ఎంత కట్టడి చేస్తున్నా రకరకాల మార్గాల్లో రవాణా

» లిక్విడ్ గంజాయితో తినుబండారాలు.. 'సోషల్' ప్రచారం

» డార్క్ నెట్‌లో ఆర్డర్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

» మత్తు కేసుల్లో పట్టుబడితే కఠినశిక్షలు.. భవిష్యత్తుకే దెబ్బ

» ఉన్నత విద్య, విదేశీ, ప్రభుత్వ ఉద్యోగాలపై కేసుల ప్రభావం



(ఆంధ్రజ్యోతి-హైదరాబాద్/సిటీ)

'పుష్ప' సినిమాలో ఎర్రచందనం రవాణాకు అల్లు అర్జున్ రకరకాల ప్లాన్లు వేస్తాడు గుర్తుందా? గంజాయి అక్రమ రవాణా అందుకు ఎంతమాత్రం తీసిపోదు. ఆ సినిమాలో అల్లు అర్జున్‌కు మించి కొత్తకొత్త మార్గాలను కనిపెట్టే గంజాయి 'పుష్ప'లు తెలుగు రాష్ట్రాల్లో చాలా మందే ఉన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దమొత్తంలో గంజాయి మహారాష్ట్ర, కర్ణాటకలకు తెలంగాణ మీదుగానే రవాణా అవుతుంది. ఈ క్రమంలోనే గంజాయి విక్రేతలు ఇక్కడ కూడా తమ మార్కెట్‌ను విస్తృతంగా పెంచుకునేందుకు అన్ని మార్గాలనూ అన్వేషిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా సాధారణ వ్యక్తులు కొరియర్‌లో పార్సిల్ పంపినట్టు పంపేవారు కొందరు. మరికొందరు ఎలాంటి భయమూ లేకుండా బస్సులు, రైళ్లల్లో సైతం తరలిస్తుంటారు. అయితే, పెద్ద మొత్తంలో తరలించాలంటే ఈ మార్గాలు సరిపోవు. అందుకోసం వాహనాల్లో ప్రత్యేకంగా క్యాబిన్లు తయారు చేయడం, ఇతర సరుకుల మధ్య ఉంచి సరఫరా చేయడం వంటి మార్గాలను ఎంచుకుంటారు. రైళ్లల్లో గంజాయి రవాణాకు ముఠాలు అమాయక మహిళలు, పిల్లలను సైతం వాడుకుంటాయి. ఇందులో భాగంగా.. డబ్బు ఆశ చూపి, రోజువారీ కూలీ పనులకు వెళ్లే మహిళలను ఎంచుకుంటారు. గంజాయిని ప్యాకెట్లలో చుట్టి, వాసన బయటకు రాకుండా నాఫ్తలిన్ గోలీలు ఉంచి వారికి అప్పగిస్తారు. ఆ ప్యాకెట్‌లో ఏం ఉందో వారికి ఏమాత్రం తెలియదు. ప్రయాణించే సమయంలో.. ఆ ప్యాకెట్లను ఒక బోగీలో ఉంచి వారిని మరో బోగీలో ఉండాల్సిందిగా సూచించి పంపిస్తారు. రవాణా ఖర్చులు, సెల్‌ఫోన్ వారికి ఇస్తారు. ఇచ్చిన సరుకును చెప్పినచోటుకు చేరవేస్తే.. వారికి ఇస్తామన్న డబ్బు ముట్టజెప్తారు. పోలీస్ నిఘా నుంచి తప్పించుకునేందుకు మహిళలతో పాటు చిన్నపిల్లల్ని కూడా పంపిస్తుంటారు. ఒక వేళ గంజాయితో వారు పట్టుబడితే.... వారిపైనే కేసులుంటాయి తప్ప, అసలు నిందితులు దొరకని విధానమిది. పోలీసులకు చిక్కకుండా.. చెక్‌పోస్టుల బెడద లేకుండా ఉండేందుకు ఓ గంజాయి విక్రేత కొరియర్ మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇందుకోసం ఒక కొరియర్ సర్వీస్ నిర్వాహకునితో మాట్లాడుకుని సరఫరా చేయడం మొదలుపెట్టాడు. కానీ, ఇలాంటి విషయాలు ఆట్టే కాలం దాగవు. ఈ వ్యవహారంపై చందానగర్ పోలీసులకు సమాచారం అందడంతో గత ఏడాది ఆ కొరియర్ సంస్థపై దాడు చేసి 6 బాక్సుల్లో సరఫరా అయి వచ్చిన 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో గంజాయి విక్రేత అయితే.. పోలీస్ సైరన్, ప్రభుత్వాధికారుల స్టిక్కర్లను తన వాహనానికి అంటించి వాటిలో సరఫరా చేస్తూ దొరికిపోయాడు.



ద్రవరూప మహమ్మారి..

మామూలు గంజాయిని పెద్ద ఎత్తున రవాణా చేయడం, విక్రయించడం రిస్క్‌తో కూడుకున్న పని కావడంతో 2015 నుంచి గంజాయి ముఠాలు లిక్విడ్ గంజాయిపై దృష్టి సారించాయి. పొడి గంజాయి కంటే దీని ధర దాదాపు 20 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కానీ, రవాణా సులభం, ఆదాయం ఎక్కువ. ధరతోపాటు.. అదిచ్చే కిక్కు కూడా ఎక్కువే. అందుకే.. హాషిష్ ఆయిల్‌గా పిలిచే ఈ ద్రవరూప గంజాయికి ఇప్పుడు మార్కెట్లో క్రేజ్ చాలా ఎక్కువగా ఉంది. మామూలు గంజాయి కంటే.. రెండు చుక్కల లిక్విడ్ గంజాయిని తీసుకోవడం వల్ల 10 రెట్ల ఎక్కువ కిక్ వస్తుండడంతో వినియోగదారులు.. రవాణా సులభం, ఆదాయం ఎక్కువగా ఉండడంతో విక్రేతలు దీనిపైనే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు ఈ లిక్విడ్ గంజాయిని తయారుచేయడంలో సిద్ధహస్తులు. తెలుగు రాష్ట్రాలకు చెందినవారు వారివద్ద ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని మరీ ఈ గంజాయిని తయారుచేస్తున్నారు. కొన్ని ప్రత్యేక రసాయనాలను, యంత్రాలను ఉపయోగించి తయారు చేసి గంజాయిని వారు ఆయిల్ రూపంలోకి మారుస్తారు. 30 కిలోల పొడిగంజాయి నుంచి ఒక లీటరు లిక్విడ్ తయారవుతుంది. దాన్ని 5 మిల్లీలీటర్ల (ఎంఎల్) బాటిళ్లలో నింపు కొంటే.. జేబుల్లో పెట్టుకుని ఎక్కడికైనా తీసుకెళ్లిపోవడం చాలా సులభం. తనిఖీల్లో దొరికితే ఆయుర్వేద నూనె అని చెప్పి తప్పించుకుంటున్నారు. కొందరైతే అసలు తనిఖీల నుంచే తప్పించుకోవడానికి ఏకంగా ఆయుర్వేద మందు సీసాల్లో ఈ లిక్విడ్‌ను నింపి, ఆ పేరుతోనే రవాణా చేస్తున్నారు. 5ఎంఎల్ లిక్విడ్ గంజాయిని రూ.5 వేల నుంచి రూ.7 వేలకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది.

ప్రచారం ఇలా.. కొనుగోళ్లు అలా..

గంజాయి విక్రేతలు.. చిన్నచిన్న కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో సైతం ఆ మత్తు మహమ్మారి అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. అమ్మకాల కోసం ప్రత్యేక చెయిన్‌లను ఏర్పాటు చేసుకుని హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాల్లోనూ జోరుగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. చెయిన్ అంటే.. గంజాయికి పూర్తిగా బానిసలైన వారికి కమీషన్ల ఆశ చూపించి ఏజెంట్లుగా మార్చి, వారిద్వారానే అమ్మకాలు జరపడం. ఈ తరహా చెయిన్ సిస్టంలో విద్యార్థులే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. చెయిన్ సిస్టమ్‌లో ఉన్న విద్యార్థులు.. తరచుగా పార్టీలు ఇస్తూ తొలుత తమ సర్కిల్‌లో ఉన్న వారిని మత్తువైపు లాగుతారు. తర్వాత వారికి విక్రయించి, వారిద్వారా మరికొందర్ని లాగుతారు. గంజాయి లిక్విడ్‌తో ఆకర్షణీయమైన తినుబండారాలు తయారు చేసి సోషల్ మీడియా వేదికగా వాటికి ప్రచారం కల్పించుకుంటున్నవారు కూడా ఉన్నారు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో విద్యార్థులు, యువత సులువుగా డార్క్‌నెట్‌లో ఆర్డర్ పెట్టి గంజాయిని తెప్పించుకుని వాడుతున్నారు. పార్టీలు చేసుకుంటున్నారు.

దొరికితే కష్టమే..

సరదా కోసం గంజాయి మత్తుకు అలవాటు పడితే ఆరోగ్యంపై ప్రభావం పడటంతోపాటు కేసుల విషయంలోను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిందే. ఇతర కేసుల్లో అయితే న్యాయస్థానంలో వారి నేరం రుజువైతేనే నేరస్థులుగా పరిగణిస్తారుగానీ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల్ని ఉపయోగిస్తూ, రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడితే మొదటి రోజు నుంచే నేరస్థులుగా పరిగణిస్తారు. ఎన్‌డీపీఎస్ చట్టం అంత కఠినంగా ఉండటమే ఇందుకు కారణం. దాని ప్రకారం.. గంజాయి వినియోగిస్తూ పట్టుబడేవారిని ఒకటి, రెండుసార్లు బాధితులుగా గుర్తిస్తారు. వారు చికిత్సకు అంగీకరిస్తే.. కేసు నమోదు చేయకుండా ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని సెక్షన్ 64ఏ కింద డీ-ఎడిక్షన్ సెంటర్‌కు తరలిస్తారు. అయినా గంజాయికి బానిసలై పదేపదే పట్టుబడే వారిని నిందితులుగా పరిగణించి కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. గంజాయి కేసుల్లో కనిష్ఠంగా 3, 6 నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా మొదలుకొని జీవితఖైదు, మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది. ఇతర కేసుల్లో జీవిత ఖైదు, మరణ శిక్షలకు క్షమాభిక్ష కోరే అవకాశం చట్టప్రకారం ఉన్నా.. ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసుల్లో క్షమాభిక్షకు అవకాశం ఉండదని పోలీసులు చెబుతున్నారు. అంతేకాదు.. పెద్దమొత్తంలో గంజాయి సరఫరా చేస్తూ ఎక్కువసార్లు పట్టుబడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. పీడీ యాక్ట్ నమోదు అయిందంటే సగం జీవితం జైల్లో గడపాల్సిందే. గంజాయికి అలవాటు పడుతున్న వారిలో పాఠశాల విద్యార్థుల నుంచి, ఇంజనీరింగ్ విద్యార్థుల వరకు ఉంటున్నారు. వారిని పోలీసులు గుర్తించినప్పుడు వారు చదివే విద్యాసంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులకు కూడా సమాచారం ఇస్తున్నారు. అలా సమాచారం ఇచ్చినా వారు అప్రమత్తమై గంజాయి వినియోగాన్ని అరికట్టే చర్యలు తీసుకోకపోతే.. దాన్ని నిర్లక్ష్యం కింద పరిగణించి వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. చదువుకునే దశలో మత్తుకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని.. క్రిమినల్ రికార్డు ఎంట్రీ కావడంతో విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను కోల్పోతారని, ఇక్కడైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

రైళ్లల్లో రవాణాపై నిఘా: మహేశ్ భగవత్



ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ మీదుగా గంజాయి పెద్ద ఎత్తున రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కట్టడికి చర్యలు చేపడతామని అదనపు డీజీపీ (రోడ్డు భద్రత, రైల్వే) మహేశ్ భగవత్ తెలిపారు. ఇప్పటికే తనిఖీలు ముమ్మరం చేశామని... ఇకపై రైల్వే పార్శిళ్లపైనా దృష్టి సారిస్తామని ఆయన వెల్లడించారు. ఎవరిదగ్గరైనా 20 కిలోల కంటే ఎక్కువ మొత్తంలో గంజాయి పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని భగవత్ హెచ్చరించారు.

పంజాగుట్ట ఠాణా ప్రక్షాళన!

హోంగార్డు నుంచి ఎస్సై వరకు.. 85 మందిపై బదిలీ వేటు.. కొత్తవారికి పోస్టింగ్



పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పోలీస్‌స్టేషన్..! నగరం నడిబొడ్డున ఉండే ఈ ఠాణాకు దేశంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు ఉంది..! అత్యధికంగా ఎస్సైలు ఉండే ఈ స్టేషన్ ఇన్వెస్టిగేషన్‌కు పెట్టింది పేరు. ఈ ఠాణా పరిధిలో ఏ సంఘటన జరిగినా సంచలనమే..! అలాంటి పోలీస్ స్టేషన్‌కు నిర్లక్ష్యం, అవినీతి జాడ్యం పట్టింది..! అధికారులు, సిబ్బంది తీరుతో ఠాణా ఖ్యాతి కాస్తా.. మసకబారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో, గతంలో కనీవినీ ఎరగని రీతిలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మొత్తం ఠాణాను ప్రక్షాళన చేశారు. హోంగార్డు మొదలు ఎస్సై వరకు సిబ్బంది 85 మందిపై బదిలీ వేటు వేశారు. మంగళవారమే నగరంలో 53 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసిన సీపీ.. పంజాగుట్టకు కూడా ఎస్‌హెచ్‌వోను నియమించారు. బుధవారం ఠాణాలో పనిచేసే పలువురు హోంగార్డులు, ఆరుగురు ఎస్సైలు, 8 మంది ఏఎస్సైలు, 17 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 54 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వెంటనే ఆ స్థానంలో కొత్త సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఠాణాలో ఎస్సైలు విజయానంద్, ప్రదీప్, మహేశ్, ఉపేందర్ మినహా.. దాదాపుగా అందరిపైనా బదిలీ వేటు పడింది. ఒకేసారి ఒకే పోలీస్‌స్టేషన్‌లో 85 మంది సిబ్బందిని బదిలీ చేయడం ఇప్పుడు పోలీసు శాఖలో కలకలం రేపుతోంది.

వైఫల్యాలకు మచ్చుతునకలు..

- గత నెల 23వ తేదీ రాత్రి ప్రజాభవన్ ఎదుట కారుతో బ్యారీకేడ్లను ఢీకొన్న ఘటనలో బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు సాహిల్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు సహకరించిన అభియోగాలపై బోధన్ మాజీ ఇన్‌స్పెక్టర్ ఇటీవలే అరెస్టయ్యారు. పంజాగుట్ట ఠాణా స్థాయిలోనే అక్రమాలు జరిగినట్లు అంతర్గత విచారణలో నిర్ధారణ అయ్యింది.
- జూమ్ యాప్ ద్వారా కార్లు బుక్ చేసుకుని తప్పించుకుని తిరిగుతున్న ఘరానా నిందితుడు అమీర్‌అలీని పంజాగుట్ట పోలీసులు గతనెల 26న ఎట్టకేలకు అరెస్ట చేశారు. అయితే.. అతణ్ని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా.. పోలీసుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని, పారిపోయాడు.
- గత ఏడాది జనవరి 31న పెట్రోకార్-2 సిబ్బంది ఎర్రమంజిల్‌లోని రహదారులు-భవనాల శాఖ కార్యాలయం ఆవరణలో విధినిర్వహణలో మద్యం సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.
- అడపాదడపా ఈ స్టేషన్ సిబ్బందిపై డీసీపీ, సీపీలకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. దీంతో సీపీ శ్రీనివాస్‌రెడ్డి నిజాలను నిగ్గుతేల్చాలంటూ నిఘావర్గాలను కోరారు. ఇంటెలిజెన్స్ పక్కా నివేదికతో ఒకేసారి పెద్దమొత్తంలో అధికారులు, సిబ్బందిని ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) విభాగానికి అటాచ్ చేసినట్లు తెలిసింది.

146 మంది కొత్త సిబ్బంది

ఠాణా మొత్తాన్ని ప్రక్షాళన చేసిన పోలీసు కమిషనర్.. ఆ వెంటనే 146 మంది సిబ్బందికి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఎస్సైలు, 8 మంది ఏఎస్సైలు, 18 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 70 మంది కానిస్టేబుళ్లు, 34 మంది హోంగార్డులు, ముగ్గురు ఎస్పీవోలు, నలుగురు ఎల్జీఈలు ఉన్నారు.

సినీ నిర్మాత అంజిరెడ్డి హత్య కేసు..
విచారణలో నిర్లక్ష్యం.. ఇన్‌స్పెక్టర్, ఎస్సైపై వేటు

అడ్డగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత అంజిరెడ్డి హత్యకేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి.. తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడంతో గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్సై దీక్షిత్‌రెడ్డిని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. నిర్మాత అంజిరెడ్డి(71) అమ్మకానికి పెట్టిన ఆస్తిని కొనుగోలు చేస్తానని వచ్చి.. ఆయనకు రూ.కోట్లలో ఆస్తులు ఉన్నట్లు గుర్తించి.. వాటిని కొట్టేయాలని పథకం వేసి, బిహారీ సుపారీ గ్యాంగ్‌తో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన సికింద్రాబాద్ గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది సెప్టెంబరు 29న చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన నాలుగు రోజుల వరకు కూడా పోలీసులు వివరాలను గోప్యంగా పెట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చినా.. అంజిరెడ్డి హత్య సంచలనం సృష్టించింది. ఈ కేసులో నిందితుడు రాజేశ్.. పకడ్బందీగా వ్యవహరించాడు. అంజిరెడ్డి, ఆయన భార్యకు అమెరికా పౌరసత్వం రావడంతో.. ఇక్కడ ఆస్తుల్ని అమ్మి భారత్‌ను వీడాలనుకుంటున్నట్లు గుర్తించి, హత్యకు పథకం రూపొందించాడు. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబరు 29న సికింద్రాబాద్ డీమార్ట్ బిల్డింగ్ సెల్లార్‌లో కారు ప్రమాదంలో అంజిరెడ్డి చనిపోయినట్లు నమ్మించే ప్రయత్నం చేయగా.. దానికి గోపాలపురం పోలీసులు సహకరించినట్లు అంతర్గత విచారణలో తేలడంతో ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను సీపీ సస్పెండ్ చేశారు.

నంది.. ఇక గద్దర్ అవార్డు

వచ్చే ఏడాది నుంచి కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు పురస్కారాలు

» ఇదే శాసనం.. నా మాటే జీవో : సీఎం రేవంత్ రెడ్డి

» గద్దర్ జయంతి కార్యక్రమంలో కీలక ప్రకటన



తరగని గని గద్దర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో భట్టి

హైదరాబాద్, రవీంద్రభారతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నంది అవార్డుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. నంది అవార్డులను ఇక మీద గద్దర్ అవార్డులుగా అందిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది గద్దర్ జయంతి రోజున కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డు అందజేస్తామని వెల్లడించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ నంది అవార్డులపై ప్రకటన చేశారు. అలాగే, మాజీ సీఎం కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. కొంతకాలంగా నిలిచిపోయిన నంది అవార్డులను సినీ ప్రముఖులు, కళాకారులు నుంచి వచ్చిన వినతుల మేరకు పునరుద్ధరిస్తున్నామని సీఎం ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ లెజెండ్, బ్రాండ్ అంబాసిడర్ అయిన గద్దర్ పేరిట ఆ పురస్కారాలు అందజేస్తామని, ఇదే శాసనం.. నా మాటే జీవో.. అని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో వేదికపై ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇతర నేతలు సీఎంను ఆలింగనం చేసుకున్నారు. గద్దర్ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం గద్దర్‌కు ఇచ్చే గొప్ప అవార్డు, రివార్డు అని కొనియాడారు. ఇక, రాష్ట్రంలో ఓ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం పెట్టాలని అంతకుముందు సభలో పాల్గొన్న ప్రముఖులు చేసిన విజ్ఞప్తులపై కూడా సీఎం సానుకూలంగా స్పందించారు. కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

గద్దర్‌ను కలిస్తే వెయ్యి ఏనుగుల బలం..

గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని అరాచక, నియంత పాలనను చూసి నిరాశకు లోనైనప్పుడు తాను గద్దర్‌ను కలిసేవాడినని, వెయ్యి ఏనుగుల బలం వచ్చేదని సీఎం తెలిపారు. గద్దర్ ఇచ్చిన స్ఫూర్తితోనే ప్రజలకు అనుమతి లేని ఇనుప కంచెల గడీలను బద్దలుకొట్టి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన రావాలని ఆకాంక్షించే భట్టి విక్రమార్క పాదయాత్రలో పాల్గొని గద్దర్ సంఘీభావం తెలిపారన్నారు. 'పొలిటిషియన్‌తో కొట్లాడడం సులువు. క్రిమినల్‌తో పోట్లాడటం అంతకంటే సులువు.. నీ ఎదురుగా ఉన్న కేసీఆర్ పొలిటిషియన్ కాదు క్రిమినల్ అని గద్దర్ చెప్పేవారు" అని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేసీఆర్ క్రిమినల్ పొలిటిషియన్ కావడం వల్లే ప్రతి పనిని అడ్డుకుని శాపనార్థాలు పెడుతున్నారని ఆరోపించారు. నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ ఒక్కటై కాంగ్రెస్ రాకుండా అడ్డుకున్నారని బీజేపీ, బీఆర్ఎస్‌ను ఉద్దేశిస్తూ సీఎం అన్నారు. ప్రజలు మొన్నటి ఎన్నికల్లో లిక్కర్ పార్టీని ఓడించారని వచ్చే ఎన్నికల్లో నిక్కర్ పార్టీని ఓడిస్తారని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌వి పగటి కలలు..

మరో ఆరు నెలల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ పగటికలలు కంటున్నారని, ప్రభుత్వాన్ని కూల్చాలని అనుకుంటున్నారని సీఎం విమర్శించారు. "గత ఎన్నికల్లో ప్రజలు బొక్కలు ఇరగ్గొట్టి బోర్ల పడేసినా.. ఇంకా మీ బొక్కలే సక్కగ్గాలేదు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతానని పగటికలలు కంటున్నారు.? ప్రయత్నం చేసి చూస్తే తెలుస్తది ప్రజల ఆగ్రహం ఏవిఁటో.? నాడు నాదెండ్ల భాస్కరరావు ఇలాంటి వేషాలే వేస్తే ప్రజలు ఊళ్లోకి కూడా రానివ్వలేదు. నేడు అలాంటి ఆలోచనలు చేస్తే.. ప్రజలు గోరీ కడ్తరు. మీరు బతికుండగానే గోరీ కట్టించుకోవాలంటే ప్రయత్నించి చూడండి. ఇది మీ ఒంటికి, ఇంటికి మంచిది కాదు" అని.. సీఎం రేవంత్ హెచ్చరించారు. పదేళ్ల సుస్థిర పాలన అందించే బాధ్యత తమ మంత్రివర్గానిది అని రేవంత్ అన్నారు. కేసీఆర్ దుర్మార్గుడనే విషయం ఆయన కుమార్తె ఎమ్మెల్సీ కవితకు కూడా తెలుసునని అన్నారు. అసెంబ్లీలో జ్యోతీరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తండ్రి పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అడగని కవిత.. ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే అసెంబ్లీ స్పీకర్‌కు వినతపత్రం ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తండ్రిపై విశ్వాసం, నమ్మకం లేకనే కవిత నాడు ధైర్యం చేయలేదని అన్నారు.

రెండున్నర గంటలు వేదికపై ముఖ్యమంత్రి

గద్దర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు రవీంద్రభారతి వచ్చిన సీఎం రేవంత్ సభా వేదికపై సుమారు రెండున్నర గంటలు ఉన్నారు. వేదికపై ఉన్న ప్రముఖులు మాట్లాడే వరకు వేచి ఉండి అనంతరం ప్రసంగించారు. అయితే సీఎం హోదాలో తొలిసారి రవీంద్రభారతి వచ్చిన రేవంత్ రెడ్డి ఇంత సమయం కేటాయించడంపై ప్రేక్షకులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

గద్దర్ కోరుకున్న మార్పు కోసం కృషి : భట్టి

కాగా, తన గళంతో సమాజాన్ని చైతన్యపరిచిన మహనీయుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. గద్దర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందని ఆకాంక్షించారు. గద్దర్ కోరుకున్న మార్పు కోసం ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని హామీ ఇచ్చారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ లాఠీలు, తూటాలను ఎదుర్కొని సమసమాజ స్థాపనకు అకుంఠిత దీక్షతో పనిచేసిన మహోన్నతుడు గద్దర్ అని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గద్దర్ ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. కాగా, అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావుపూలే విగ్రహ ఏర్పాటు కోసం కలిసి రావాలని ఎమ్మెల్సీ కవిత తనను కోరితే తిరస్కరించారని కంచె ఐలయ్య ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వం గద్దర్‌ను అవమానించిందని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 1 ఫిబ్రవరి 2024

ఐఐటీ జోధ్‌పూర్‌లో
పీజీ డిప్లొమా

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీజీ డిప్లొమా ఇన్ డేటా ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 35 అకడమిక్ క్రెడిట్స్ నిర్దేశించారు. రిటెన్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ఆన్‌లైన్ సెషన్స్, ఇండస్ట్రీ నిపుణులతో మాస్టర్ క్లాసెస్, ఆన్‌లైన్ ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు, క్యాంపస్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు, అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఆసక్తి మేరకు ఎంటెక్‌లో జాయిన్ కావచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులు; బీఎస్సీ/బీసీఏతోపాటు ఎమ్మెస్సీ/ఎంసీఏ పూర్తిచేసినవారు; ఏదేని మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

- పీజీ డిప్లొమా పూర్తిచేసిన తరవాత ఎంటెక్‌లో చేరాలనుకొనేవారికి డిగ్రీ/పీజీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. బీఎస్సీ/ఎమ్మెస్సీ స్థాయిలో సైన్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.3,00,000
- **అడ్మినిస్ట్రేటివ్ ఫీజు:** రూ.15,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 3
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఫిబ్రవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** iitj.ac.in

తెలంగాణ గురుకులాల్లో ప్రవేశానికి
టీఎస్ఆర్‌జేసీ సెట్



తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఆర్ఈఐఎస్)- ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(టీఎస్ఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలురకు 15, బాలికలకు 20 రెసిడెన్షియల్ కాలేజీలను ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ గురుకులాల్లో ప్రవేశానికి ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు: యాదాద్రి భువనగిరి జిల్లాలోని సర్వేల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని బాలురకు, హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని బాలికలకు కేటాయించారు. ఒక్కోదానిలో ఎంపీసీ 88, బైపీసీ 60, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి. ఈ ఆర్‌జేసీల్లో ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ పోటీ పడవచ్చు.

- జిల్లాలకు నిర్దేశించిన మేరకు 33 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో బాలురకు, బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ఆర్‌జేసీలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఈ ఏడాది మార్చిలో నిర్వహించే పదోతరగతి పరీక్షల్లో మొదటిసారే ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులు కనీసం 6 జీపీఏ సాధించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 జీపీఏ చాలు. అభ్యర్థులందరికీ ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీసం 4 జీపీఏ ఉండాలి. గత సంవత్సరాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ఇంగ్లీష్ అంటే జనరల్ ఇంగ్లీష్‌గా పరిగణిస్తారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ఎంపిక: టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024లో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని 1:5 నిష్పత్తిలో కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. స్థానికత, రిజర్వేషన్ నిబంధనలు, స్పెషల్ కేటగిరీ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 16
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 16 నుంచి
- **టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 21
- **మొదటి కౌన్సెలింగ్:** మేలో
- **వెబ్‌సైట్:** http://tsrjdc.cgg.gov.in

లిటిల్స్



మీకు తెలుసా?

- ఈ కోతి ముఖం చుట్టూ గుబురు గడ్డం ఉంటుంది. పెద్దతోక ఉంటుంది. దీన్ని 'లయన్ టైల్డ్ మకా'. సింహం తోకలా జుట్టు లేకుండా గట్టిగా తోక ఉంటుంది కాబట్టి ఈ పేరొచ్చింది. ఈ తోక పొడవు 25 సెం.మీ.
- బియర్డ్ మంకీ అని కూడా పిలుస్తారు. తినే ఆహారాన్ని దవడల మధ్య దాచుకుంటుంది. అవసరమైనపుడు తింటుంది.
- తలనుంచి తోక వరకు అరవై మూడు సెం.మీ ఉంటుంది. దీని బరువు పది కేజీల వరకు ఉంటుంది.
- పుట్టిన రెండు నెలల తర్వాత ముఖం చుట్టూ జుట్టు పెరగటం ఆరంభమవుతుంది.
- నల్లగా ఉండే కోతికి ముఖం చుట్టూ గ్రే జుట్టు వస్తుంది. గ్రే కలర్‌లో ఉండే కోతికి నల్ల జుట్టు ఉంటుంది.
- చెట్ల కొమ్మల మీదనే నివసిస్తాయి. అక్కడే పడుకుంటాయి.
- ఒక్కో గుంపులో ముప్పయ్ కోతులు ఉంటాయి. వీటిలో ఓ ఆల్ఫా మేల్ ఉంటుంది. అదే లీడర్‌గా పని చేస్తుంది. మగ కోతులు మాత్రం గ్రూపులు మారుస్తుంటాయి.



- ఈ లయన్ టైల్డ్ కోతులు కేవలం మనదేశంలోనే ఉన్నాయి. పశ్చిమ కనుమల్లో కనిపిస్తాయి.
- ఇవి పదిహేడు రకాలుగా శబ్దాలు చేస్తాయి. వాటి కమ్యూనికేషన్‌ను ఇతర కోతులు పర్ఫెక్ట్‌గా అర్థం చేసుకుంటాయి.
- పూలు, ఆకులు, పండ్లు తిని బతుకుతాయి. అగ్రెసివ్‌గా ఉంటాయివి.
- వీటి జీవనకాలం ఇరవయ్యేళ్లు.




5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



చుక్కలు కలిపి రంగులు వేయండి



డైలీ సుడోకు - 218

			1				7	8
	6		8	3		9		5
5					7		6	
					9	5		
3	7			1			9	6
		6	4					
	3		9					2
8		2		4	1		5	
6	1				5			

సుడోకు - 217 సమాధానం

5	9	6	4	3	2	7	1	8
4	3	1	9	7	8	6	2	5
8	2	7	1	6	5	3	4	9
9	7	4	3	5	1	8	6	2
1	6	2	8	9	7	5	3	4
3	8	5	2	4	6	1	9	7
7	5	3	6	2	9	4	8	1
2	4	8	5	1	3	9	7	6
6	1	9	7	8	4	2	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

విశాఖ ఐఐఎంలో పీహెచ్‌డీ



విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు గరిష్ఠంగా అయిదేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, థీసిస్ వర్క్ ఉంటాయి.

స్పెషలైజేషన్‌లు: డెసిషన్ సైన్సెస్, ఎకనామిక్స్ అండ్ సోషల్ సైన్సెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు, నాలుగేళ్ల లేదా ఎనిమిది సెమిస్టర్ల బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 డిసెంబరు 31 నాటికి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులో యూజీసీ జేఆర్ఎఫ్ నెట్/సీఎస్ఐఆర్ నెట్/జీమ్యాట్/జీఆర్ఈ/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా క్యాట్ 2023 స్కోర్/క్యాట్ 2023 రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా సూచించాలి.

- ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ, పీజీ స్థాయిల్లో సైన్స్/మేథమెటిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్ కోర్సులు చదివి ఉండాలి. స్ట్రాటజీ స్పెషలైజేషన్‌కు సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఆర్థిక సహకారం: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; మూడో ఏడాది నుంచి నెలకు రూ.42,000 స్టయిపెండ్‌గా ఇస్తారు. యూజీసీ నిబంధనల ప్రకారం కంటింజెన్సీ గ్రాంట్, హెచ్ఆర్ఏ ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.3,00,000; నేషనల్ కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.60,000 చెల్లిస్తారు.

- అభ్యర్థులు ఏవేని రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 21
- **కాల్ ఫర్ పర్సనల్ ఇంటర్వ్యూ:** ఏప్రిల్ 21న
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 13 నుంచి 17 వరకు
- **అడ్మిషన్ ఆఫర్:** మే 28
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్ తేదీ:** జూన్ 24
- **వెబ్‌సైట్:** www.iimv.ac.in

జాబ్ కార్నర్

దక్షిణ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 2860

సదరన్ ఇండియన్ రైల్వే వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అప్రెంటిస్‌షిప్

వర్క్‌షాప్‌లు/యూనిట్‌లు: సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్(పోదనూర్, కోయంబత్తూర్); క్యారేజ్ అండ్ వేగన్(పెరంబూర్); రైల్వే హాస్పిటల్(పెరంబూర్), తిరువనంతపురం డివిజన్, పాలక్కడ్ డివిజన్, సాలెమ్ డివిజన్; లోకో(పెరంబూర్); ఎలక్ట్రికల్(పెరంబూర్); ఇంజనీరింగ్(అరక్కోణం), చెన్నై డివిజన్; మెకానికల్(డీజిల్), క్యారేజ్ అండ్ వేగన్ ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్(అరక్కోనం, ఆవడి, తాంబరం, రాయపురం), సెంట్రల్(పొన్నామలై), తిరుచిరాపల్లి డివిజన్, మధురై డివిజన్.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎంఎల్‌టీ, టర్నర్, సీఓపీఏ, ప్లంబర్, పీఏఎస్ఏఏ, ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మెకానికల్, అడ్వాన్స్‌డ్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రెయినింగ్ పీరియడ్: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ ట్రేడులకు 15 నెలల నుంచి రెండేళ్లు, ఇతర ట్రేడులకు ఏడాది.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in/

ఎన్‌పీసీఐఎల్‌లో ట్రెయినీలు

ఖాళీలు 53

రావత్‌భట్ రాజస్థాన్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్(డిప్లొమా): **49 పోస్టులు**
2. స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్(సైన్స్ గ్రాడ్యుయేట్): **4 పోస్టులు**

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.150. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14

వెబ్‌సైట్: https://www.npcil.nic.in/index.aspx

ఐఐటీ తిరుపతిలో టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి...టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్)
3. అసోసియేట్ ప్రొఫెసర్
4. ప్రొఫెసర్

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధన అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1కు 38 ఏళ్లు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 29

వెబ్‌సైట్: https://iittp.ac.in/

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో స్పెషలిస్ట్, సైంటిస్ట్ పోస్టులు

ఖాళీలు 69

దేశ వ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు/శాఖల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. స్పెషలిస్ట్ గ్రేడ్-3: **40 పోస్టులు**
2. సైంటిస్ట్ 'బి': **28 పోస్టులు**
3. అసిస్టెంట్ డైరెక్టర్: **1 పోస్టు**

అర్హతలు: పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://upsc.gov.in/

ఎంఆర్‌పీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు

మంగళూరు(కర్ణాటక)లోని ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ- మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్(ఎంఆర్‌పీఎల్)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అసిస్టెంట్ ఇంజనీర్: 4 పోస్టులు

విభాగాలు: ఫైర్, సెక్రటేరియల్, సేఫ్టీ

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ(ఫైర్/ఫైర్ అండ్ సేఫ్టీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియాలో అసోసియేట్ మెంబర్‌షిప్, డిగ్రీతో పాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 27 సంవత్సరాలు మించరాదు.

దరఖాస్తు రుసుము: రూ.118. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10

వెబ్‌సైట్: www.mrpl.co.in/

ఏపీ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 255

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.... ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన/లేటరల్ ఎంట్రీలో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం) ఉత్తీర్ణులై ఉండాలి.

స్పెషాలిటీ: అనస్థీషియా, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్, రేడియో థెరపీ, టీబీ అండ్ సీడీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, ఆప్తల్మాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ, ఎస్‌పీఎం.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించ కూడదు

ఎంపిక: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.1000. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 2

వెబ్‌సైట్: https://dme.ap.nic.in/



